

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 173

గురువారం 9-3-2023



చివరి పంచ్ ఎవరిదో?


నేటి నుంచి అహ్మదాబాద్ వేదికగా భారత్, ఆసీస్ మధ్య నాలుగో టెస్టు - 12లో



కనిష్టాల వద్ద కొనుగోళ్లు

స్వల్ప లాభాలతో గట్టెక్కిన సూచీలు.. సెన్సెక్స్ 124 పాయింట్లు లాభం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆస్ట్రేలియాతో మెరుగైన స్నేహబంధం

భారత్–ఆసీస్ మధ్య బలమైన స్నేహబంధం కోసం ఎదురుచూస్తున్నట్లు ఆసీస్ ప్రధాని అల్బనీస్‌ను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ అన్నారు.


వివరాలు 6లో ▸



త్రిపుర సీఎంగా మాణిక్ సాహా

త్రిపుర ముఖ్యమంత్రిగా బీజేపీ నేత మాణిక్ సాహా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా సాహాను ప్రధాని మోదీ అభినందించారు.

వివరాలు 6లో ▸



దేశం కోసం ధ్యానం

దేశ అభ్యున్నతి కోసం ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బుధవారం ధ్యానం, పూజలు, ప్రార్థనలు చేశారు.

వివరాలు 6లో ▸



కశ్మీర్‌పై పాక్ ఏడుపు

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కశ్మీర్ అంశాన్ని లేవదీసిన పాకిస్తాన్‌పై భారత్ ఘాటుగా స్పందించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

బ్యాగులు, బూట్లపై బురద కథనాలు



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్న 'జగనన్న విద్యాకానుక'పై కూడా ఏడుపుగొట్టు కథనాలతో 'ఈనాడు' మరోసారి తన నైజాన్ని చాటుకుంది. గతేడాది కంటే మంచి నాణ్యతతో బ్యాగులు, బూట్లు సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోగా.. బురద జల్లడంలో భాగంగా 'ఈనాడు' మరో తప్పుడు కథనాన్ని ప్రచురించింది.

వివరాలు 2 ▸

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవ వేడుకలను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళలను నాయకులు సన్మానించారు.

వివరాలు 3 ▸

లేడీస్ స్పెషల్



మహిళా దినోత్సవం సందర్భంగా 'లేడీస్ స్పెషల్' అంటూ కొత్త పోస్టర్స్‌తో తెలుగు సినీ ఇండస్ట్రీ కళకళలాడింది. పలు చిత్ర బృందాలు వారి సినిమాల్లోని కథానాయికల పోస్టర్స్‌ను విడుదల చేశాయి.

వివరాలు 12 ▸

బుమ్రా.. ఆరు నెలలు ఆటకు దూరం

- వివరాలు 12లో

ఇదం జగత్



ఇక్కడ కూడా అవసరమా..!

చేయూతతో రాణింపు

రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో అక్కచెల్లెమ్మల జీవితాల్లో కొత్త వెలుగులు

మూడేళ్లలో 8,65,918 కుటుంబాలు వ్యాపారాల బాట

- శాశ్వత జీవనోపాధికి ఊతంగా 'చేయూత' పథకం
- ప్రభుత్వ లబ్ధికి తోడు ప్రముఖ వ్యాపార సంస్థల ద్వారా అదనపు తోడ్పాటు
- నాడు బాబు రుణమాఫీ వంచన.. నేడు వైఎస్సార్ ఆసరాతో ఆదుకుంటున్న సీఎం జగన్
- ఆర్థిక స్వాతంత్ర్యం పెంపొందించేలా పొదుపు సంఘాల కార్యక్రమాలు
- రూ.20 లక్షల వరకు బ్యాంకు రుణాలు పొందే స్థాయికి సంఘాలు
- మూడున్నరేళ్లలో మొత్తం రూ.లక్ష కోట్లకుపైగా బ్యాంకు రుణాలు
- వివిధ పథకాలతో మరో రూ.32,470.33 కోట్లు నేరుగా ప్రయోజనం చేకూర్చిన రాష్ట్ర ప్రభుత్వం.. లబ్ధి పొందిన వారిలో బీసీ మహిళలే అత్యధికం
- ఆర్థిక లావాదేవీలపై జాతీయ సంస్థలతో శిక్షణ

2లో



శ్రీకాకుళం జిల్లా గార మండలం రామచంద్రాపురానికి చెందిన కె.సుగుణ కుమారి కుటుంబం మూడేళ్ల క్రితం దాకా ఇడ్లీలు విక్రయించి పొట్ట పోసుకుంది. కరోనాలో ఉపాధి పూర్తిగా కోల్పోయిన సమయంలో వైఎస్సార్ చేయూత ద్వారా ప్రభుత్వం ఆదుకుంది. మొదటి దఫా రూ.18,750 ఆర్థిక సాయంతోపాటు మరో రూ.50 వేలు బ్యాంకు రుణంగా ఇప్పించడంతో కిరాణా, ఫ్యాన్సీ షాపు ఏర్పాటు చేసుకుంది. తర్వాత మరో రెండు విడతల్లో చేయూత ద్వారా రూ.37,500 లబ్ధి చేకూరడంతో వ్యాపారాన్ని విస్తరించి షాపుపై ఆదాయంతో నిశ్చింతగా జీవిస్తోంది.

వనిత జీవితం మనకు ఆదర్శం

చిత్తూరు జిల్లా మహిళకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం జగన్

వెలుగులు నింపిన సీఎం జగనన్న: వనిత

- వివరాలు 2లో



ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వమిది

ఒకే విడతలో 1.34 లక్షల మందికి కొలువులు

- ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొనం.. గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టీకరణ
- సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును మేం ఎప్పటికీ మరువం
- కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుదోవ పట్టిస్తున్నారు
- ఉద్యోగులను రెచ్చగొడుతున్నారు
- వారి చర్యలను ఖండిస్తున్నాం

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఒకే విడతలో తమలాంటి 1.34 లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వం ఇది. ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే నిరసనలు, ఆందోళనల్లో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులం పాల్గొనం' అని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టంచేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానిపాషా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన వెంటనే

మిగతా 2వ పేజీలో ▶

కవితకు ఈడీ నోటీసులు

- ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తెలంగాణ ఎమ్మెల్సీ కవితను నేడు విచారణకు రావాలన్న ఈడీ
- ముందే ఖరారైన కార్యక్రమాల వల్ల రాలేనన్న కవిత
- అత్యవసరమైతే 11న, లేదంటే 15 తరువాత వస్తానంటూ ఈమెయిల్
- కవిత విజ్ఞప్తిపై తేల్చని ఈడీ
- మహిళా రిజర్వేషన్ల కోసం దీక్ష చేసేందుకు ఢిల్లీకి వచ్చిన కవిత

10లో



ఢిల్లీ చేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత

'స్కిల్' కుంభకోణంలో కీలక వ్యక్తి అరెస్టు

'సీమెన్స్' కంపెనీ మాజీ ఉద్యోగి జీవీఎస్ భాస్కర్‌ను అరెస్టు చేసిన సీఐడీ

- ప్రాజెక్టు వ్యయాన్ని రూ.3,300 కోట్లకు పెంచడంలో కీలకం
- అప్పటి టీడీపీ ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే ప్రాజెక్టు వ్యయం పెంపు
- సీమెన్స్ సమకూర్చింది రూ.58 కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్ మాత్రమే
- ప్రభుత్వ వాటా రూ.371 కోట్ల మేరకు వర్క్ ఆర్డర్
- అంతే మొత్తం చెల్లిస్తున్నట్లు భ్రాంతి కలిగించారు
- పక్కా పన్నాగంతోనే ఎంవోయూకు రూపకల్పన
- షెల్ కంపెనీల్లోనూ భాస్కర్‌ది కీలక పాత్ర
- ఆయన భార్యకే ఏపీఎస్ఎస్‌డీసీలో డిప్యూటీ సీఈవోగా పోస్టింగు



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో మరో కీలక వ్యక్తిని సీఐడీ అరెస్టు చేసింది. సీమెన్స్ ఇండస్ట్రియల్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఉద్యోగి జీవీఎస్ భాస్కర్‌ను ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఆయన నివాసంలో బుధవారం అదుపులోకి తీసుకుంది. అనంతరం ఆయన్ని కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తీసుకువస్తున్నారు. ఆయన్ని విజయవాడలోని కోర్టులో హాజరుపరుస్తారు. జీవీఎస్ భాస్కర్‌తో సహా ఈ కేసులో ఇప్పటివరకు సీఐడీ 8 మందిని అరెస్టు చేసింది.

ప్రాజెక్టు వ్యయాన్ని అడ్డగోలుగా పెంచేసి..

రూ. 371 కోట్ల ప్రజాధనాన్ని చంద్రబాబు ప్రభుత్వ పెద్దలు కొల్లగొట్టడంలో జీవీఎస్ భాస్కర్

మిగతా 3వ పేజీలో ▶

గ్రామాలను పట్టణాలకు కలుపుతూ మరో 976 కి.మీ. రోడ్లు

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 40:60 నిష్పత్తిన రూ.1,110.1 కోట్ల వ్యయం

తుది ఆమోదానికి 22న కేంద్రం, రాష్ట్ర అధికారుల భేటీ



సాక్షి, అమరావతి: గ్రామాలను సమీప పట్టణాలకు కలుపుతూ రాష్ట్రంలో మరో 976 కిలోమీటర్ల పొడవున కొత్త రోడ్ల నిర్మాణం జరగనుంది. పీఎంజీఎస్‌వైలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 40:60 నిష్పత్తిన మొత్తం రూ.1,110.1 కోట్లు వెచ్చించనున్నాయి. దీన్లో రూ.607.87 కోట్లతో 976 కిలోమీటర్ల రోడ్లు నిర్మించనుండగా, రూ.502.23 కోట్లతో 76 బ్రిడ్జిలు నిర్మిస్తారు. జిల్లాల వారీగా కొత్తగా నిర్మించే

మిగతా 2వ పేజీలో ▶

ఏపీలో 12 వేల ఎనర్జీ క్లబ్‌లు

20 శాతం సంస్థల్లో ఏర్పాటుకు ముందుకొచ్చిన బీఈఈ

- ఆర్థిక, సాంకేతిక సాయం అందజేత
- విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు అవగాహన
- ఆదర్శ పాఠశాలల్లో ఇప్పటికే 6.31 లక్షల యూనిట్ల విద్యుత్ ఆదాకు చర్యలు



సాక్షి, అమరావతి : విద్యుత్ పొదుపుపై అవగాహన పెంచి, భవిష్యత్ తరాలకు ఇంధన భద్రత కల్పించే దిశగా ఏపీ చేస్తున్న ప్రయత్నాలకు చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ) ముందుకొచ్చింది. రాష్ట్రంలోని 60 వేలకు పైగా ఉన్న విద్యా సంస్థల్లో దాదాపు 20శాతం సంస్థల్లో ఇంధన పొదుపు, సామర్థ్యంపై కార్యక్రమాలను అమలు చేసేందుకు అంగీకరించింది. ఏపీలో దాదాపు 12 వేల ఎనర్జీ క్లబ్‌లను విద్యార్థుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని బీఈఈ లక్ష్యంగా పెట్టుకుంది. వీటి ద్వారా విద్యార్థులు ఇంధన పొదుపు, సామర్థ్యం ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటారు. అంతే కాకుండా తమ తర్వాత తరాలకు ఆ విషయాలను చేరవేస్తారని, ఇంధన సామర్థ్య ఉపకరణాల వినియోగం పెరగడానికి ఇది దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల బీఈఈ ఫెసిలిటేషన్ సెంటర్ దేశంలో 73 ఎనర్జీ ఎఫిషియెన్సీ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్‌లను గుర్తించింది. వాటిలో 30 ఏపీకి చెందినవి ఉన్నాయి. 2030 నాటికి అన్ని రంగాల్లో 150 మిలియన్ టన్నుల చమురుకు సమానమైన(ఎంటీవోఈ) ఇంధనాన్ని ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో ఏపీ వాటా 6.68 ఎంటీవోఈగా నిర్దేశించింది. ఇందులో భాగంగా ఇంధన వృధాను నివారించడంతో పాటు.. సహజ వనరుల రక్షణకు విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ సహకారంతో ఎనర్జీ క్లబ్‌లకు అంకురార్పణ చేస్తోంది. లక్షలాది మంది విద్యార్థులను విద్యుత్ పొదుపు చర్యల అమల్లో భాగస్వాములను చేయనున్న ఈ క్లబ్‌లను బీఈఈ సహకారంతో ఇంధన శాఖకు చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్(ఏపీఎస్ఈసీఎం) ఏర్పాటు చేయనుంది. ఈ క్లబ్‌ల ద్వారా పొందిన అవగాహనతో వారి కుటుంబం, పొరుగు వారికి, సమాజానికి ఇంధన సామర్థ్య చర్యలపై విద్యార్థులు తెలియజేసేలా అధికారులు కార్యక్రమాలను రూపొందిస్తున్నారు.

ఉపాధ్యాయులు, విద్యార్థుల భాగస్వామ్యంతో మెరుగైన ఫలితాలు




ఒక పాఠశాలలోని విద్యార్థులు అదే పాఠశాలలోని విద్యార్థులతో, ఇతర పాఠశాలల విద్యార్థులతో ఇంధన సామర్థ్య చర్యలపై పరస్పరం చర్చించుకుని వాటిని మరింతగా ప్రోత్సహించడం, అమలు చేయడం ఈ క్లబ్‌ల ప్రధానోద్దేశం. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కూడా విద్యార్థులతో పాటు ఎనర్జీ క్లబ్‌లలో భాగస్వాములను చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. ఎనర్జీ క్లబ్‌లలో ఇంధన పొదుపుపై విద్యార్థులకు శిక్షణ, డిబేట్లు, క్విజ్, సైన్స్ పోటీలు, లఘు నాటిక (స్కిట్)లు, నాటకాలు వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక వనరులను బీఈఈ సమకూరుస్తుంది.

– అభయ్ బాక్రే, డైరెక్టర్ జనరల్, బీఈఈ.

ఆదర్శ పాఠశాలల్లో ఆదా

విద్యుత్ పొదుపుపై రాష్ట్రంలోని 85 ఆదర్శ పాఠశాలల్లో(మోడల్ స్కూల్స్) పైలట్ ప్రాజెక్ట్‌ను ఏపీఎస్ఈసీఎం అమలు చేస్తోంది. ఇప్పటికే వివిధ జిల్లాల్లోని మోడల్ స్కూళ్లలో పాత, వాడుకలో లేని ఉపకరణాల స్థానంలో విద్యుత్ ఆదా చేసే ఎల్‌ఈడీ బల్బులు, ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లు, ఎనర్జీ ఎఫెక్టివ్ ఫ్యాన్‌లతో భర్తీ చేసింది. 51 స్కూళ్లలో ఇలాంటి చర్యలతో ఏటా రూ.23 లక్షల విలువైన 3.79 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేసినట్లు ఏపీఎస్ఈసీఎం గుర్తించింది. ఈ లెక్కన మొత్తం 85 స్కూళ్లలో ఏటా సుమారు 6.31 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేయొచ్చని అంచనా వేసింది.

పాడి 'పరిశ్రమ'లకు కొత్త బాటలు



- ఇన్వెస్టర్స్ సదస్సులో రూ.1,020 కోట్ల విలువైన 8 ఒప్పందాలు
- విశాఖలో రూ.200 కోట్లతో పౌల్ట్రీ అండ్ ప్రాసెసింగ్ యూనిట్
- ప్రకాశం జిల్లాలో లిక్విడ్ ఎగ్ ప్రాసెసింగ్ ప్లాంట్.. గుంటూరులో ప్రొటీన్ ప్రాసెసింగ్ యూనిట్లు
- పులివెందులలో మెగా వ్యాక్సిన్ మాన్యుఫాక్చరింగ్ హబ్.. బాపట్ల, నూజివీడు, ఏలూరులో 4 మీట్ ప్రాసెసింగ్ యూనిట్లు
- ఆయా యూనిట్లు, ప్లాంట్ల ద్వారా 3,750 మందికి ఉద్యోగాలు

5లో

- వివరాలు 0లో

షీర్ వాల్ పద్ధతిలో నిర్మిస్తున్న ఇల్లు



షీర్ వాల్ టెక్నాలజీతో పేదల ఇళ్లు

ముందుకొచ్చిన పలువురు నిర్మాణదారులు

అమలాపురంలో పైలెట్‌గా మోడల్ ఇళ్ల నిర్మాణం

- వివరాలు 14లో

గవర్నర్‌తో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి భేటీ



గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను కలిసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు

సాక్షి, అమరావతి: గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు బుధవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో కలిశారు. గవర్నర్‌తో ఆయన మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

ఇంటింటా ఫీవర్ సర్వే

అధికారులకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశం



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా వైరల్ జ్వరాలు, ఫ్లూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆ శాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. బుధవారం వైద్యశాఖ అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు ప్రతి ఇంటికి వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి అవసరమైన వైద్యం అందించాలన్నారు. తీవ్ర లక్షణాలున్న వారిని జిల్లా, బోధనాస్పత్రులకు తరలించాలని, సీహెచ్‌సీల స్థాయి నుంచి బోధనాస్పత్రుల వరకు అన్ని చోట్ల జ్వర బాధితుల కోసం ప్రత్యేక ఓపీ సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. జ్వరం, దగ్గు, జలుబు ఇతర లక్షణాలున్న పిల్లలను బడులకు పంపవద్దని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతోన్న విద్యార్థులకు సెలవులు మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఉత్తర భారతంలో హెచ్ 3 ఎన్ 2 వైరస్ కొంత ప్రభావం చూపుతోందని, ఏపీలో ప్రస్తుతానికి ఆ పరిస్థితులు లేవని స్పష్టం చేశారు.

వైద్య శాఖ అప్రమత్తం: కృష్ణబాబు

ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉన్నట్టు తెలిపారు. తక్షణమే వారం రోజులపాటు ఫీవర్ సర్వే చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ, వార్డు వలంటీర్ల సేవల్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, బహిరంగ ప్రదేశాలు, జనసమ్మర్ద ప్రాంతాల్లో మాస్కులు పెట్టుకునేలా చర్యలు తీసుకునేలా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలని డీఎంహెచ్‌వోలకు ఆయన ఆదేశాలిచ్చారు. సమావేశంలో ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్, డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్, డీఎంహెచ్‌వోలు, జీజీహెచ్‌ల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

విశాఖలో ఐసీఐడీ 25వ కాంగ్రెస్

- 75వ ఐఈసీ సమావేశం కూడా...
- నవంబర్ 1 నుంచి 8 వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ
- హాజరుకానున్న 78 దేశాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు
- వ్యవసాయంలో నీటి ఎద్దడిని సమర్థంగా ఎదుర్కోవడమే అజెండా

సాక్షి, అమరావతి: ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) 25వ కాంగ్రెస్‌కు విశాఖపటంను వేదికగా ఆ సంస్థ ఎంపిక చేసింది. నవంబర్ 1 నుంచి 8 వరకు ఈ సమావేశాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఇందులో భాగంగానే ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఐఈసీ) 75వ సమావేశాన్ని కూడా ఐసీఐడీ నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయంలో నీటి ఎద్దడిని సమర్థంగా ఎదుర్కోవడమే ఈ కాంగ్రెస్ ప్రధాన అజెడా. ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో గత అక్టోబర్ 3 నుంచి 10 వరకు ఐసీఐడీ 24వ కాంగ్రెస్, 74వ ఐఈసీ సమావేశాలు జరిగాయి. అడిలైడ్ కాంగ్రెస్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున జలవనరులు, వ్యవసాయ శాఖల మంత్రులు అంబటి రాంబాబు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి నేతృత్వంలోని బృందం పాల్గొంది. ఐసీఐడీ 25వ కాంగ్రెస్‌ను మన రాష్ట్రంలోని విశాఖపట్నంలో నిర్వహించాలని ఆ సంస్థ నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కాంగ్రెస్‌ను ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర ప్రతినిధి బృందం అడిలైడ్ కాంగ్రెస్‌లో తెలిపింది. విశాఖ కాంగ్రెస్‌కు హాజరుకావాలని 78 దేశాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆహ్వానించింది. వ్యవసాయంలో నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొనే విధానాలను ప్రతిపాదిస్తూ నివేదికలను ఏప్రిల్ 30లోపు పంపాలని ఆ సంస్థ పేర్కొంది. ఇందులో ఉత్తమ విధానాలపై 25వ కాంగ్రెస్‌లో చర్చించనుంది.

72 ఏళ్ల తర్వాత: జలవనరుల సంరక్షణ, తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటల సాగు విధానాలపై అధ్యయనం చేసి, వాటి ఫలితాలను ప్రపంచానికి అందించడమే లక్ష్యంగా 1950 జూన్ 24న సిమ్లా వేదికగా ఐసీఐడీ ఆవిర్భవించింది. ఇందులో 78 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. తొలి కాంగ్రెస్‌ను 1951 జనవరి 11 నుంచి 16 వరకు ఢిల్లీలో నిర్వహించారు. మళ్లీ 72 ఏళ్ల తర్వాత మన దేశంలో.. అదీ విశాఖలో నిర్వహిస్తున్నారు. ప్రపంచానికి జల భద్రత చేకూర్చడం, తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటల సాగుకు దోహదం చేసే అత్యాధునిక నీటిపారుదల విధానాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. అత్యాధునిక విధానాలను సమావేశాల్లో ప్రదర్శిస్తారు. వాటిని అందిపుచ్చుకుని, నీటి వనరులను మరింత సమర్థంగా ఉపయోగించుకుని, అత్యధిక విస్తీర్ణంలో ఆయకట్టుకు నీరందించి, రాష్ట్రాన్ని సుభిక్షం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వమిది

▶ మొదటి పేజీ తరువాయి

ఎవరూ ఊహించని విధంగా చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో బృహత్తర ఆలోచనతో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.34 లక్షల మంది యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారు. ఈ 1.34 లక్షల కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును మా ఉద్యోగులెవరూ ఎప్పటికీ మరువలేరు. రాష్ట్రంలో కొంతమంది ఉద్యోగ సంఘాల నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఉద్యోగ వ్యవస్థలో సింహ భాగంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను తప్పుదోవ పట్టించేలా రెచ్చగొడుతూ, ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు పాల్పడేలా చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. సచివాలయ ఉద్యోగులు ఎవ్వరూ ఎటువంటి ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు, ఆందోళనల్లో పాల్గొనవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం' అని పేర్కొన్నారు. రెచ్చగొట్టే ఉద్యోగ నాయకులు ఎవ్వరూ మనకు ఉద్యోగాలు కల్పించలేదనే విషయం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరూ గుర్తుంచుకోవాలని సూచించారు.

గ్రామాలను పట్టణాలకు కలుపుతూ మరో 976 కి.మీ. రోడ్లు

▶ మొదటి పేజీ తరువాయి

రోడ్ల వివరాలతో రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు కేంద్రానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. దీనికి తుది ఆమోదం కోసం ఉగాది పండుగ రోజు (ఈ నెల 22న) కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ, రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల సమావేశం జరగనుంది. ఈ సమావేశం లాంఛనమేనని, రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలన్నింటికీ కేంద్రం ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు పీఎంజీఎస్‌వై ద్వారా రాష్ట్రంలో 1,291 కిలోమీటర్ల పొడవున 268 కొత్త రోడ్ల నిర్మాణం పూర్తిచేసినట్టు తెలిపారు. వాటికి సంబంధించి జనవరి నెలాఖరు వరకు బిల్లులను కూడా ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించిందని చెప్పారు.

వేతనజీవులు.. ఆంధ్రాలో అధికం



వేతన మహిళల సగటు	
దేశంలో	రాష్ట్రంలో
16.5%	17.2%

వేతనాలు పొందేవారిలో దేశ సగటును మించిన రాష్ట్రం

వేతన పురుషుల సగటు	
దేశంలో	రాష్ట్రంలో
23.6%	27.6%



- రాష్ట్రంలో స్వయం ఉపాధి మహిళలు 42.4%
- 40.4% మహిళలు సాధారణ కూలీలు
- స్వయం ఉపాధి పురుషులు 44%
- 28.4% పురుషులు సాధారణ కూలీలు

2021-22 లేబర్ ఫోర్స్ సర్వేలో వెల్లడి

సాక్షి, అమరావతి: దేశసగటు కన్నా రాష్ట్రంలోనే వేతన పురుషులు, మహిళల శాతం ఎక్కువగా ఉంది. ఈ విషయం కేంద్ర కార్యక్రమాల అమలు, గణాంకాల శాఖ నిర్వహించిన 2021–22 లేబర్ ఫోర్స్ సర్వేలో వెల్లడైంది. వేతన మహిళలు దేశంలో సగటున 16.5 శాతం ఉండగా, రాష్ట్రంలో 17.2 శాతం ఉన్నారు. వేతన పురుషులు దేశంలో సగటున 23.6 శాతం ఉండగా, రాష్ట్రంలో 27.6 శాతం ఉన్నారు. రాష్ట్రంలో పట్టణాల్లో పురుషులతో సమానంగా మహిళలు కూడా వేతనాలపై జీవిస్తున్నారు. పట్టణాల్లో 48.8శాతం వేతన పురుషులుండగా, 47.8శాతం వేతన మహిళలున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాష్ట్రంలో 15.7 శాతం వేతన పురుషులు ఉండగా, 9.7శాతం వేతన మహిళలున్నారు. కోవిడ్ ప్రభావం నేపథ్యంలో లేబర్ ఫోర్స్ సర్వేలో జాప్యం జరిగిందని నివేదికలో పేర్కొన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేతన పురుషులు, మహిళలు, స్వయం ఉపాధిపై ఆధారపడినవారు, సాధారణ కూలీల శాతంపై సర్వే నిర్వహించారు. రాష్ట్రంలో 44 శాతం పురుషులు, 42.4 శాతం మహిళలు స్వయం ఉపాధిపై ఆధారపడి జీవిస్తున్నారు. రాష్ట్రంలో సాధారణ కూలీలుగా 40.4 శాతం మహిళలు, 28.4 శాతం పురుషులు ఉపాధి పొందుతున్నారు.

ఢిల్లీ, చండీగఢ్, కేరళల్లో వేతన మహిళలు అత్యధికం

ఢిల్లీ, చండీగఢ్, కేరళల్లో వేతన పురుషుల కన్నా వేతన మహిళలు ఎక్కువగా ఉన్నారు. ఢిల్లీలో వేతన మహిళలు 83 శాతం కాగా వేతన పురుషులు 63.3 శాతమే. చండీగఢ్‌లో వేతన మహిళలు 67.7 శాతం కాగా వేతన పురుషులు 61.5 శాతం, కేరళలో వేతన మహిళలు 37.3 శాతం, వేతన పురుషులు 27.5 శాతం ఉన్నారు. బిహార్‌లో అత్యల్పంగా వేతన పురుషులు 9.9 శాతం ఉండగా వేతన మహిళలు 10.7 శాతం ఉన్నారు. వేతన మహిళల్లో జార్ఖండ్‌లో అత్యల్పంగా 6.3 శాతం, ఆ తరువాత మధ్యప్రదేశ్‌లో 7.7 శాతం, రాజస్థాన్‌లో 7.6 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 6.7 శాతం ఉన్నారు.

వనిత జీవితం.. మనకు ఆదర్శం..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్ ట్విట్టర్‌లో వనిత వీడియో

సాక్షి, అమరావతి/చిత్తూరు అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని మహిళలందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. 'జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కొని.. తన బిడ్డల కోసం ఒంటరి పోరాటం చేస్తూ సమాజానికి ప్రేరణగా నిలిచిన చిత్తూరు జిల్లాకు చెందిన వనిత జీవితం మనకు ఆదర్శం. వనితకు, రాష్ట్ర ప్రజలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు' అంటూ బుధవారం ఆయన ట్వీట్ చేశారు. ట్వీట్‌కు ఓ వీడియోను షేర్ చేశారు. ఆ వీడియోలో వనిత తన సందేశాన్ని అందించారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో గంగాధర నెల్లూరు ప్రజలతో పాటు వనిత ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఆ వీడియోలో టి.వనిత ఏమన్నారంటే..

వెలుగులు నింపిన సీఎం జగనన్న: వనిత

'చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలం కలిజవేడు పంచాయతీలోని బొమ్మవారి పల్లెలో నివసిస్తున్నాను. నాకిద్దరు ఆడ పిల్లలు పుట్టారు. దీంతో నా భర్త ఇద్దరూ ఆడ పిల్లలేనా అనేవాడు. భర్తతో గొడవలు కావడంతో పుట్టింటికి వచ్చేశాను. అదే సమయంలో మా నాన్నకు గుండెపోటు వచ్చి చనిపోయారు. అమ్మకు కూడా అనారోగ్యం. అమ్మతో పాటు పిల్లల పెంపకం భారమంతా నాపై పడింది. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో నాకు వలంటీర్‌గా అవకాశం వచ్చింది. వలంటీర్‌గా చేస్తూ.. పిల్లలను గంగాధర నెల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో చేర్చాను. ఆసరా, సున్నా వడ్డీ డబ్బులు అందుతున్నాయి. ఆ డబ్బుతో ఒక ఆవు కొన్నాను. ఆవు పాలు అమ్ముతూ కూడా డబ్బు సంపాదిస్తున్నాను. ఏ దిక్కూ తోచని అయోమయ స్థితిలో ఉన్నప్పుడు సీఎం జగన్ అన్నలాగా తోడు ఉండి ఏ వెలుగూ లేని నా జీవితంలో ఆసరా, సున్నా వడ్డీ డబ్బులు ఇచ్చి వెలుగులు నింపారు. ఎన్ని జన్మలెత్తినా సీఎం జగనన్న రుణం తీర్చుకోలేనిది. సీఎం జగనన్నకు ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను' అని వనిత ఆ వీడియోలో పేర్కొన్నారు.

చేయూతతో రాణింపు

శాశ్వత జీవనోపాధికి ఊతంగా 'చేయూత' పథకం





వైఎస్సార్ చేయూత పథకం ద్వారా సాయం పొంది మహిళలు ఏర్పాటు చేసుకున్న షాపులు

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం మండలం గోకుల బృందావనం గ్రామానికి చెందిన ఏ.రమాదేవి కుటుంబం రెండేళ్ల క్రితం వరకు పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవించింది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పున వరుసగా మూడేళ్లు రూ.56,250 మేర అందించడంతో ఆ కుటుంబం కొత్తగా వ్యాపారం ప్రారంభించుకునేందుకు ముందుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 వేలు బ్యాంకు రుణం కూడా ఇప్పించింది. దీంతో రమాదేవి కుటుంబం గ్రామంలోనే కిరాణా సరుకుల దుకాణం ప్రారంభించి తొలిసారి వ్యాపారం బాట పట్టింది.

గతంలో పొదుపు సంఘాలకు రూ.రెండు మూడు లక్షలకు మించి బ్యాంకు రుణాలు అందని పరిస్థితి. ఇప్పుడు పొదుపు మహిళలు వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకం ద్వారా సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లిస్తుండడంతో విరివిగా రుణాలందుతున్నాయి. తమ సంఘానికి ఏకంగా రూ.20 లక్షల రుణం రావడంతో తన వాటా డబ్బులతో ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లకు చెందిన బండి రమణ ఊళ్లో జిరాక్స్ షాపు ఏర్పాటు చేసుకుంది. బధిరురాలైన రమణకు మాట సరిగా రాదు. మూడేళ్ల క్రితం వరకు ఇళ్లలో బట్టలు ఉతుకుతూ జీవించిన రమణ సొంతంగా షాపు ప్రారంభించి సగర్వంగా ఉపాధి పొందుతున్నట్టు 'రాధా స్వయం సహాయక సంఘం' గ్రూపు లీడర్ రజని 'సాక్షి'కి తెలిపింది.

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో మహిళలు ఆర్థిక స్వాతంత్య్రంతో నిజమైన సాధికారిత దిశగా సాగుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ గత మూడేళ్లలో 8,65,918 నిరుపేద కుటుంబాలు కొత్తగా వ్యాపారాల బాట పట్టాయి. ఇప్పటిదాకా గ్రామాల్లో కూలి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు, చేతి వృత్తులతో తగినంత ఆదాయం లేక సతమతమవుతున్న కుటుంబాలు ప్రభుత్వ సాయంతో నిలదొక్కుకుంటున్నాయి. వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న మహిళలకు శాశ్వత జీవనోపాధి కల్పించడం, వ్యాపారాల్లో తోడ్పాటు అందించే లక్ష్యంతో హిందూస్థాన్ యూనీ లీవర్, ప్రాక్టర్ అండ్ గ్యాంబల్, ఐటీసీ, రిలయెన్స్ లాంటి ప్రముఖ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. వాటి సహకారంతో కొత్తగా వ్యాపారాలు ప్రారంభించిన పేదింటి మహిళలు ఎలాంటి ఒడుదొడుకులు లేకుండా లాభదాయకంగా నడిపిస్తున్నారు. పొదుపు సంఘాల సభ్యులైన పేదింటి మహిళలు గ్రామీణ ప్రాంతాల్లో 21 మండల కేంద్రాల్లో సూపర్ మార్కెట్లను నెలకొల్పి వ్యాపారాల్లో సత్తా చాటుతున్నారు.

నేరుగా రూ.32,470.33 కోట్లు లబ్ధి..

గత అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలోని పొదుపు సంఘాల మహిళల పేరిట బ్యాంకుల్లో ఉన్న అప్పుల భారం మొత్తాన్ని ప్రభుత్వం తొలగిస్తోంది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా దాదాపు 80 లక్షల మంది పొదుపు సంఘాల మహిళల అప్పుల భారాన్ని నాలుగు విడతల్లో నేరుగా చెల్లిస్తోంది. మొత్తం రూ.25,517 కోట్ల రుణంలో ఇప్పటికే రెండు విడతల్లో రూ.12,578.28 కోట్లను వారికి నేరుగా ప్రభుత్వం అందజేసింది. దీనికి తోడు గత మూడున్నరేళ్లలో సకాలంలో రుణాలు చెల్లించిన పొదుపు సంఘాల మహిళల వడ్డీ భారం రూ.3,615.29 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వమే భరించింది. మరోవైపు 45 నుంచి 60 ఏళ్ల వయసు ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా, ఇతర ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఈబీసీ నేస్తం పథకం ద్వారా ప్రత్యక్షంగా ఆర్థిక లబ్ధి చేకూర్చింది. కాపు సామాజిక వర్గం మహిళలకు వేరుగా కాపు నేస్తం పేరుతో ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చింది. మొత్తం 34.19 లక్షల మంది మహిళలకు ఈ మూడు పథకాల ద్వారా మరో రూ.16,276.76 కోట్ల లబ్ధి చేకూర్చింది. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 34 సంక్షేమ పథకాలను అమలు చేస్తుండగా కేవలం ఈ ఐదు పథకాల ద్వారానే మహిళలకు నేరుగా రూ.32,470.33 కోట్ల మేర ప్రయోజనాన్ని అందించింది.

అప్పుల ఊబి నుంచి ఆదర్శంగా..

ప్రత్యక్షంగా మహిళలకు లబ్ధి చేకూర్చడానికి తోడు రాష్ట్రంలో 90 లక్షల మందికిపైగా పొదుపు సంఘాల మహిళలకు గత మూడున్నరేళ్లలో తక్కువ వడ్డీకి రూ.1.05 లక్షల కోట్ల మేర బ్యాంకు రుణాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇప్పించింది. ఫలితంగా ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాల్లో మూడో వంతుకు పైగా సంఘాలు రూ.10 లక్షలకు పైగా రుణాలు పొందాయి. చంద్రబాబు అధికారంలో ఉండగా డ్వాక్రా రుణమాఫీ హామీని నిలబెట్టుకోకుండా మోసం చేయడంతో మహిళా సంఘాలు అప్పుల ఊబిలోకి కూరుకుపోయాయి. ఇప్పుడు పొదుపు సంఘాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన చేయూతతో రాష్ట్రంలో 99.7 శాతం సంఘాలు సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లిస్తూ దేశంలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. బ్యాంకుల నుంచి మునుపెన్నడూ లేని రీతిలో పెద్ద ఎత్తున రుణాలు లభిస్తున్నాయి. ఈ క్రమంలో మహిళలకు ప్రత్యేకించి పొదుపు సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ కార్యక్రమాలను సైతం ప్రభుత్వం ప్రారంభించింది. దేశంలో అత్యున్నత సంస్థగా భావించే నేషనల్ అకాడమీ ఆఫ్ ఆర్‌యూడీఎస్‌టీ ద్వారా పొదుపు సంఘాల మహిళలకు సెర్ప్‌తో శిక్షణ ఇస్తోంది.

గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 లక్షలకు మించి రుణం పొందిన పొదుపు సంఘాలు

రేంజ్	సంఘాల సంఖ్య
రూ. 10 లక్షలు	1,74,118
రూ. 10 నుంచి11 లక్షలు	7,483
రూ. 11 నుంచి 12 లక్షలు	14,168
రూ. 12 నుంచి 13 లక్షలు	15,120
రూ. 13 నుంచి 14 లక్షలు	4,927
రూ. 14 నుంచి 15 లక్షలు	35,782
రూ. 15 నుంచి 16 లక్షలు	2,430
రూ. 16 నుంచి17 లక్షలు	1,615
రూ. 17 నుంచి 18 లక్షలు	3,323
రూ. 18 నుంచి 19 లక్షలు	363
రూ. 19 నుంచి 20 లక్షలు	41,139
మొత్తం	3,00,468

నోట్: ఒక్కో పొదుపు సంఘంలో కనీసం పది 10 మంది సభ్యులుగా ఉంటారు

గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 లక్షలకు పైబడి రుణాలు పొందుతున్న సంఘాలు సామాజిక వర్గాలవారీగా

సంఘ మహిళల సామాజికవర్గం	సంఘాల సంఖ్య
బీసీలు	1,45,575
మైనార్టీలు	11,522
ఓసీలు	75,997
ఎస్సీలు	59,126
ఎస్టీలు	8,248
మొత్తం	3,00,468

వ్యవసాయ విద్య బలోపేతానికి సర్వే

- 30 ప్రశ్నలతో ఆన్‌లైన్ సర్వే చేపట్టిన ఐసీఏఆర్
- నాన్ అగ్రికల్చర్ కోర్సులు చేసిన వారినుంచి అభిప్రాయాల సేకరణ



సాక్షి, అమరావతి: దేశంలో వ్యవసాయ ఉన్నత విద్య (అగ్రికల్చరల్ హయ్యర్ ఎడ్యుకేషన్)ను బలోపేతం చేయడం, క్రమబద్ధీకరించే చర్యల్లో భాగంగా కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) సర్వేకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయేతర కోర్సులైన బీఈ, బీటెక్ వంటి కోర్సులు పూర్తిచేసిన వారి అనుభవాలు, వారి ఆదాయం, ఇతర అంశాలపై అభిప్రాయ సేకరణ చేపట్టింది. నేషనల్ అగ్రికల్చరల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ (ఎన్ఏహెచ్ఈపీ)లో భాగంగా గ్రాడ్యుయేట్ ఇన్‌కమ్ ఇండెక్స్ (జీఐఐ) కింద ఈ సర్వేను ప్రారంభించింది. దేశంలో వ్యవసాయ విద్యను మరింత ప్రయోజనకరంగా బలోపేతం చేసి తీర్చిదిద్దేందుకు ఈ సర్వేలోని అంశాలు తోడ్పడతాయని ఐసీఏఆర్ అభిప్రాయపడుతోంది. ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సాయంతో ఈ ప్రాజెక్ట్‌ను ఐసీఏఆర్ చేపట్టింది. యూజీసీ అనుమతి పొందిన విశ్వవిద్యాలయాలు, కాలేజీల పూర్వ విద్యార్థుల నుంచి అభిప్రాయాలను సేకరించనుంది. ఇప్పటికే ఉన్నత విద్యాసంస్థలు ఆయా పూర్వ విద్యార్థుల నుంచి వివరాలు సేకరించి ఉంటే తమకు ఎంతగానో తోడ్పడతాయని అభిప్రాయపడుతోంది. యూజీసీ ఆమోదించిన బీ.టెక్ వంటి నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు అందిస్తున్న విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు తమ పూర్వ విద్యార్థులందరినీ ఈ సర్వేలో పాల్గొనేలా సహకారం అందించాలని ఐసీఏఆర్ కోరింది. అగ్రికల్చర్, అనుబంధ నేపథ్య కోర్సులు మినహా బీఈ, బీఫార్మా, హెచ్ఎంసీటీ తదితర కోర్సులు చేసిన పూర్వ విద్యార్థుల అభిప్రాయాలను ఈ సర్వే ద్వారా సేకరించనున్నారు. ఈ నెల 15లోగా అభ్యర్థుల నుంచి అభిప్రాయాలు అందేలా చూడాలని యూజీసీ ఆయా వర్సిటీలు, కాలేజీలకు సూచించింది. ఇందుకు సంబంధించి 30 ప్రశ్నలతో కూడిన ఆన్‌లైన్ సర్వే లింకును కూడా ఐసీఏఆర్ అందుబాటులో ఉంచింది. డిగ్రీలు పూర్తి చేసి ఒక ఏడాది పాటు ఏదైనా సంస్థలో ఉద్యోగం చేస్తున్న వారంతా వారి అభిప్రాయాలు తెలపాలని కోరింది. యూజీసీ వెబ్‌సైట్‌లోనూ ఇందుకు సంబంధించిన వెబ్‌లింక్‌ను పొందుపరిచింది.

బ్యాగులు, బూట్లపై బురద కథనాలు

జగనన్న విద్యా కానుకపై 'ఈనాడు' మళ్లీ అదే ఏడుపు

- ఎక్కువ ధరలకు కొంటున్నారంటూ తప్పుడు ఆరోపణలు
- గతేడాది కంటే మంచి నాణ్యతతో సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్న 'జగనన్న విద్యాకానుక'పై ఏడుపుగొట్టు కథనాలతో ఈనాడు మరోసారి తన నైజాన్ని చాటుకుంది. రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమంలో భాగంగా విద్యాకానుక గుత్తేదార్లకేనంటూ ఓ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. ఈనాడు కథనం పూర్తిగా అవాస్తవాలతో కూడుకున్నదని 'ఫ్యాక్ట్ చెక్'లో వెల్లడైంది. గతంలోనూ ఇదే తరహా కథనాలు ప్రచురించడం తెలిసిందే.

ఈనాడు ఆరోపణ: ఈసారి బూట్లపై రూ.14 అధికం

వాస్తవం: జీవో 172 ప్రకారం ఒక జత బూట్లు, 2 జతల సాక్సుల కొనుగోళ్లకు ఆమోదించిన వ్యయం రూ.200. అయితే రివర్స్ టెండర్లతో రూ.187.48కే టెండర్ ఖరారు చేశారు. ఇది ప్రభుత్వం ఆమోదించిన ధర కంటే 10 శాతం తక్కువ కావడం గమనార్హం

ఆరోపణ: బ్యాగ్‌పై సగటున రూ.92 అధికం

వాస్తవం: జీవో 172 ప్రకారం ఒక్కో బ్యాగు కొనుగోలు కోసం ప్రభుత్వం ఆమోదించిన వ్యయం రూ.265.50. మొదటిసారి టెండర్లలో కాంట్రాక్టర్లు 30 శాతం అధికంగా రేటు కోట్ చేయడంతో వాటిని రద్దు చేసి రెండోసారి పిలిచారు. రివర్స్ టెండర్ల ద్వారా నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఒక్కో బ్యాగును రూ.272.92 చొప్పున ఖరారు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఇది కేవలం 2.43 శాతం అధికం. బ్యాగు నాణ్యత పెరగడంతో ప్రభుత్వం అనుమతించిన గరిష్ట పరిమితి యూనిట్ వ్యయం 5 శాతం మించకుండా టెండర్లు ఖరారు చేశారు.

ఆరోపణ: చిరిగిన బ్యాగ్‌ల సరఫరాపై చర్యలు శూన్యం

వాస్తవం: జగనన్న విద్యాకానుక 3వ విడతలో చిరిగిన, పాడైన బ్యాగులకు సంబంధించి జేవీకే యాప్ ద్వారా ప్రధానోపాధ్యాయుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అలాంటి బ్యాగులు రీప్లేస్ చేయని సరఫరాదారులకు ఆ మేరకు చెల్లింపులు నిలిపివేశారు.

ఆరోపణ: ముగ్గురు పాత కాంట్రాక్టర్లే

వాస్తవం: టెండర్ నిబంధనల ప్రకారం అనుమతించారు. కొత్త కాంట్రాక్టర్లు కూడా పాల్గొనేలా అవకాశం కల్పిస్తూ బ్యాగులు, బూట్లకు సంబంధించి పెద్ద టెండర్లను ఐదు రీజియన్లుగా విభజించి పిలిచారు. దీనివల్ల ఏకపక్ష ఆధిపత్యం ఉండదు.

ఆరోపణ: బూట్లు, బ్యాగ్‌ల ధరలు భారీగా పెరిగాయి.

వాస్తవం: ప్రభుత్వం అనుమతించిన మేరకు మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా కేవలం ఒక్క శాతం పెరుగుదలతో మాత్రమే టెండర్లను ఖరారు చేశారు.

ఆరోపణ: విద్యార్థులు తగ్గినా రూ.155.84 కోట్లు అదనపు భారం

వాస్తవం: యూడైస్ గణాంకాల ఆధారంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో 5 శాతం పెరుగుదల లెక్కించి టెండర్లు ఆహ్వానిస్తుంటారు. డెలివరీ షెడ్యూల్ ఇచ్చేటప్పుడు మాత్రం విద్యార్థుల యథార్థ సంఖ్యను పరిగణలోకి తీసుకుంటారు. ఆ ప్రకారం 39,96,064 మంది విద్యార్థులను పరిగణనలోకి తీసుకుని సరఫరా షెడ్యూల్ ఇచ్చారు. ప్రభుత్వం అనుమతించిన విధంగా 5శాతానికి మించకుండా టెండర్లు ఖరారు చేశారు. ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన వ్యయం కంటే తక్కువ బడ్జెట్‌లోనే విద్యార్థులందరికీ విద్యాకానుక కిట్లు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం



సన్మానం పొందిన మహిళా ఉద్యోగులతో వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. మహిళా ఉద్యోగుల సేవలు ఎంతో అమూల్యమైనవని పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు, శాసన మండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకంలో మహిళలకు భాగస్వామ్యం ఉంటుందని అన్నారు. మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందనే ప్రగాఢ విశ్వాసంతో సీఎం వైఎస్ జగన్ పని చేస్తున్నారని తెలిపారు. అందుకే నామినేటెడ్ పోస్టుల్లో, అధికారిక పదవుల్లో 50 శాతం పైగా స్థానాలు మహిళలకే కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

పథకాలతో పెరుగుతున్న మహిళల కొనుగోలు శక్తి

వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి



సాక్షి అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళల సాధికారత కోసం వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర సర్కారు అనేక పథకాల కింద నేరుగా స్త్రీల బ్యాంకు ఖాతాల్లోకి నగదు బదిలీ చేయడం వల్ల వారికి సాధికారతతో పాటు వారి కొనుగోలు శక్తి ఏటేటా పెరుగుతోందని చెప్పారు. ''గ్రామ, వార్డు వలంటీర్లు ముఖ్యమైన ప్రభుత్వ సమాచారం మహిళలకు ఇంటివద్దే అందిస్తున్నారు. రేషన్ ఇళ్లకే తెచ్చి ఇస్తున్నారు. మహిళలు చిన్న చిన్న అవసరాలకు బయటకు పరుగులు తీసే అవసరం లేకుండా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలు వారికి అండగా నిలుస్తున్నాయి. మహిళా పోలీసు వ్యవస్థ, దిశ చట్టం, దిశ యాప్ ఆడపడుచుల భద్రతకు అన్ని గ్రామాల్లో రక్షణ కవచంలా పనిచేస్తున్నాయి. అఖిలాంధ్ర మహిళాలోకం కోసం దివంగత సీఎం వైఎస్సార్ ప్రవేశపెట్టిన అనేక పథకాలకు అదనంగా ఇప్పటి వైఎస్సార్‌సీపీ సర్కారు అమలు చేస్తున్న పలు కార్యక్రమాలు మున్నెన్నడూ లేని స్థాయిలో మహిళల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతున్నాయి'' అని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

సీఎస్‌ను కలిసిన ఏపీ జేఏసీ అమరావతి నేతలు

సాక్షి, అమరావతి: ఏపీ జేఏసీ అమరావతి నేతలు బొప్పరాజు వెంకటేశ్వర్లు, వలిశెట్టి దామోదరరావు తదితరులు బుధవారం విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డిని కలిశారు. మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం నిర్వహించిన చర్చల్లో ఇచ్చిన హామీలను లిఖితపూర్వకంగా మినిట్స్ ద్వారా తమకు ఇవ్వాలని కోరారు. ఆ తర్వాత తమ ఉద్యమ కార్యాచరణ కొనసాగింపు గురించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఉద్యమ కార్యాచరణను నిలిపివేయాలని మంత్రులు కోరిన నేపథ్యంలో ఇచ్చిన హామీలను రాతపూర్వకంగా తమకు తెలపాలని కోరినట్లు పేర్కొన్నారు.

టీడీపీని గెలిపిస్తే మహిళలకు సముచిత స్థానం

జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్



వాల్మీకిపురం: వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. యువగళం పాదయాత్ర 38వ రోజు బుధవారం చింతపర్తి నుంచి ప్రారంభమై వాల్మీకిపురం మీదుగా మదనపల్లి మండలం పూలవాండ్లపల్లి వరకు సాగింది. మహిళా దినోత్సవం సందర్భంగా చింతపర్తిలో మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని, దాడులను అరికడతామని చెప్పారు. అనంతరం వాల్మీకిపురంలో ఏర్పాటు చేసిన మైనార్టీల సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో ముస్లింలపై దాడులు పెరిగాయని.. రంజాన్ తోఫా, దుల్హన్ పథకం, విదేశీ విద్యా పథకాలకు మంగళం పాడారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మైనార్టీలకు సముచిత స్థానం కల్పించి, వక్ఫ్ బోర్డును బలోపేతం చేస్తామన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి అమరనాథ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అనిత తదితరులు పాల్గొన్నారు.

లాభాల తీపి పెంచేలా

బెల్లంతో చాక్లెట్లు, కేకులు, ఓట్స్ కుకీస్, పాస్తా, కాఫీ ప్రీమిక్స్, న్యూట్రీ బార్స్

- బెల్లం పొడితోపాటు పానకం తయారీ
- అల్లం, ఉసిరి ముక్కలు, సోంపు గింజలకు బెల్లం కోటింగ్
- అనకాపల్లి చెరకు పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ



బెల్లం దిమ్మలు, పాకం, పొడర్

సాక్షి, అమరావతి

పంచదారతో పోలిస్తే బెల్లంలో పోషక విలువలు ఎక్కువ. ఔషధ గుణాలకూ కొదవ లేదు. జీర్ణశక్తిని పెంచడం.. రక్తహీనతను తగ్గించడం వంటి సుగుణాలెన్నో బెల్లానికి ఉన్నాయి. అయినా పంచదారకు ఉన్నంత డిమాండ్ బెల్లానికి లేదు. ఈ నేపథ్యంలోనే బెల్లంతో విలువ ఆధారిత ఇతర ఉత్పత్తుల్ని తయారు చేయడంపై అనకాపల్లి చెరకు పరిశోధనా కేంద్రం చెరకు రైతులకు, బెల్లం తయారీదారులకు శిక్షణ ఇస్తోంది. తద్వారా వారి ఆదాయాలను.. మరోవైపు బెల్లం వినియోగాన్ని పెంచేందుకు కృషి చేస్తోంది.

బెల్లం పొడి.. మంచి రాబడి

గ్లూకోజ్, ఫ్రక్టోజ్, ఇతర లవణాలు, ప్రొటీన్ల వల్ల త్వరగా బూజు పట్టడం, నీరు కారటం వంటి కారణాల వల్ల బెల్లం నాణ్యత చెడిపోతుంది. దీనిని నివారించేందుకు అనకాపల్లి చెరకు పరిశోధనా కేంద్రం బెల్లాన్ని పొడి రూపంలో మార్చే సాంకేతికతను అభివృద్ధి చేసింది. ఈ పొడి గోధుమ వర్ణంలో పంచదార రేణువుల్లా ఉంటుంది. దీనికి అమెరికా, ఫిలిప్పీన్స్, కొలంబియా, ఇండోనేషియా దేశాల్లో డిమాండ్ ఎక్కువ. చెరకు రసాన్ని స్థిరీకరించిన మోతాదులో స్ప్రే డ్రైయింగ్ ద్వారా పొడి రూపంలో మార్చుకోవచ్చు.



బెల్లం పానకం

చెరకు రసాన్ని శుద్ధి చేసి మరగబెట్టిన తరువాత చిక్కటి పానకం తయారవుతుంది. దీనిని దోశ, ఇడ్లీలు, గారెలు, రొట్టెలతో చట్నీ లేదా తేనె మాదిరిగా కలిపి తింటారు. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో దీనిని చపాతీలు, పూరీల్లో కూడా వాడుతుంటారు. పరిశోధనా కేంద్రం అభివృద్ధి చేసిన జాగరీ ప్లాంట్ ద్వారా హానికరమైన రసాయనాలను తొలగించి బెల్లం పానకం లేదా బెల్లం, బెల్లం పొడిని తయారు చేస్తారు.

బెల్లం పాకం సీసాలు, బెల్లం పొడర్ ప్యాకెట్లు

బెల్లం కాఫీ ప్రీమిక్స్.. జెల్లీస్.. సోంపు



బెల్లం పొడిని పాలు, యాలకుల పొడితో కలిపి ప్రీమిక్స్ మిశ్రమాన్ని తయారు చేసుకోవచ్చు. దీనిని 7.5 గ్రాముల మోతాదులో 100 గ్రాముల వేడి నీళ్లలో కలిపితే రుచికరమైన కాఫీ తయారవుతుంది. 100 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద 5 నిమిషాలు మరిగించిన చెరకు రసానికి తగిన మోతాదులో జెలటిన్ అడార్ జెల్‌ని కలిపి చల్లారిన తర్వాత మౌల్డ్‌లో వేసుకుని శీతల ఉష్ణోగ్రత వద్ద భద్రపరిస్తే బెల్లం జెల్లీ రెడీ అవుతుంది. అల్లం లేదా ఉసిరిని శుభ్రంగా కడిగి ముక్కలుగా కోసుకొని డ్రయ్యర్‌లో ఆరబెట్టి బెల్లం కోటింగ్ మెషిన్‌లో 30-70 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద తగినంత నీరు కలిపిన బెల్లం పొడి ద్రావణాన్ని కొద్దికొద్దిగా వేస్తే బెల్లం కోటింగ్‌తో రుచికరమైన అల్లం, ఉసిరి ముక్కలు తయారవుతాయి. అదేరీతిలో సోంపును కూడా తయారు చేసుకోవచ్చు.

చాక్లెట్లు.. కేకుల తయారీ ఇలా



డబుల్ బాయిలింగ్ పద్ధతిలో కరిగించిన వెన్నలో కోకో, బెల్లం పొడి కలిపిన మిశ్రమానికి జీడిపప్పు, బాదం పప్పు ముక్కలు అద్ది చాక్లెట్ అచ్చులలో వేయడం ద్వారా చాక్లెట్లు తయారవుతాయి. ఇదే తరహాలో చోడి పిండి, బెల్లం పొడి కలిపి కూడా చాక్లెట్లను తయారు చేసుకోవచ్చు. బెల్లం కేకు తయారీ కోసం కరిగించిన వెన్నలో బెల్లం పొడి, గోధుమ పిండిలో బేకింగ్ పౌడర్లను కలిపి తయారు చేసుకున్న మిశ్రమానికి కొద్దికొద్దిగా నీళ్లు వేస్తూ కాస్త జారుగా వచ్చేటట్లు కలుపుకోవాలి. ఆ తరువాత మైక్రో ఓవెన్‌లో 100-190 డిగ్రీల సెంటీగ్రేడ్‌లో 20 నిమిషాల పాటుచేసి.. 5 నిమిషాలపాటు చల్లారిస్తే రుచికరమైన కేక్ తయారవుతుంది.

ఓట్స్ కుకీస్.. న్యూట్రీ బార్స్

వెన్న, బెల్లం పొడి కలిపిన మిశ్రమంలో గోధుమ పిండి, బేకింగ్ పౌడర్, నానబెట్టిన ఓట్స్, యాలకుల పొడివేసి కలిపిన మిశ్రమాన్ని పాలు లేదా నీళ్లు వేసి చపాతి ముద్దలా చేసి డీప్ ఫ్రిజ్‌లో 10 నిమిషాలు పెట్టాలి. ఆ తర్వాత చపాతి కర్రతో ఒత్తుకుని కావాల్సిన ఆకారాల్లో బిస్కెట్లుగా కోసి ట్రేలో అమర్చి మైక్రో ఓవెన్‌లో 120 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత దగ్గర 20 నిమిషాల పాటు బేకింగ్ చేస్తే రుచికరమైన బెల్లం ఓట్స్ కుకీస్ తయారవుతాయి.



న్యూట్రీ బార్స్ తయారీ విషయానికి వస్తే.. బెల్లం లేత పాకం వచ్చిన తర్వాత తొలుత కొర్రలు, సామలు, జొన్నల మిశ్రమాన్ని ఆ తర్వాత వేరుశనగ పప్పు, బెల్లం, యాలకుల పొడిని వేసి బాగా కలిపి ట్రేలో వేసి సమానమైన ముక్కలు చేసి చల్లారనివ్వాలి. ఇలా తయారైన న్యూట్రీ బార్లను ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి గాలి చొరబడని ప్రదేశంలో భద్రపర్చుకోవాలి.

పాస్తా.. నూడిల్స్



బెల్లంతో నూడిల్స్ లేదా పాస్తా తయారు చేసుకోవచ్చు. ఫుడ్ ఎక్స్‌ట్రూడర్ అనే మెషిన్‌లో గంటకు 25-35 కేజీల వరకు పాస్తా పదార్థాలను వివిధ ఆకారాల్లో తయారు చేయవచ్చు. బెల్లం పొడి, గోధుమ పిండి, మొక్కజొన్న రవ్వ, మైదా, రాగి పిండి మిశ్రమాన్ని పాస్తా మెషిన్‌లో ట్యాంక్‌లో వేస్తారు. తగినంత నీళ్లు పోసి 5-10 నిమిషాల పాటు మిక్సింగ్ చేసి మరో 45 నిమిషాల తర్వాత నచ్చిన ఆకారంలో ఉండే ట్రేలలో వేస్తే పాస్తాలు తయారవుతాయి. వాటిని డ్రయ్యర్‌లో 50 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత దగ్గర 5 గంటలపాటు ఆరబెడితే చాలు.





చెరుకు రసం, బెల్లం పొడితో చేసిన కాఫీ ప్రీమిక్స్

శిక్షణ ఇస్తున్నాం



బెల్లంతో ఇతర ఉత్పత్తుల తయారీలో పాటించాల్సిన సాంకేతిక అంశాలపై శిక్షణ ఇస్తున్నాం. విదేశాలకు ఎగుమతి చేసే విధంగా బెల్లం దిమ్మలు, పాకం, పొడి రూపంలో తయారయ్యేలా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక బెల్లం తయారీ ప్లాంట్ రూపొందించాం

– డాక్టర్ పీవీకే జగన్నాథరావు, సీనియర్ శాస్త్రవేత్త, అనకాపల్లి ప్రాంతీయ పరిశోధనా కేంద్రం

'స్కిల్' కుంభకోణంలో కీలక వ్యక్తి అరెస్టు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధాన పాత్ర పోషించారని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. టీడీపీ ప్రభుత్వం సీమెన్స్ కంపెనీ ముసుగులో షెల్ కంపెనీలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం రూపకల్పనలో ఆయనే కీలకంగా వ్యవహరించారు. (అసలు ఆ ప్రాజెక్టు గురించి తమకేమీ తెలియదని, తమ కంపెనీ అసలు ఆ ఒప్పందం కుదుర్చుకోలేదని సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయం తరువాత ప్రకటించడం గమనార్హం). సీమెన్స్ ఇండియా లిమిటెడ్‌కు అప్పట్లో ఎండీగా ఉన్న సుమన్ బోస్‌తో కుమ్మక్కై టీడీపీ పెద్దలు ఈ ఎంవోయూ కథ నడిపారు. అందులో భాస్కర్ కీలకంగా వ్యవహరించారు. అంచనాలను పెంచేసి ప్రాజెక్టు వ్యయాన్ని రూ.3,300 కోట్లుగా చూపించారు. అందులో 10 శాతం వాటాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.371 కోట్లు సమకూర్చాలని లెక్క తేల్చారు. సీమెన్స్ కంపెనీ కేవలం రూ.58 కోట్లు విలువైన సాఫ్ట్‌వేర్‌ను మాత్రమే సమకూర్చింది. కేవలం అప్పటి టీడీపీ ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే భాస్కర్ ప్రాజెక్టు వ్యయాన్ని పెంచేశారని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. అంతేకాదు.. ఆ ప్రాజెక్టు వ్యయాన్ని మూడో పార్టీ ద్వారా పరిశీలించేందుకు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్స్ డిజైన్ (సీఐటీడీ)కు నివేదించగా అక్కడ కూడా భాస్కరే కథ నడిపారు. ఇతర నిందితులతో కలిసి అనుకూలంగా నివేదిక వచ్చేలా మేనేజ్ చేశారు. అంతేకాకుండా నిధులు కొల్లగొట్టడానికి అనుకూలంగా అవగాహన ఒప్పందం (ఎంవోయూ)ను తయారు చేశారు. ఒప్పందం రూ.3,300 కోట్లకు చేశారు. కానీ ప్రభుత్వం తన వాటాగా రూ.371 కోట్లు చెల్లించాలనే దగ్గరకు వచ్చేసరికి పక్కా కుతంత్రానికి పాల్పడ్డారు. ఈ ప్రాజెక్టులో టెక్నాలజీ పార్ట్‌నర్స్‌గా ఉన్న సీమెన్స్, డిజైన్ టెక్‌లకు కేవలం రూ.371 కోట్ల వర్క్ ఆర్డర్ ఇస్తున్నట్టుగా రాశారు. దాంతో వర్క్ ఆర్డర్ విలువ మేరకే సీమెన్స్, డిజైన్‌టెక్ కంపెనీలకు చెల్లించాలనే భావన కలిగించారు. కానీ మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.3,300 కోట్లలో సీమెన్స్ కంపెనీ 90 శాతం ముందు సమకూర్చాలన్న ఒప్పందంలోని ప్రధాన అంశాన్ని.. ఆ తరువాత పేరాల్లో లేకుండా చేశారు. ఇలా కేవలం రూ.371 కోట్ల వర్క్ ఆర్డర్ మేరకే బిల్లులు చెల్లిస్తున్నట్టు భ్రాంతి కలిగించారు. ఇదంతా టీడీపీ ప్రభుత్వ పెద్దలతో కుమ్మక్కై చేశారని సీఐడీ దర్యాప్తులో ఆధారాలతో సహా నిరూపితమైంది.

షెల్ కంపెనీలతోనూ బంధం

ఈ ప్రాజెక్టు పేరుతో నిధుల మళ్లింపునకు సాధనంగా ఉన్న షెల్ కంపెనీల్లోనూ జీవీఎస్ భాస్కర్ కీలకంగా వ్యవహరించారు. ఎస్ఐఎస్‌డబ్ల్యూ కంపెనీకి చెందిన అలైడ్ హెల్త్‌కేర్ ఒక షెల్ కంపెనీగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. సీమెన్స్ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం డిజైన్ టెక్, స్కిల్లర్ కంపెనీలకు చెల్లించిన రూ.371 కోట్లను ఈ షెల్ కంపెనీ ద్వారానే విదేశీ ఖాతాలకు మళ్లించారు. ఆ షెల్ కంపెనీతో భాస్కర్‌కు సన్నిహిత సంబంధాలున్నట్టుగా సీఐడీ గుర్తించింది.

పరస్పర విరుద్ధ ప్రయోజనాలు

ఎంవోయూ కుదిరిన తరువాత భాస్కర్ తన సతీమణి అపర్ణను ఏపీఎస్ఎస్‌డీసీలో డిప్యూటీ సీఈవోగా పోస్టింగు వచ్చేలా కథ నడిపించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏపీఎస్ఎస్‌డీసీ అప్పటి ఎండీ, సీఈవో గంటా సుబ్బారావుతో భాస్కర్ కుమ్మక్కయ్యారు. దాంతో అప్పటి టీడీపీ ప్రభుత్వ పెద్దలు ఉత్తరప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అపర్ణను రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై తీసుకువచ్చారు. అనంతరం ఆమెకు ఏపీఎస్ఎస్‌డీసీలో డిప్యూటీ సీఈవోగా పోస్టింగు ఇచ్చారు. సీమెన్స్ కంపెనీలో భాస్కర్ కీలకంగా ఉండగా.. ఆయన భార్య ఏపీఎస్ఎస్‌డీసీలో డిప్యూటీ సీఈవోగా ఉండటం పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందకు వస్తుంది. ఈ విషయాన్ని దాచిపెట్టి మరీ కుంభకోణానికి రంగం సిద్ధం చేశారు.

మహిళా జర్నలిస్టులకు సన్మానం



మహిళా జర్నలిస్టులతో కొమ్మినేని శ్రీనివాసరావు, విజయకుమార్‌రెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విజయవాడలోని సి.రాఘవాచారి ఏపీ ప్రెస్ అకాడమీ కార్యాలయంలో మహిళా జర్నలిస్టులను ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి సన్మానించారు. మహిళా జర్నలిస్టులు హసీనా షేక్ (టీవీ9.), రెహానా బేగం (ఎన్‌టీవీ), కాంతి (స్వతంత్ర న్యూస్), పోరంకి లక్ష్మి(దూరదర్శన్), ఎంఎల్ఎన్ మాధురి (ఆలిండియా రేడియో న్యూస్ రీడర్), కె.అమూల్య (ఫ్రీ లాన్సర్), ఈడుపుగంటి రోమిల, పి.షాహిస్తా ఖానుమ్ (విశాలాంధ్ర), సుమలత (మహిత పత్రిక), రమణ ముక్తేవి, జి.అనిత (హెచ్‌వోడీ, ఏఎన్‌యూ జర్నలిజం విభాగం)తోపాటు సాధారణ పరిపాలన శాఖ (ఐ అండ్ పీఆర్) సెక్షన్ అధికారి హేమలతను సత్కరించారు. అనంతరం కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు అన్ని రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, సగానికి పైగా పదవుల్లో అవకాశాలు కల్పించారని చెప్పారు. జర్నలిజం రంగంలో విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటూ మహిళా జర్నలిస్టులు పనిచేస్తున్నారని, వారిని ప్రోత్సహించేందుకు ప్రెస్ అకాడమీ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో మహిళా జర్నలిస్టుల ఫోరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ కార్యదర్శి ఎం.బాలగంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

ఫార్మా, ఐటీలో హైదరాబాద్ టాప్

ఎక్సైజ్, పర్యాటక మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ఫార్మా, ఐటీ రంగాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద ఎగుమతిదారుగా హైదరాబాద్ నిలుస్తోందని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. బెర్లిన్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ టూరిజం అండ్ కల్చర్ ఎగ్జిబిషన్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా తయారు చేసిన కరోనా వ్యాక్సిన్ ప్రపంచం నలుమూలలకు అందించిన ఘనత తెలంగాణ రాష్ట్రానిదని చెప్పారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వైద్య సేవలను నామమాత్రపు ధరకు అందిస్తున్న నగరంగా హైదరాబాద్‌కు గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన పర్యాటక ప్రదేశాలున్నాయని వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, బతుకమ్మ, బొడ్డెమ్మ పండుగలు ఎంతో ప్రత్యేకమని వివరించారు. ఇంటర్నేషనల్ టూరిజం అండ్ కల్చర్ ఎగ్జిబిషన్‌లో తెలంగాణ టూరిజం స్టాల్ పర్యాటకులు, టూర్స్ అండ్ ట్రావెల్ ఆపరేటర్లను విశేషంగా ఆకర్షించిందని ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బౌద్ధానికి పూర్వ వైభవాన్ని తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు.

నా తల్లి కష్టాలు చూసి 'దీపం' తెచ్చా

పార్టీ మహిళా నేతల ఆన్‌లైన్ సమావేశంలో చంద్రబాబు

సాక్షి, అమరావతి: తన తల్లి కష్టాలు చూసి 'దీపం' పథకాన్ని తీసుకొచ్చినట్లు ప్రతిపక్ష నేత చంద్రబాబు చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన టీడీపీ కార్యాలయం నుంచి వివిధవర్గాల మహిళలతో ఆన్‌లైన్‌లో మాట్లాడారు. తన తల్లి పెంపకమే తనను ఈ స్థాయికి తెచ్చిందని, తనకు మొదటి గురువు తల్లేనని చెప్పారు. తన తల్లి కట్టెల పొయ్యితో వంటచేసి చాలా ఇబ్బందులు పడేదని, తన అమ్మలా మహిళలకు కష్టాలు ఉండకూడదని అప్పట్లోనే ఆలోచించానని తెలిపారు. మద్యం రేట్లు పెంచడం వల్ల ఆ భారం వారిపైపడి మహిళలే ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఉత్తమ పాలసీతో మద్యం ధరలు నియంత్రిస్తామని చెప్పారు. ప్రతి ఇంటికి ఎన్టీఆర్ సుజల స్రవంతి పేరుతో సురక్షిత తాగునీరు ఇస్తామన్నారు. కనీసం మెడికల్ కాలేజి గోడ కట్టలేని సీఎం మెడికల్ కాలేజీలు ఎలా కడతాడని ప్రశ్నించారు. రాష్ట్రంలో గంజాయి, లిక్కర్ పెరిగాయన్నారు. నిర్భయ నిధులను కూడా ప్రభుత్వం ఖర్చు పెట్టడంలేదని విమర్శించారు. తాము మహిళల రక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామన్నారు. మద్యపాన నిషేధం చేయకపోతే ఓట్లడగనని చెప్పిన సీఎం ఇప్పుడు ఆ మద్యంపై అప్పులు కూడా చేశాడని విమర్శించారు. ఓటుకు రూ.5 వేలు ఇచ్చి గెలవాలని చూస్తున్నాడని ఆరోపించారు. టీడీపీ అధికారం చేపట్టిన తొలిరోజునే చెత్తపన్ను తొలగిస్తామని, తొలి ఉత్తర్వులు దీనిపైనే ఇస్తామని చెప్పారు. అప్పటివరకు మహిళలు చెత్తపన్ను కట్టకూడదన్నారు. ఒంటరి మహిళల కోసం ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం ప్రత్యేక ఆలోచనలున్నాయని తెలిపారు. టీడీపీ అధికారం కోల్పోవడం వల్ల రాష్ట్రం, ప్రజలు నష్టపోయినట్లు చెప్పారు. మహిళా సాధికారతను తన ఇంట్లో చేసి చూపించానన్నారు. తన భార్య వల్లే తాను రాజకీయాల్లో నిరంతరం పని చేయగలుగుతున్నానని చెప్పారు. ఆమె తనకు లభించిన పెద్ద బహుమానమని ఆయన పేర్కొన్నారు.

బొబ్బిలి వీణ.. శిఖరాగ్ర ఆదరణ

- జీ-20 దేశాల అతిథుల కోసం 200 వీణలకు ఆర్డర్
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన అతిథులకూ ఇవే బహుమతి



గిఫ్ట్ వీణలను తయారు చేస్తున్న కళాకారులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రపంచంలో ప్రతిష్టాత్మకమైన 20 సభ్యదేశాల శిఖరాగ్ర సమావేశాల్లో బొబ్బిలి వీణ వైభవాన్ని చాటుకోనుంది. విశాఖలో ఈ నెల 28, 29వ తేదీల్లో జరగనున్న జీ-20 సదస్సుకు వివిధ దేశాల నుంచి హాజరయ్యే అతిథులను గౌరవించేందుకు 200 బొబ్బిలి వీణలను అధికారులు ప్రత్యేకంగా తయారు చేయిస్తున్నారు. కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉన్నందున ఆయన చేతుల మీదుగా వీటిని ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే అతిథులకు అందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. విశాఖలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు దేశం నలుమూలల నుంచి హాజరైన పారిశ్రామిక దిగ్గజాలు, ఔత్సాహికులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున బొబ్బిలి వీణలను బహూకరించారు. బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లికి చెందిన సర్వసిద్ధి ఇంటిపేరు గల కుటుంబీకులే దశాబ్దాలుగా బొబ్బిలి వీణలను తయారు చేస్తూ వస్తున్నారు. వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా 1994వ సంవత్సరంలో సొసైటీని ఏర్పాటు చేసింది. 2002లో బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో వీణల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది

వీణల తయారీయే ఆధారంగా ఉన్న మా కళాకారులకు టీటీడీతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు సందర్భంలో 200 వీణలను తయారుచేసి అందించాం. అతిథుల కోసం మా వీణలతో కచేరీ కూడా ఏర్పాటు చేయించారు. ఈ నెలలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న మరో ప్రతిష్టాత్మక సదస్సు జీ-20 కోసం కూడా 200 వీణలకు ఆర్డర్ వచ్చింది.

– సర్వసిద్ధి రామకృష్ణ, ఇన్‌చార్జి, బొబ్బిలి వీణల కేంద్రం



వీణల ధరలు ఇలా..

వీణ సైజు (అంగుళాల్లో)	రకం	ధర	ప్యాకింగ్‌తో ధర
9	సాధారణ	రూ.1,200	రూ.1,430
13	సాధారణ	రూ.1,900	రూ.2,300
17	సాధారణ	రూ.2,200	రూ.2,700
23	సాధారణ	రూ.3,600	రూ.4,500
9	నెమలి	రూ.1,800	రూ.2,200
17	నెమలి	రూ.2,900	రూ.3600
9	స్వరమాపది	రూ.2,000	రూ.2,500
పెద్దవీణ (సరస్వతివీణ)		రూ.32,000	--



ఆరోగ్యమే అతిగొప్ప కానుక, తృప్తియే అతి గొప్ప సంపద, విశ్వాసమే గొప్ప సంబంధం.
– బౌద్ధ ధర్మం

సాక్షి
గురువారం, మార్చి, 9

సవాలుకు సిద్ధమవుదాం!

గ్రీష్మ ఋతువు ఇంకా మొదలుకానే లేదు. కానీ శిశిరంలోనే, ఇంకా చెప్పాలంటే ఫిబ్రవరిలోనే గ్రీష్మ తాపం మొదలైపోయింది. 1901 నుంచి గత 122 ఏళ్ళలో ఎన్నడూ లేనంతటి సగటు పగటి ఉష్ణోగ్రత (29.54 డిగ్రీలు) ఫిబ్రవరిలో నమోదైంది. నిరుడు మార్చి కూడా ఇలాగే భారత ఉపఖండమంతటా చంద్రనిప్పులు చెరిగింది. దీన్ని బట్టి ఇక ఈ వేసవి ఎలా ఉండనుందో ఇప్పటికే అర్థమైపోయింది. దేశంలో ఇటు వేసవిలో, అటు శీతకాలంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. దేశంలో వాతావరణంపై అధ్యయనం చేసే 'సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ' (సీస్టెప్) ఈ సంగతి వెల్లడించింది. ఒక్కమాటలో వాతావరణ సంక్షోభం ఇక ఎప్పుడో నిజమయ్యే జోస్యం కానే కాదు. ఇప్పటికే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, ఆకస్మిక వర్షాలతో తరచూ సంభవిస్తున్న సంఘటన. ఈ వేసవిలో భానుప్రతాపం తీవ్రంగా ఉండనుందన్న హెచ్చరికలతో, స్వయంగా ప్రధాని మోదీ రంగంలోకి దిగి, ఈ సోమవారం నిపుణులతో సమావేశం జరపడం గమనార్హం.

గత రెండు దశాబ్దాల (2000 – 2019) డేటా చూస్తే, కనివిని ఎరుగని ఉష్ణోగ్రతలతో ప్రపంచ వ్యాప్తంగా ఏటా సగటున 50 లక్షల మంది మరణిస్తున్నారు. ఇది 2021 జూలైలో ప్రచురితమైన 'ది లాన్సెట్' అధ్యయనం తేల్చిన మాట. మన దేశంలోనే 7.4 లక్షల మంది చనిపోతున్నారు. దేశంలో వాతావరణ మార్పులతో దుర్మరణాలు 55 శాతం పెరిగాయి. ఇక, కేవలం 30 ఏళ్ళలో (1990 – 2019) వేసవిలో మన కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 0.5 డిగ్రీల నుంచి 0.9 డిగ్రీల మేర పెరిగాయి. దేశంలో నూటికి 54 జిల్లాల్లో చలికాలంలోనూ ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. చర్మాన్ని చీల్చే ఎండతో వ్యవసాయం సహా వాతావరణ ఆధారిత రంగాలు ప్రభావితమై, జీవనోపాధి దెబ్బ తింటోంది. దాదాపు 167.2 బిలియన్ పని గంటలు నష్టం. తక్కువ వర్షపాతం, ఎక్కువ ఉష్ణోగ్రతలతో గోదుమల దిగుబడి 2020–21తో పోలిస్తే 2021–22లో దాదాపు 30 లక్షల టన్నులు పడిపోయింది.

రానురానూ భూతాపోన్నతితో పాటు వడగాడ్పులు, పర్యవసానాలూ పెరుగుతాయని వాతావరణ మార్పులపై అంతర్ ప్రభుత్వ సంఘం ఆరో అంచనా నివేదిక సారాంశం. ఈ నేపథ్యంలోనే ప్రకృతి వైపరీత్యాల ముప్పు తగ్గింపు జాతీయ వేదిక (ఎన్పీడీఆర్ఆర్) సైతం ఈసారి 'మారుతున్న వాతావరణానికి తగ్గట్టు స్థానిక సంసిద్ధత' అనే అంశాన్ని చేపట్టింది. రేపు శుక్రవారం జరిగే ఈ 3వ సదస్సును ప్రధానే ప్రారంభిస్తుండడం విశేషం. జోషీమఠ్‌లో భూపాతాలు సహా పలు అంశాలపై చర్యల్ని ఇందులో చర్చించనున్నారు. ముంచుకొస్తున్న మార్పులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం స్వాగతనీయం. వాతావరణ సవాలుపై చర్యలకు ప్రభుత్వనిధుల కేటాయింపు తగ్గిందన్న వార్తలే విషాదం.

పసిఫిక్ మహాసముద్రంలో పవనాల సహజ మార్పు వల్ల ఈ ఏడాది ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరిగి, వాతావరణ ధోరణుల్లో సంక్షోభం తప్పకపోవచ్చని శాస్త్రవేత్తల హెచ్చరిక. ఈ 2023లో ఉష్ణవాతావరణ ధోరణి అయిన ఎల్ నినో మళ్ళీ విరుచుకుపడే ప్రమాదం నూటికి తొంభై పాళ్ళుందట. అదే జరిగితే, ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల మేర పెరుగుతాయి. అంటే, ఈ శతాబ్దం చివరికి భూతాపోన్నతిని ఏ స్థాయికి నియంత్రించాలని ప్రపంచ నేతలు అంగీకరించారో ఆ చెలియలికట్టను ఇప్పుడే చేరుకుంటాం. దీనివల్ల 70 – 90 శాతం మేర పగడపు దిబ్బలు కనుమరుగైపోతాయట. ఇవన్నీ యావత్ ప్రపంచానికి, వ్యవసాయ ఆధారిత భారత్‌కు ప్రమాద ఘంటికలు. ఈ అత్యవసర పరిస్థితిని తట్టుకోవాలంటే 2030 కల్లా వర్ధమాన దేశాలు ఏటా 30 వేల కోట్ల డాలర్లు ఖర్చు చేయాలని ఐరాస అంచనా. ప్రపంచ జనాభాలో 12 శాతమే ఉన్నా, గ్రీన్ హౌస్ వాయువుల్లో 50 శాతానికి బాధ్యులైన ధనిక దేశాలు వర్ధమాన దేశాలకు అండగా నిలవాలి.

మన వద్ద మార్చి, మే మధ్య ఉష్ణపవనాలకు తోడు మరో సమస్య రానుంది. వినియోగం బాగా పెరిగే వేసవిలో విద్యుత్ కొరత సహజం. గత అయిదేళ్ళలో దేశంలో సౌర విద్యుదుత్పత్తి 4 రెట్లు పెరిగింది గనక నడిచిపోయింది. అది పగటివేళ వరకు ఓకే. కొత్తగా థర్మల్, హైడ్రోపవర్ సామర్థ్యాలను పెంచుకోనందు వల్ల రాత్రి వేళల్లో కష్టం కానుంది. ఈ వేసవి రాత్రుళ్ళలో గిరాకీ, సరఫరాల మధ్య 1.7 శాతం లోటు రానుంది. ఒక్కమాటలో, ఈ వేసవిలో రాత్రిపూట దేశంలో కరెంట్ కష్టాలు తీవ్రం కానున్నాయి. ఆందోళన పడాల్సింది లేదని ప్రభుత్వాధికారులు పైకి అంటున్నా, త్వరితగతిన థర్మల్, హైడ్రో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోకుంటే ఈ వేసవిలో ప్రజలకు కష్టాలు తప్పవు. ముఖ్యంగా రాత్రింబవళ్ళు నడిచే ఆటో, ఉక్కు, ఎరువుల తయారీ పరిశ్రమలు చిక్కుల్లో పడతాయి.

ముందే ఒక అంచనా రావడంతో నగర వ్యూహకర్తల మొదలు గ్రామీణ రైతుల దాకా అందరూ ఇప్పుడిక నష్టనివారణ చర్యలకు దిగాలి. భూ, జల నిర్వహణల్లో తగు మార్పులు చేసుకోవాలి. త్వరిత దిగుబడినిచ్చే కొత్త పంట రకాలపై రైతులకు మార్గదర్శనం చేయాలి. స్థానిక పాలనాయంత్రాంగాలు ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు చేయాలి. నీడనిచ్చే ఉద్యానాలు, నీటి వసతి లాంటి పరిష్కార మార్గాలు చూపాలి. అహ్మదాబాద్‌లో 2010లో గాడ్పులకు 1300కు పైగా మరణించాక, సిద్ధం చేసిన కార్యాచరణ ప్రణాళిక ఏటా 1200 మరణాల్ని నివారిస్తున్నట్టు అంచనా. అలాంటివి అంతటా అమలు చేయాలి. ఉష్ణతాపంతో తలెత్తే ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొనేలా ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను సమాయత్తం చేయాలి. వాతావరణ సంక్షోభాలు ఇక నిత్యకృత్యం కానున్నందున వీటి దుష్ప్రభావాన్ని దీటుగా ఎదుర్కొనేలా పటిష్ఠమైన విధాన రూపకల్పనే పాలకుల తక్షణ కర్తవ్యం.

విశాఖను వరించిన పెట్టుబడులు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

కేవలం 1 శాతం సంపన్నవంతులను మాత్రమే పట్టించుకుంటూ, ప్రపంచంలోని మిగతా 99 శాతం భవిష్యత్తును గాలికి వదిలేయకూడదు. కొద్దిమంది చేతుల్లో ద్రవ్య అధికార కేంద్రీకరణ జరిగి అది మిగతా ప్రపంచ భవిష్యత్తును శాసించడం పచ్చి నిరంకుశత్వం. వీటిని పూర్తిగా గుర్తెరిగి, ప్రపంచ పెట్టుబడులను పూర్తిగా ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా మలుస్తూ సాగింది విశాఖపట్నంలోని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్. విశాఖ కేంద్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు కేంద్ర స్థానంగా ఎందుకు మార్చకూడదన్న ఆలోచనతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ ముందుకు సాగిన ఫలితమే – ఈ సదస్సు.

''20వ శతాబ్దపు పెట్టుబడిదారీ వ్యవస్థ 21వ శతాబ్దపు సమాజాన్ని తీర్చిదిద్దడంలో విఫలమైందా? గత 30 సంవత్సరాల వ్యవధిలో సంపన్న వర్గాలకూ, పేద వర్గాలకూ మధ్య ఆదాయ వనరులలో వ్యత్యాసం దారుణంగా పెరిగిపోయింది. ఈ పరిస్థితుల్లో మనకు నూతన వ్యవస్థ అవసరమని చెప్పినంత మాత్రాన పరిస్థితులు మారవు. ఉన్న వ్యవస్థ ఎందుకు ప్రజాబాహుళ్యం అవసరాలను తీర్చలేకపోతోంది? కొలది మందిలో పేరుకుపోయిన అవధులు లేని కోరికలు; పేద, కార్మిక వర్గాల హక్కులపై సాగుతున్న దాడులు– ఈ పరిస్థితులు వెరసి ఉత్పత్తి అవుతున్న సంపద పంపిణీలో వాటాను పేద సాదలు అనుభవించనివ్వకుండా చేస్తున్నాయి. ఇలా పేద సాదల న్యాయమైన డిమాండ్ కుంచించుకు పోతూ, వ్యాపార సరళి దెబ్బతింటూపోతే వ్యాపార వర్గాల వ్యాపారమూ బతికి బట్ట కట్టలేదని గుర్తించాలి. కనుకనే, అమెరికా అధ్యక్ష కార్యాలయ సలహాదారుగా పనిచేసిన లారీ సమ్మర్స్ 40 శాతం అమెరికన్లలో పెట్టుబడిదారీ విధానమంటే సానుకూల అభిప్రాయం లేదని బాహాటంగా చాటాడు''.

– షరాన్ బ్రూనో, అంతర్జాతీయ ట్రేడ్ యూనియన్ సమాఖ్య ప్రధాన కార్యదర్శి

''నానాటికీ పెరిగిపోతున్న సామాజిక అసమానతలు ప్రపంచ ప్రజల భావి భాగ్యోదయానికీ, భద్రతకూ కాచుకు కూర్చున్న పెద్ద ప్రమాదం''.

– ప్రపంచ ఆర్థిక, సహకారాభివృద్ధి సమాఖ్య

ప్రపంచ పెట్టుబడులకు దావోస్ కేంద్ర స్థానంగా ఉండి, వర్ధమాన బతుకుల్ని శాసిస్తూ వచ్చిన దశ నుంచి కొత్త మార్పు మొదలైంది. కేవలం 1 శాతం సంపన్నవంతుల గొంతును వినిపిస్తూ ప్రపంచంలోని మిగతా 99 శాతం ప్రజాబాహుళ్యం భవిష్యత్తును దావోస్ గాలికి వదిలేస్తూ వచ్చింది. కనుకనే స్విట్జర్లాండ్ యువజన సమాఖ్య అధిపతి డేవిడ్ రాత్, కొద్దిమంది చేతుల్లో ఈ ఆర్థిక, ద్రవ్య అధికార కేంద్రీకరణ మిగతా ప్రపంచ ప్రజాబాహుళ్యం భవిష్యత్తును శాసించడం పచ్చి నిరంకుశత్వంగా అభివర్ణించాడు. అలాంటి దావోస్ సభలలో

రెండో మాట



చర్చలను, ఫలితాలను అవగతం చేసుకొని వచ్చిన అనుభవం నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం పథక రచన చేశారు.

భారతదేశంలో విశిష్ట సహజ సాగర వనరులకు కేంద్రంగా, సహజ సంపదలకు ఆలవాలంగా ఉండి, దేశీయ పారిశ్రామిక స్థావరాలలో ఆంధ్రప్రదేశ్ తూర్పు కోస్తాలో ప్రభవిల్లుతూ వచ్చిన నగరం– విశాఖపట్నం. విశాఖ కేంద్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు కేంద్ర స్థానంగా ఎందుకు మార్చకూడదన్న ఆలోచనతో జగన్ ముందుకు సాగిన ఫలితమే – గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023. భారీ పారిశ్రామిక, ఉపాధి అవకాశాల కేంద్రంగా ఈ విశాఖ సదస్సును జయప్రదం చేయగలగడం అతని వయస్సుకు మించిన గౌరవాన్ని తెచ్చి పెట్టింది. ఎందుకంటే, బహు కొలది మందిగా ఉన్న సంపన్నుల చేతుల్లో ఆర్థిక, ద్రవ్య వనరుల కేంద్రీకరణ వల్ల ఆ వర్గాలే మిగతా అసంఖ్యాక ప్రజాబాహుళ్యంపై నియంతృత్వం చలాయించే ప్రమాదం ఇప్పటికే బలంగా పొంచి ఉంది. అందుకే జగన్ తన 'నవరత్నాల' పథకం ద్వారా ఆదిలోనే ప్రజా ప్రయోజనాల రక్షణకు 'ఏడుగడ'గా నిలిచారు. అందుకే విశాఖ పెట్టుబడుల సదస్సు వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలకు రాగల నష్టం ఏమీ ఉండదు. పైగా ప్రపంచ వ్యాపిత పెట్టుబడులు రాష్ట్రానికి రాగల అవకాశాలు మరింతగా పెరిగాయి.

రాష్ట్రానికి కేంద్రమూ, బీజేపీ పాలకులూ రాష్ట్ర విభజన సమయంలో హామీ పడిన ప్రత్యేక హోదా విషయంలో అనుసరిస్తున్న 'రాజకీయ తాత్సారం' వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు అపారమైన నష్టం వాటి ల్లింది. దీనికితోడు క్రియాశీల పాత్ర నిర్వహించవలసిన అతుకులబొంత 'తెలుగుదేశం', 'గాలివాటు' రాజకీయాలకు పేరు మోసిన 'సినీ వంగడం' పవన్ కల్యాణ్ 'వారాహి' అబద్ధాలకు మించి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని దుఃస్థితిలో ఉన్నారు. ఈ రాజకీయ 'విచిత్ర వేషధారణ' తంతు పసికట్టిన ప్రధాని మోదీ తన బీజేపీ (ఆరెస్సెస్)కి ఏపీలో రాజకీయ అవకాశాల్ని పెంచుకోవడం కోసం 'దేశం'తో పవన్‌కు ఉన్న చెట్టాపట్టాల్ని తెగ్గొట్టగలిగారేగానీ, వారి మధ్య అక్కరకు రాని రహస్య సమావేశాల్ని ఆపలేకపోయారు. అయితే ఏపీ సీఎం జగన్ ప్రగతి మార్గాన్నీ, 'నవరత్నాల' బలమైన ప్రభావాన్నీ వీళ్లెవరూ అడ్డుకోలేక పోయారు. పైగా ఆయనకు అవాంతరాలు కల్పిస్తూ రోజు రోజుకీ ప్రజల ముందు అభాసుపాలవుతున్నారు. ఈ దశలో రాష్ట్రానికి దూసుకువచ్చిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ శిఖరాగ్ర సమావేశం జగన్ చొరవ ఫలితంగా జయప్రదం కాగల్గింది.

అందుకే జగన్ ''మేము అమలు చేస్తున్నవి కేవలం ఉచిత పథకాలు కావు. ఇదంతా మానవ వనరుల మీద పెడుతున్న పెట్టుబడిగా మేం భావిస్తున్నాం. మానవ వనరుల నైపుణ్యాభివృద్ధిపైన పెట్టుబడిగా భావిస్తున్నాం. మా విద్యార్థులు సొంత కాళ్లపై నిలబడి, ఉన్నత స్థానాలకు ఎదగడానికి అవసరమైన వనరులను సమకూరుస్తున్నాం. అందుకోసం విద్యాప్రమాణాలు పెంపొందిస్తున్నాం. అభివృద్ధిలో వారిని భాగస్వాములు చేస్తున్నాం'' అనగలిగారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు 62 శాతం పదవులు ఇచ్చి దేశ చరిత్రలో నూతన ఒరవడిని సుస్థిరపరిచి దేశ చరిత్రలోనే మొదటి స్థానంలో జగన్ నిలబడటానికి 'దమ్ము' అందించినవీ, అధికారానికి రావడానికి ముందే సుదీర్ఘమైన పాదయాత్ర ద్వారా గడించిన ప్రజాస్పర్శతో ప్రకటించినవీ అనుల్లంఘనీయమైన 'నవరత్నాల'ని మరచిపోరాదు. తద్వారా దేశంలోని రాజకీయ పార్టీలకూ, ముఖ్యమంత్రులకూ తండ్రి రాజశేఖరరెడ్డి తర్వాత అంత ఆదర్శంగా నిలిచినవాడు జగన్!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇద్దరూ సమానమే!



మగవాళ్ల కంటే ఆడవాళ్లు తక్కువ అనే భావన అసంబద్ధమైనది. ఒక మగవాడు మహిళ నుంచి పుడుతున్నప్పుడు, అతడు ఎలా అధికుడవుతాడు, ఆమె ఎలా నిమ్నురాలవుతుంది?

– జగ్గీ వాసుదేవ్, ఆధ్యాత్మిక గురువు

రంగులతో జీవితం



రంగులతో ఖుషీ వస్తుంది, ఖుషీ వల్ల ఎంతో ప్రేమ దొరుకుతుంది. మీకూ, మీ కుటుంబానికీ హోలీ సందర్భంగా హార్దిక శుభాకాంక్షలు.

– సాజిద్ యూసుఫ్‌షా, కశ్మీర్ కామెంటేటర్

భాషలు రుద్దకూడదు



నేను ఏడు భాషలు మాట్లాడుతాను. ఒక భాషను నేర్చుకోవడం, మాట్లాడటం అంటే ఆ భాషా ప్రజలను గౌరవించడం. నేను పనిచేసే జనాల అందరి భాషలూ నేర్చుకున్నాను. నేను నా భాషను రుద్దను. కానీ ఎవరైనా నా భాషను అగౌరవ పరిస్తే నేను దానికి వ్యతిరేకంగా నిలబడుతాను. హిందీని బలవంతంగా రుద్దడం ఆపాలి.

– ప్రకాశ్ రాజ్, నటుడు

సాంస్కృతిక నష్టం



తాలిబన్లు 2001 మార్చిలో సాంస్కృతిక హననపు నేరానికి ఒడిగట్టారు. 570–618 సంవత్సరాల మధ్య నిర్మించిన బామియాన్, సాల్‌సాల్ (180 అడుగులు), షమామా (125 అడుగులు) బౌద్ధ విగ్రహాలను వారు ధ్వంసం చేశారు. అతివాదుల విధ్వంసక శక్తిని ఈ అఫ్గానిస్తాన్ సాంస్కృతిక వారసత్వపు తీవ్ర నష్టం గట్టిగా గుర్తుచేస్తోంది.

– హబీబ్ ఖాన్, అఫ్గానిస్తాన్ యాక్టివిస్ట్

నేర్చుకోవాల్సిన పాఠాలు



స్వీడన్ పాఠాలు: స్వీడన్ లాక్‌డౌన్లు విధించలేదు, జనాలకు మాస్కుల్ని బలవంతం చేయలేదు, పాఠశాలల్ని మూసేయలేదు. అధికంగా కనబడే వారి మరణాలు యూరప్‌తో పోల్చితే అత్యల్పం. కోవిడ్‌కు స్వీడన్ స్పందనే సరైనదని ఇప్పుడు అర్థమవుతోంది. మిగతా ప్రపంచమే తప్పు.

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

మహిళలకు సమానంగా...



యూఎస్‌లో మహిళలకు (ఎక్కువగా తెల్లవాళ్లు) 1920లో సమాన ఓటుహక్కు లభించింది. యూకే మహిళలకు అదే హక్కు 1928లో వచ్చింది. అదే సంవత్సరం భారత జాతీయ కాంగ్రెస్ మహిళలకు సమాన ఓటు హక్కు కోసం నిబద్ధురాలైంది. అది 1951–52లో వాస్తవ రూపం దాల్చింది.

– జైరామ్ రమేశ్, కాంగ్రెస్ ఎంపీ

వెనకున్నది ఎవరు?



డేటా పాయింట్. దుబాయ్‌లో ఏ పేరూలేని ఒక ఊబర్ డ్రైవర్ అయిన అమృత్‌పాల్ సింగ్‌ను హఠాత్తుగా గతేడాది తదుపరి భింద్రన్‌వాలే స్థాయికి ఎక్కించేశారు. కచ్చితంగా ఎవరో ఈ పాత్రకు అతడిని పెంచిపోషించారు. దుబాయ్ వదిలిన తర్వాత, ఇండియా రావడానికి ముందు ఆయన ఎక్కడ ఆగాడో తెలుసా? జార్జియా. అక్కడ కూడా ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు జరుగుతున్నాయి.

– దొరేస్వామి, వ్యాఖ్యాత

ఒక చారిత్రక ప్రణాళిక



మల్లెపల్లి లక్ష్మయ్య

మానవ జాతి చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన ఘట్టం– 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక' వెలువడటం. ప్రపంచ నడకను ఈ సిద్ధాంతం సమూలంగా మార్చివేసింది. మానవ పురోభివృద్ధికి సరికొత్త దారులు వేసింది. 'ద కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' మొట్టమొదటగా వచ్చిన జర్మన్ భాషా ప్రచురణకు ఈ సంవత్సరం ఫిబ్రవరి 24న 175 ఏళ్ళు పూర్తయ్యాయి. ఈ సిద్ధాంత స్ఫూర్తితోనే రష్యా, చైనా విప్లవాలు మొదలుకొని ఎన్నో ప్రజాస్వామ్య విధానాలు అమలులోకి వచ్చాయి. భారత దేశంలో కూడా నేడు మనం అనుభవిస్తున్న జీవితాలు, అమలు జరుగుతున్న విధానాలు ఎన్నో కమ్యూనిస్టు భావజాల ప్రభావం నుంచి వచ్చాయంటే అతిశయోక్తి కాదు.

''చెల్లాచెదురుగా ఉండే ప్రజలను, ఉత్పత్తి సాధనాలను, ఆస్తులను బూర్జువా వర్గం నిర్మూలిస్తున్నది. దీని ఫలితంగా రాజకీయ కేంద్రీకరణ ఏర్పడుతున్నది. బూర్జువా వర్గం తన గుత్తాధిపత్యాన్ని పెంచుకుంటున్నది. వివిధ ప్రయోజనాలను కలిగిన ప్రాంతాలను, స్వంత శాసనాలను, ప్రభుత్వాలను, పన్నులను కలిగి ఉన్న రాష్ట్రాలను తన ఆధిపత్యంలో ఒకే శాసనం, ఒకే జాతీయత, ఒకే భూ సరిహద్దు, ఒకే పన్నుల వ్యవస్థను రూపొందించి ఒకే జాతి ముద్దగా చేస్తు న్నది.'' 1848 ఫిబ్రవరి 24న ప్రకటించిన 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'లో పేర్కొన్న విషయమిది.

అంతర్జాతీయ కార్మిక సమాఖ్య అయిన కమ్యూనిస్టు లీగు సంస్థ కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికా రచన బాధ్యతను తమకు అప్పగించిందని ఈ ప్రణాళిక రచయితలు ఫ్రెడరిక్ ఎంగెల్స్, కారల్ మార్క్స్ 1872 నాటి ప్రచురణకు రాసిన ముందుమాటలో పేర్కొన్నారు. మొదట ఈ ప్రణాళిక జర్మన్ భాషలో రాశారు. ఆ తర్వాత రచయిత మిస్ హెలెన్ మెక్‌ఫర్లేన్ జర్మన్ నుంచి ఇంగ్లిష్‌లోకి అనువదించారు (మేనిఫెస్టో ఆఫ్ ద కమ్యూనిస్ట్ పార్టీ). ఇది 1850లో రెడ్ రిపబ్లికన్ పత్రికలో లండన్‌లో అచ్చయ్యింది. 1848 లోనే ఫ్రెంచిలో ఫ్రెంచి విప్లవానికి కొన్ని నెలల ముందు పారిస్‌లో అచ్చ యింది. రష్యా, డేనిష్, పోలిష్ భాషలన్నింటిలోకీ కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక అనువాదమైంది. మొదటిగా వచ్చిన జర్మన్ ప్రచురణకు ఈ సంవత్సరం ఫిబ్రవరి 24న 175 ఏళ్ళు పూర్తయ్యాయి.

కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక ప్రభావం, పరిణామాల గురించి చెప్పాలంటే ఎన్ని పేజీలైనా సరిపోవు. ఇది మానవ జాతి చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన ఘట్టంగా, ప్రపంచ మార్గాన్ని నిర్దేశించినసిద్ధాంత గ్రంథంగా నిలిచిపోయింది. అప్పటి వరకు ఉన్న ప్రపంచ నడకను ఈ సిద్ధాంతం సమూలంగా మార్చివేసింది. మానవ పురోభి వృద్ధికి సరికొత్త దారులు వేసింది. అది కేవలం విప్లవ పోరాటాల జయకేతనం మాత్రమే కాదు, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక రంగాలను సంపూర్ణంగా మలుపు తిప్పింది. ఈ రచన సాగించే నాటికి కారల్ మార్క్స్ వయసు 29 ఏళ్ళు, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌కు 27

కొత్త కోణం



ఏళ్ళు మాత్రమే. ఇద్దరు నవ యువకులుగా ఉన్న సమయంలోనే పెట్టు బడిదారీ వ్యవస్థ పునాదులను పెకిలించే నవ సమాజ నిర్మాణానికి పునాదులు వేసే అద్భుతమైన సిద్ధాంత గ్రంథాన్ని ప్రపంచానికి అందించారు.

కారల్ మార్క్స్ అప్పటికే తొమ్మిదికి పైగా సిద్ధాంత గ్రంథాలను రాశారు. 1841లో 'ద డిఫరెన్స్ బిట్వీన్ డెమొక్రిటియన్ అండ్ ఎపిక్యురస్ ఫిలాసఫీ ఆఫ్ నేచర్' పేరుతో మొదలైన మార్క్స్ రచన, పరిశోధనల ప్రయాణం 1848కి వచ్చే సరికి కమ్యూనిస్టు పార్టీ ప్రణా ళికను అందించింది. మార్క్స్ రచనలలో మరొక విశేషమైన రచన 'దాస్ కాపిటల్' మొదటి భాగం 1867లో వచ్చింది. మార్క్స్ తన జీవితం అంతా కార్మిక వర్గ ప్రయోజనాల కోసం మాత్రమే ఆలోచించినట్టు మనకు తెలుస్తున్నది. కమ్యూనిస్టు ప్రణాళిక ఒక రాజకీయ డాక్యుమెంటుగా కనిపించవచ్చు. కానీ అందులో తాత్విక సంవాదం ఎక్కువగా కనిపిస్తుంది. భూస్వామ్య సమాజంపై పెట్టుబడిదారీ విధానం విజయం సాధించి, సమాజంపై తన దుర్మార్గమైన దోపిడీ పంజాను విసురుతున్న తీరును కళ్ళకు కట్టినట్టుగా ఈ ప్రణాళిక చూపిస్తున్నది. దాదాపు డెబ్బై పేజీల రచనలో నాలుగు భాగాలున్నాయి. మొదటి భాగం: బూర్జువాలు–కార్మికులు. రెండవ భాగం: కార్మికులు–కమ్యూనిస్టులు. మూడవ భాగం: సామ్యవాద – కమ్యూనిస్టు సాహిత్యం. నాలుగవ భాగంలో వివిధ ప్రతిపక్ష పార్టీల పట్ల కమ్యూనిస్టుల వైఖరి ఉంటాయి.

ఇందులో మొదటి భాగం ముఖ్యమైనది. బూర్జువాలు– కార్మికులు అధ్యాయంలో ఆ రోజున్న సామాజిక స్వరూపాన్ని, పెట్టు బడిదారీ వ్యవస్థ దుర్మార్గాన్ని సంక్షిప్తంగా ప్రపంచం ముందుంచారు. ఈ రోజు మనం చూస్తున్న కార్పొరేట్ వ్యవస్థ దారుణమైన చర్యలను అత్యంత సూక్ష్మంగా వివరించారు. మొదటి పేరాలో పేర్కొన్న అంశం ఈ రోజు మనం చూస్తున్న ఆర్థిక, రాజకీయ వ్యవస్థకు అద్దం పడుతున్నది. ''ఆధునిక రాజ్యంలో ప్రభుత్వం బూర్జువా వర్గపు వ్యవహారాలను నిర్వ హించే ఒక యంత్రాంగంగా, అంగంగా మారిపోయింది'' అని పేర్కొన్నారు. ఇటీవల మన దేశపు కార్పొరేట్ కంపెనీలకు ప్రస్తుత ప్రభుత్వం ఒక సబార్డినేట్‌గా పనిచేస్తున్నదనడంలో ఎటువంటి సందేహం లేదు. అంతేకాకుండా, ''గతంలో ప్రజల భక్తి, గౌరవాలకు పాత్రమైన వృత్తులన్నింటినీ బూర్జువా వర్గం దిగజార్చింది. వైద్యులు, న్యాయవాదులు, కవులు, శాస్త్రవేత్తలను తన కింద పనిచేసే కూలివాళ్ళుగా మార్చి వేసింది'' అంటూ చేసిన వ్యాఖ్య మన కళ్ళ ముందు అత్యంత స్పష్టంగా అనుభవంలోకి వచ్చింది.

''యంత్రాలు విస్తృతంగా ఉపయోగంలోకి రావడం వల్ల కార్మికుల శ్రమలో వ్యక్తిగత ప్రత్యేకత పూర్తిగా అంతరించింది. కార్మికుడికి ప్రాధాన్యత కరువైంది. కార్మికుడు యంత్రానికి తోకగా మారిపోయాడు. అతనికి ఉండవలసింది చాకచక్యం మాత్రమే. గానుగెద్దులాంటి యంత్రంలో తానో యంత్రంగా మారి పోయాడు'' అంటూ చేసిన వివరణ ఈరోజు అత్యంత వాస్తవ దృశ్యంగా మనకు దర్శనమిస్తోంది. అది కార్మికుడికి కేవలం పొట్టపోసుకోవడానికి కావాల్సిన వసతులను మాత్రమే ఏర్పాటు చేస్తుందనీ, యంత్రాల వాడకమూ, శ్రమ విభజనా పెరిగే కొద్దీ కార్మికుడు తన ఉనికిని కోల్పోతాడనీ కమ్యూనిస్టు ప్రణాళిక ఆనాడే హెచ్చరించింది. దిగువ మధ్య తరగతివాళ్లు, చిన్న చిన్న వ్యాపారస్తులు, దుకాణదారులు, చేతి పనివాళ్ళు, రైతులు క్రమంగా తమ ఉపాధిని కోల్పోతారనీ, పెట్టుబడిదార్లతో పోటీ పడ లేక దివాళా తీస్తారనీ కూడా కారల్ మార్క్స్, ఎంగెల్స్ ఆనాడే ప్రకటించారు. ఇప్పుడు ఇది మరింత తీవ్రమైంది. దాదాపు అన్ని రంగాల్లో ఒకరిద్దరు పెట్టుబడిదార్లు మాత్రమే తమ గుత్తాధిపత్యాన్ని చలాయిస్తున్నారు. ఇది అప్పటికన్నా ఇప్పుడు మరింతగా అసమానతలను తీవ్రతరం చేస్తున్నది.

కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ పరిస్థితులను వివరించి మాత్రమే ఊరుకోలేదు. ఆనాటి బూర్జువా దోపిడీని స్పష్టంగా విశ్లేషించి, దానికి పోరాటాలు మాత్రమే పరిష్కారంగా చూపారు. సంఘర్షణ, పోరాటాలు లేకుండా సమాజం ప్రగతిని సాధించలేదని ప్రకటించారు. ఇందులోనే కార్మికవర్గం నాయకత్వాన్ని ప్రతిపాదించిన వర్గపోరాటాల చరిత్రను ఉదహరించారు. కార్మిక వర్గానికి ఒక సందే శాన్ని కూడా ఈ ప్రణాళికలోనే అందించారు. 'పోరాడితే పోయేది లేదు, బానిస సంకెళ్ళు తప్ప', 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' నినాదాలను ప్రపంచానికి ఆయుధాలుగా అందించారు.

కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ అందించిన సిద్ధాంత స్ఫూర్తితో ప్రపంచంలో ఎన్నో గొప్ప మార్పులు వచ్చాయి. రష్యా, చైనా విప్లవాలు మొదలుకొని ఎన్నో ప్రజాస్వామ్య విధానాలు అమలులోకి వచ్చాయి. భారత దేశంలో కూడా ఈనాడు మనం అనుభవిస్తున్న జీవితాలు, అమలు జరుగుతున్న విధానాలు ఎన్నో కమ్యూనిస్టు భావజాల ప్రభావం నుంచి వచ్చాయంటే అతిశయోక్తి కాదు. ప్రపంచంలో దోపిడీ, అణచివేత, అసమానత, వివక్షతలు ఉన్నంత వరకూ కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక సజీవ సిద్ధాంతంగానే ఉంటుంది. ఇది అక్షర సత్యం.


వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు
మొబైల్: 81063 22077

ఆత్మవిశ్వాసం ముఖ్యం

ఒకానొక జ్ఞాని ధ్యానం చేస్తున్న సమయమది. ఉన్నట్టుండి ఆయన ధ్యానానికి ఆటంకం కల్పిస్తూ ఓ చప్పుడు వినిపించింది. ఆయన కళ్ళు తెరచి చూసేసరికి ఎదురుగా ఓ చిట్టెలుక కనిపించింది. దానిని చూసి 'ఏం కావాలి' అని అడిగారు జ్ఞాని.

'పిల్లిని చూస్తే నాకు భయంగా ఉంది. నన్నొక పిల్లిగా మార్చి మీరు పుణ్యం కట్టుకోండి' అంది చిట్టెలుక. సరేనని జ్ఞాని వెంటనే ఆ చిట్టెలుకను పిల్లిగా మార్చేశారు. మూడు రోజుల తర్వాత మళ్ళీ జ్ఞాని ధ్యానానికి ఆటంకం కలిగింది. జ్ఞాని కళ్ళు తెరచి చూసేసరికి ఎదురుగా పిల్లి కనిపించి 'నన్ను ఓ కుక్క వెంటాడుతోంది, దాంతో ఏ కుక్కను చూసినా భయం నన్ను కలవరపరుస్తోంది. కనుక నన్ను ఇప్పటికిప్పుడు ఓ కుక్కగా మార్చేస్తే దర్జాగా బతుకుతాను' అంది. ఇంతేనా అంటూ జ్ఞాని ఆ పిల్లిని కుక్కగా మార్చేశారు.

ఓ రోజు హఠాత్తుగా ఆ కుక్క... జ్ఞాని ముందు ప్రత్యక్షమైంది. 'ఏమిటీ, చాలా కాలానికి వచ్చావు... ఏమైంది' అన్నారు జ్ఞాని. 'ఇప్పుడు నన్ను పులి భయం వెంటాడుతోంది. దయ చేసి నన్ను పులిగా మార్చేస్తే బాగుంటుంది' అంది కుక్క. సరేనని జ్ఞాని ఆ కుక్కను పులిగా మార్చేశారు.



చాలా నెలల తర్వాత ఆ పులి జ్ఞాని వద్దకు వచ్చి ఓ వేటగాడు తనను తరుముతున్నాడనీ కనుక ఒక వేటగాడిలా మార్చేస్తే బాగుంటుందనీ అంది. అలాగే అని జ్ఞాని దానిని ఓ వేటగాడిగా మార్చేశారు.

ఏడాదైంది. ఓరోజు ఆ వేటగాడు జ్ఞాని ముందు ప్రత్యక్ష మయ్యాడు. 'ఇప్పుడు నీకేం కావాలి' అడిగారు జ్ఞాని.

'నాకిప్పుడు మనుషులను చూస్తే భయమేస్తోంది' అంటూ ఏవేవో కారణాలు చెప్పడం మొదలుపెట్టాడు ఆ వేటగాడు. అప్పుడు జ్ఞాని అతని మాటలకు అడ్డు తగిలి... 'ఓ చిట్టెలుకా, నిన్ను ఎలా మారుస్తేనేం... నీ భయం నిన్ను వదిలిపోవడం లేదు. నీకున్నది చిట్టెలుక హృదయమే... నువ్వు చిట్టెలుకగా ఉండటమే అన్ని విధాలా సబబు' అని చెప్పేశారు. కనుక ఆత్మవిశ్వాసం లేకపోతే ఎన్ని అవకాశాలు వచ్చినా దేనినీ సాధించలేమనేది అందరూ గ్రహించాలి.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.విదియ రా.8.04 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: హస్త తె.5.11 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి చిత్త, వర్జ్యం: ప.12.46 నుండి 2.27 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.11 నుండి 10.58 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, అమృతఘడియలు: రా.10.51 నుండి 12.33 వరకు; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 6.18, సూర్యాస్తమయం: 6.04.

క్లుప్తంగా...

ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆడారి ఆనంద్



సాక్షి, విశాఖపట్నం: ఏపీ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆడారి ఆనంద్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వలవన్ ఉత్తర్వులు జారీచేశారు. ఆనంద్‌కుమార్ విశాఖ డెయిరీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. తనకు ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆనంద్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రెండు అవార్డులు

కూర్మన్నపాలెం (గాజువాక): ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 28వ మైన్స్ ఎన్విరాన్‌మెంట్ అండ్ మినరల్ కన్జర్వేషన్‌లో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన గర్భాం మాంగనీస్ గనికి మెకనైజ్డ్ మైన్స్ కేటగిరిలో రెండు అవార్డులు లభించాయి. వేస్ట్ డంప్ మేనేజ్‌మెంట్‌లో ప్రథమ బహుమతి, స్థిరమైన అభివృద్ధి, ఖనిజాల శుద్ధీకరణలో రెండో బహుమతి గెలుచుకుంది. వీటితోపాటు మైన్స్ ఎన్విరాన్‌మెంట్ అండ్ కన్జర్వేషన్ విభాగంలో రెండో బహుమతి, మినరల్ బెనిఫిసియేషన్ విభాగంలో మూడో బహుమతి లభించిందని అధికారులు తెలిపారు. అవార్డులను హైదరాబాద్‌లోని రీజనల్ కంట్రోలర్ ఆఫ్ మైన్స్ శైలేంద్రకుమార్ చేతుల మీదుగా స్టీల్‌ప్లాంట్ జీఎల్ఎం డీజీఎం బీయూవీఎస్ రాజు, సీనియర్ మేనేజర్ (మైన్స్) కరణ్‌కుమార్ సింగ్ అందుకున్నారు.

'వెలిగొండ' పనుల్లో ప్రమాదం... కార్మికుడి మృతి



అబిద్ హుస్సేన్ (ఫైల్ ఫొటో)

పెద్దదోర్నాల: ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం కొత్తూరు వద్ద వెలిగొండ ప్రాజెక్ట్ సొరంగ నిర్మాణ పనుల్లో జరిగిన ప్రమాదంలో బిహార్‌కు చెందిన కార్మికుడు మృతిచెందాడు. వెలిగొండ రెండో సొరంగంలోని 14.400 కి.మీ. వద్ద నిర్మాణ పనుల్లో భాగంగా మంగళవారం సాయంత్రం డ్రిల్లింగ్ చేస్తుండగా, సొరంగం పై భాగం నుంచి రాతి పొరలు జారిపడ్డాయి. ఆ రాళ్ల కింద బిహార్‌లోని రాంపూర్ జిల్లా మొటాంగి గ్రామానికి చెందిన మహ్మద్ అబిద్ హుస్సేన్ (22) చిక్కుకుపోయాడు. అతనికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే మార్కాపురంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడే పని చేస్తున్న అబిద్ హుస్సేన్ సోదరుడు సాజిద్ హుస్సేన్ కన్నీరుమున్నీరుగా విలపించడం తోటి కార్మికులను కలచివేసింది. సొరంగ పనుల్లో ప్రమాదం గురించి ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌కు సమాచారం ఇచ్చామని, కార్మికుడి మృతికి తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తున్నామని మేనేజర్ రాంబాబు తెలిపారు. మృతుడి కుటుంబానికి బీమా, ఇతర అలవెన్స్‌లు కలిపి రూ.15లక్షల వరకు నష్టపరిహారం అందుతుందని చెప్పారు. మరోవైపు పెద్దదోర్నాల ఎస్ఐ శ్రీనివాసరావు బుధవారం ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

సేంద్రియ ఉత్పత్తుల సర్టిఫికేషన్‌కు సహకారం

ఏపీ స్టేట్ సీడ్స్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్ త్రివిక్రమ్‌రెడ్డి



శ్రేష్ట ఎఫ్‌పీసీ సోలార్ పవర్డ్ కోల్డ్‌రూమ్ వద్ద డైరెక్టర్లతో త్రివిక్రమ్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి

కొల్లిపర (తెనాలి): ప్రకృతి వ్యవసాయం ఆచరిస్తోన్న రైతు ఉత్పత్తి కంపెనీల్లోని సభ్య రైతులకు, తమంతతాము ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులు పండించే ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అవసరమైన సర్టిఫికేషన్‌కు చర్యలు తీసుకుంటున్నట్టు ఏపీ స్టేట్ సీడ్స్ సర్టిఫికేషన్ అథారిటీ (ఏపీఎస్ఎస్‌సీఏ) డైరెక్టర్ డాక్టర్ త్రివిక్రమ్‌రెడ్డి చెప్పారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ సీడ్స్ డాక్టర్ సుబ్బరామిరెడ్డితో కలిసి బుధవారం గుంటూరు జిల్లా కొల్లిపరలో శ్రేష్ట ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీని ఆయన సందర్శించారు. శ్రేష్ట కంపెనీ ఇటీవల నిర్మించుకున్న క్రాప్ కలెక్షన్ సెంటర్‌ను, సోలార్ పవర్ కోల్డ్ రూమ్‌ను, సేంద్రియ విధానంలో పండిస్తోన్న పసుపు, అరటి పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంలో పండించే పంటల మార్కెటింగ్‌కు, ఎగుమతికి తగిన సర్టిఫికేషన్ ఆవశ్యకతపై కంపెనీ పాలకవర్గ డైరెక్టర్లు, సేంద్రియ రైతులతో మాట్లాడారు. ఏపీఎస్ఎస్‌సీఏ ఆధ్వర్యంలో అక్రిడిటేషన్‌కు, మార్కెటింగ్, ఎగుమతులకు ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వీరితో శ్రేష్ట ఎఫ్‌పీసీ చైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి, డైరెక్టర్లు బొంతు గోపాలరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వుయ్యూరు సాంబిరెడ్డి, రైతులు కొండా సాంబిరెడ్డి, తియ్యగూర చంద్రశేఖరరెడ్డి ఉన్నారు. తూములూరులో ప్రకృతి రైతు అవుతు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో తయారవుతున్న సంప్రదాయ పిండి వంటల కేంద్రాన్ని సందర్శించారు.

అంగన్‌వాడీల్లో 'మునగ' మెనూ

మునగాకు కూర, పప్పు రూపంలో పౌష్టికాహారం

- వారానికి రెండు రోజులు.. పైలెట్ ప్రాజెక్టు విజయవంతం
- గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ
- రక్తహీనత, థైరాయిడ్ సమస్యలకు చెక్



ఎన్టీఆర్ జిల్లా పల్లగిరి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మునగ మొక్క

సాక్షి, అమరావతి: పోషక విలువలు అత్యధికంగా ఉండే మునగను ఆహారంలో తీసుకోవడం ద్వారా చేకూరే లాభాలను వివరిస్తూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేపట్టిన కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో, ఇళ్ల వద్ద మునగ చెట్ల పెంపకం చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైంది. మునగ చెట్లను పెంచి వాటి నుంచి సేకరించిన ఆకును వారంలో రెండు రోజులపాటు అంగన్‌వాడీ మెనూలో చేర్చారు. మునగ ఆకు పప్పు, మునగాకు కూర ఇలా ఏదో ఒక రూపంలో అందిస్తుండటంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు విలువైన పౌష్టికాహారం అందుతోంది.

మునగాకుతో మేలు ఇలా..

మునగ ఆకు ద్వారా లభించే ఐరన్ గర్భిణులు, బాలింతల్లో రక్త హీనత నివారించేందుకు దోహదం చేస్తుంది. మునగ ఆకులో ఉండే విటమిన్ ఏ కారణంగా కంటిచూపు మెరుగు పడుతుంది. యాంటీ ఆక్సిడెంట్స్, కాల్షియం, ఐరన్ సమృద్ధిగా ఉండే మునగ ఆకు గర్భిణుల్లో పిండం ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదం చేయడంతోపాటు సుఖ ప్రసవం జరిగేలా ఉపకరిస్తుంది. బాలింతల్లో పాల ఉత్పత్తి పెరుగుతుంది. మునగ ఆకును ఆహారంలో తీసుకోవడం వల్ల మంచి కొవ్వు పెరుగుతుంది. థైరాయిడ్ లాంటి అనేక సమస్యలు దరి చేరకుండా చేస్తుంది.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా..

రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందచేస్తోంది. గర్భిణులు, బాలింతలు, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు కలిపి దాదాపు 36 లక్షల మందికి అంగన్‌వాడీల ద్వారా మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు రోజూ తల్లులకు 200 మిల్లీ లీటర్లు, పిల్లలకు 100 మిల్లీ లీటర్ల చొప్పున పాలు అందిస్తున్నారు.

అంగన్‌వాడీల్లో తల్లులకు మెనూ ఇలా..



వారం	తల్లులకు
సోమవారం	అన్నం, దోసకాయ పప్పు, కోడిగుడ్డు కూర
మంగళవారం	అన్నం, టమాటోపప్పు, కోడిగుడ్డు కూర
బుధవారం	అన్నం, ఆకుకూర పప్పు, కోడిగుడ్డు కూర
గురువారం	ఎగ్‌ఫ్రైడ్‌రైస్, ఆకుకూర పప్పు, కూరగాయలతో సాంబారు
శుక్రవారం	అన్నం, జీరకాయ పప్పు, మునగాకు/పాలకూరతో గుడ్డుకూర
శనివారం	వెజిటబుల్ రైస్, ఆకుకూర, కూరగాయలతో సాంబారు, ఉడికించిన కోడిగుడ్డు

అంగన్‌వాడీల్లో చిన్నారులకు మెనూ..



వారం	పిల్లలకు
సోమవారం	అన్నం, దోసకాయ పప్పు, ఉడికించిన కోడిగుడ్డు
మంగళవారం	పులిహోర, టమాటోపప్పు, కోడిగుడ్డు కూర
బుధవారం	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు
గురువారం	అన్నం, ఆకుకూర పప్పు, కూరగాయలతో సాంబారు, ఉడికించిన కోడిగుడ్డు
శుక్రవారం	అన్నం, జీరకాయ పప్పు, మునగాకు/పాలకూర, ఉడికించిన కోడిగుడ్డు
శనివారం	వెజిటబుల్ రైస్, ఆకుకూర, కూరగాయలతో సాంబారు, ఉడికించిన కోడిగుడ్డు

మునగ పొడితో మొదటి ముద్ద



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు ఆదేశాల మేరకు ప్రయోగాత్మకంగా 1,475 అంగన్‌వాడీల్లో మునగ చెట్ల పెంపకం చేపట్టాం. వారంలో రెండు రోజులపాటు మునగ ఆకుతో చేసిన కూర, పప్పు అందిస్తున్నాం. గర్భిణులు, బాలింతలు ప్రతి రోజూ ఆహారంలో మొదటి ముద్ద మునగ ఆకు పొడితో తీసుకునేలా ప్రోత్సహిస్తున్నాం.

–ఉమాదేవి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్, ఎన్టీఆర్ జిల్లా

టీ చల్లగా ఉందని ప్రశ్నించడంతో..

ఇనుప రాడ్డుతో కొట్టి అత్తను హతమార్చిన కోడలు

తిరువొత్తియూరు (తమిళనాడు): టీ చల్లగా ఉందని ప్రశ్నించిన అత్తపై కోడలు ఇనుప రాడ్డుతో దాడి చేసింది. తీవ్ర రక్తస్రావం కావడంతో అత్త అక్కడికక్కడే మృతి చెందింది. తమిళనాడులోని పుదుకోట జిల్లా విరాలిమలైకి చెందిన సుబ్రహ్మణ్యంకు భార్య కనక (42), కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇతని తల్లిదండ్రులు వేలు, పళని అమ్మాల్ (75). మంగళవారం రాత్రి కోడలు చల్లారిన టీ ఇచ్చింది. దీనిపై కోడలిని పళని ప్రశ్నించింది. ఆగ్రహించిన కోడలు కనక ఇనుప రాడ్డుతో అత్తపై దాడి చేసింది. తీవ్ర రక్తస్రావం కావడంతో పళని మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కనకను అరెస్ట్ చేశారు.

ఆస్పత్రి బెడ్‌పై దిండు, సంచి ఉంచి..

- పోలీసుల కళ్లు గప్పి సినీఫక్కీలో పరారయిన దొంగ
- గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఘటన



ఉద్దగిరి అలేఖ (ఫైల్)

గురజాల: తాను చికిత్స పొందుతున్న ఆస్పత్రి బెడ్‌పై దిండు, కర్రల సంచి ఉంచి పైన దుప్పటి కప్పి.. పోలీసుల కళ్లుగప్పి సినీఫక్కీలో ఓ దొంగ పరారయిన ఘటన గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా చర్లగుడిపాడు గ్రామానికి చెందిన ఉద్దగిరి అలేఖ ఇంట్లో దొంగనోట్లు తయారు చేస్తున్నాడనే సమాచారం రావడంతో నవంబర్ 17వ తేదీ 2022న పోలీసులు సోదా చేస్తుండగా.. అతను గోడ దూకి పరారయ్యాడు. ఈ నేపథ్యంలో అలేఖ రెండు కాళ్లు దెబ్బతిన్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో పోలీసులు ఈ ఏడాది జనవరి 3న అలేఖతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. కోర్టు అలేఖకు రిమాండ్ విధించగా సబ్ జైల్ అధికారులు అలేఖ రెండు కాళ్లకు చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. ఆపరేషన్ చేసిన అనంతరం గురజాల వైద్యశాలకు తరలించారు. అప్పటి నుంచి గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో అలేఖకు కాపలాగా ఏఆర్ కానిస్టేబుళ్లు పహారా కాస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 8 గంటలకు ఏఆర్ సిబ్బంది మంచం వద్దకు వెళ్లి చూడగా దిండు, కర్రల సంచి ఉంచి పైన దుప్పటి కప్పి అలేఖ పరారైనట్లు గుర్తించారు.

వీల్ చైర్‌తో సహా పరారీ..?

నిందితుడు ఉద్దగిరి అలేఖ వైద్యశాలలో ఉన్న వీల్ చైర్‌తో సహా పరారైనట్లు పోలీసులు తెలుపుతున్నారు. అలేఖ రెండు కాళ్లు దెబ్బతినడంతో నడవడం కష్టంగా ఉంటుందని వైద్యశాలలో ఒక వీల్ చైర్ కూడా కనిపించడం లేదని తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు పట్టణంలోని పలు కూడళ్లలో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

ముగ్గురు బాలలు దొరికారు

- మహారాష్ట్రలో కిడ్నాప్ అయిన పిల్లలు ఎన్టీఆర్ జిల్లాలో గుర్తింపు
- పోలీసుల అదుపులో ఇద్దరు నర్సులు



మహారాష్ట్ర పోలీసుల వద్దచిన్నారులు

జగ్గయ్యపేట: మహారాష్ట్రలో బాలల కిడ్నాప్ కేసులో మరో ముగ్గురు పిల్లలను పోలీసులు ఎన్టీఆర్ జిల్లాలో గుర్తించి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఇద్దరు నర్సులను అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని పరమాణి జిల్లా పాలం పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఏడాది ఫిబ్రవరిలో రెండేళ్ల నుంచి ఏడేళ్ల వయసు కలిగిన 17 మంది పిల్లలు కిడ్నాప్ అయ్యారు. ఈ కేసుల్లో అక్కడి పోలీసులు పది మందిని అరెస్ట్ చేశారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు జగ్గయ్యపేట వచ్చారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన సంగీత ఆనంద్ పలు సంతాన సాఫల్య కేంద్రాలకు ఎగ్ డోనర్ ఏజెంట్‌గా పని చేస్తుంది. ఆమె ముంబైకి చెందిన రుక్సాన్ చాంద్‌బాషాను వివాహం చేసుకుంది. భర్త వద్దకు ముంబై వెళ్లిన సంగీత ఆనంద్‌కు మహారాష్ట్రలో పిల్లలను కిడ్నాప్ చేసే నేరస్తురాలు సుల్తానాతో పరిచయం ఏర్పడింది. సుల్తానా తాను కిడ్నాప్ చేసిన పిల్లలను విక్రయించేందుకు సంగీత ఆనంద్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ తర్వాత సంగీత ఆనంద్ తనకు పరిచయం ఉన్న ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తున్న పగడాల శ్రావణితో మాట్లాడి సంతానం లేని వారిని గుర్తించి పిల్లలను విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు సంగీత తీసుకొచ్చిన పిల్లలను శ్రావణి, తన స్నేహితురాలు అయిన జగ్గయ్యపేటలోని చెరువుబజారుకు చెందిన ఇరుగుదుండ్ల శిల్ప (ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సు)తో కలిసి ఏడాది వ్యవధిలో నలుగురిని విక్రయించారు. వత్సవాయి మండలం దేచుపాలెంలో ఇద్దరు పిల్లలను, జగ్గయ్యపేటలో ఒకరిని, విస్సన్నపేటలో మరొకరిని రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు విక్రయించారు. వారిలో ముగ్గురు చిన్నారులు చరణ్, సయ్యద్ సుభానీ, సయ్యద్ అయాన్‌ను పోలీసులు గుర్తించి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వారిని తమకు అప్పగించాలని పెంచిన తల్లిదండ్రులు జగ్గయ్యపేట పోలీస్‌స్టేషన్ వద్ద కొద్దిసేపు ఆందోళన చేశారు. ఇది కిడ్నాప్ కేసు అని, సహకరించాలని పోలీసులు కోరగా, వారు ఆందోళన విరమించారు. శ్రావణి, శిల్పను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఈ నెల 5న ఒక బాలుడిని, 8న మరో ఇద్దరిని గుర్తించి మహారాష్ట్ర తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహారాష్ట్ర పోలీసులకు పూర్తి సహకారం అందించామని జగ్గయ్యపేట సీఐ అడపా నాగమురళి తెలిపారు.

అన్నమయ్య జిల్లా రైతుకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న రైతు శ్రీనాథ్‌రెడ్డి

రామాపురం: అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలోని బుర్రకుంట రాచపల్లెకు చెందిన రైతు మోపూరి శ్రీనాథ్‌రెడ్డికి ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. ఢిల్లీలోని ఐసీఏఆర్–ఐఏఆర్ఐలో బుధవారం నిర్వహించిన పూసా కృషి విజ్ఞాన్ మేళాలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర తోమర్ చేతుల మీదుగా ఇన్నోవేటివ్ ఫార్మర్ పురస్కారాన్ని శ్రీనాథ్‌రెడ్డి అందుకున్నారు. శ్రీనాథ్‌రెడ్డి ఫ్యాషన్ డిజైనర్ ఉద్యోగాన్ని వదిలి ప్రకృతి వ్యవసాయంలో విశేష కృషి చేస్తున్నారు.

పెంచలకోన దేవస్థానానికి 200 ఎకరాలు అప్పగింత

- 1బి, అడంగళ్‌ను అందించిన కలెక్టర్ చక్రధర్‌బాబు, డీఎఫ్‌వో చంద్రశేఖర్



దేవస్థానం చైర్మన్, ఈవోకు 1బి, అడంగళ్‌ను అందిస్తున్న కలెక్టర్, డీఎఫ్‌వో

రాపూరు(శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన దేవస్థానానికి 200 ఎకరాల భూమికి సంబంధించిన 1బి, అడంగళ్‌ను బుధవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ ఆలయ చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఈవో జనార్దన్‌రెడ్డికి అందించారు. పెంచలకోన దేవస్థానానికి 1891సంవత్సరంలో మద్రాసు ప్రెసిడెన్సీ 200 ఎకరాల భూమిని కేటాయించింది. కానీ అంత భూమి దేవస్థాన పరిధిలో లేకపోవడం, దేవస్థాన పరిధిలోని భూమి అటవీశాఖకు చెందినదిగా అటవీశాఖ అధికారులు చెబుతుండడంతో దేవస్థానం అధికారులు ఈ సమస్యను కలెక్టర్ చక్రధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రెవెన్యూ, అటవీశాఖ, దేవదాయశాఖ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించారు. మూడు శాఖల అధికారులు అందించిన నివేదికను కలెక్టర్ పరిశీలించి దేవస్థానానికి 200 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించి వాటికి సంబంధించిన 1బి, అడంగళ్‌ను బుధవారం శ్రీవారి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహించిన అనంతరం దేవస్థానం అధికారులకు అందించారు. చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఈవో జనార్ధన్ రెడ్డి కలెక్టర్, డీఎఫ్‌వోకు కృతజ్ఞతలు తెలిపారు.

పాడి 'పరిశ్రమ'లకు కొత్త బాటలు

విశాఖలో రూ.200 కోట్లతో పౌల్ట్రీ అండ్ ప్రాసెసింగ్ యూనిట్



సాక్షి, అమరావతి: పాడి రంగంలో పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త బాటలు వేసింది. విశాఖ వేదికగా జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ఈ మేరకు ఒప్పందాలు చేసుకుంది. ముందెన్నడూ లేనివిధంగా ఒక్క పాడి పరిశ్రమ రంగంలోనే రూ.1,020 కోట్ల విలువైన 8 ఒప్పందాలు జరిగాయి. వీటిలో రెండు యూనిట్లలో ఉత్పత్తికి సమ్మిట్ వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టగా.. మిగిలిన ఆరు యూనిట్లను ఆరు నెలల్లో స్థాపన (గ్రౌండింగ్) చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఉత్పత్తి ప్రారంభించిన యూనిట్ల ద్వారా 230 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించగా.. మిగిలిన 6 యూనిట్ల ద్వారా మరో 3,520 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. పరోక్షంగా మరో 5వేల మందికి ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి.

రూ.175 కోట్లతో ప్రొటీన్ ప్లాంట్లు

పాడి పశువులతోపాటు సన్నజీవాలకు, కోళ్లకు నాణ్యమైన సర్టిపై చేసిన ప్రొటీన్ ఫుడ్ అందించాలన్న సంకల్పంతో ప్రొటీన్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇండిజియస్ ప్రొటీన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గుంటూరులో 50 ఎకరాల విస్తీర్ణంలో రూ.175 కోట్ల అంచనా వ్యయంతో ప్రొటీన్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ యూనిట్ ద్వారా 500 మందికి ఉపాధి లభించనుంది.

పులివెందులలో వ్యాక్సిన్ హబ్

పశువులు, జీవాల్లో గాలికుంటు, గొంతు వాపు, నీలి నాలుక, చిటుకు, చీడపారుడు, బొబ్బ, దొమ్మ, జబ్బవాపు, కొక్కెర, మశూచి, గోట్ ఫాక్స్ రోగాల నివారణకు సీజన్ల వారీగా వ్యాక్సిన్లు వేస్తుంటారు. రాష్ట్రంలోని పశువులు, జీవాలకు ఏటా 6 కోట్ల డోసులు అవసరం ఉంటుందని అంచనా. వీటి కోసం పొరుగు రాష్ట్రాల్లోని కంపెనీలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితికి చెక్ పెట్టేందుకు వ్యాక్సిన్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలన్న సంకల్పంతో ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందులో భాగంగా పులివెందులలో మెగా వ్యాక్సిన్ మాన్యుఫాక్చరింగ్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం 100 ఎకరాలను కేటాయించగా.. రూ.300 కోట్లతో హబ్ ఏర్పాటుకు ముందుకొచ్చిన బయో వెట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ హబ్ ద్వారా కనీసం 500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనుండగా.. పరోక్షంగా మరో 300 మందికి ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి.

రూ.230 కోట్లతో పౌల్ట్రీ ప్రాసెసింగ్ యూనిట్లు

రాష్ట్రంలో రోజుకు 4.75 కోట్ల కోడిగుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో 2.50 కోట్ల నుంచి 3 కోట్ల వరకు స్థానికంగా వినియోగిస్తుండగా.. పొరుగు రాష్ట్రాలతోపాటు గల్ఫ్ దేశాలకు మిగిలిన గుడ్లు ఎగుమతి అవుతున్నాయి. ఈ నేపథ్యంలో నాణ్యమైన గుడ్ల ఉత్పత్తితో పాటు ఎగుమతులను ప్రోత్సహించే లక్ష్యంతో పౌల్ట్రీ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం ముస్తల గంగవరం వద్ద రూ.30 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన లిక్విడ్ ఎగ్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వేదికగా ప్రారంభమైంది. ఈ ప్లాంట్‌లో 50 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కాగా.. విశాఖలో 40 ఎకరాల్లో రూ.200 కోట్లతో పౌల్ట్రీ అండ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఎంఎస్ఆర్ ఫారమ్స్ సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ యూనిట్ ద్వారా 500 మందికి ఉపాధి లభించనుంది.

నాలుగుచోట్ల మీట్ ప్రాసెసింగ్ యూనిట్లు

కోడిగుడ్ల ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉన్న ఏపీ.. మాంసం ఉత్పత్తిలో నాలుగో స్థానంలో ఉంది. కానీ.. మాంసం ఎగుమతుల్లో మాత్రం టాప్–10లో ఉంది. మాంసం స్థానిక వినియోగంతోపాటు ఎగుమతులను ప్రోత్సహించే సంకల్పంతో నూజివీడు దగ్గర రెండు, బాపట్ల, ఏలూరు వద్ద ఒక్కొక్కటి చొప్పున మీట్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. నూజివీడు వద్ద 15 ఎకరాల్లో ఏవోపీ ఆగ్రో ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.200 కోట్లతో ఏర్పాటు చేసిన మీట్ ప్రాసెసింగ్ యూనిట్ ఒప్పందం రోజునే ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. ఇదే ప్రాంతంలో ఈ సంస్థ నిర్వహిస్తున్న మరో యూనిట్‌ను రూ.50 కోట్లతో విస్తరించనుంది. కొత్త యూనిట్ ద్వారా 1,000 మందికి, విస్తరిస్తున్న యూనిట్ ద్వారా 200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. కాగా, నూజివీడు వద్ద అల్ సమి ఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.15 కోట్లతో ప్లాంట్‌ను విస్తరిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా 300 మందికి నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. బాపట్ల వద్ద 10 ఎకరాల్లో జల్లికట్టు ఐఎన్‌సీ సంస్థ రూ.50 కోట్లతో కొత్తగా మీట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఈ యూనిట్ ద్వారా 300 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది.

రూ.1,020 కోట్ల పెట్టుబడులతో..

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌కు తగినట్టుగా ఔత్సాహికులు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారు. పశు సంవర్ధక శాఖకు సంబంధించి రూ.1,020 కోట్ల విలువైన 8 ఒప్పందాలు జరిగాయి. వాటిలో రెండు యూనిట్లు అప్పటికప్పుడే ఉత్పత్తికి శ్రీకారం చుట్టాయి. మిగిలిన యూనిట్లను ఆరు నెలల్లో గ్రౌండింగ్ చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.

– డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్, డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ

లౌకిక ప్రజాస్వామ్య విధ్వంసానికి బీజేపీ కుట్ర

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి కల్చరల్: దేశ అభివృద్ధిని పట్టించుకోకుండా మతాన్ని తెరమీదకు తీసుకుతెచ్చి బీజేపీ రాజకీయ పబ్బం గడుపుకుంటోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ విమర్శించారు. బుధవారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రశ్నించే గొంతుకలపై దాడులను చేస్తూ అణిచివేయాలని చూస్తోందని ఆరోపించారు. తమకు వ్యతిరేకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్ష పార్టీలు, నేతలపై పనిగట్టుకుని సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలచే దాడులు చేయిస్తోందన్నారు. ఆదానీ పోర్టులు అభివృద్ధి చేసుకోవడానికి రహదారులు వేస్తున్నారని విమర్శించారు. ఈ పోర్టుల ద్వారా విదేశాల నుంచి గంజాయి రవాణా చేస్తున్నారని ఆరోపించారు. అన్ని రాష్ట్రాలు బొగ్గు కొనుగోలులో 20 శాతానికిపైగా కేంద్రానికి చెల్లించాలని చెప్పడం శోచనీయమన్నారు. దేశంలో విద్య, వైద్య రంగాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దేశ అభివృద్ధిని పక్కన పెట్టి మతాన్ని తెరమీదకు తీసుకొచ్చిందని తెలిపారు. బీజేపీ వ్యతిరేకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలపై పనిగట్టుకుని దాడులు చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం కాపాడేందుకు దేశవ్యాప్తంగా పోరాటం సాగిస్తామని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో టిడ్కో ఇళ్లను ఈనెల 15లోపు లబ్ధిదారులకు అప్పగించకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఉగాదికి గృహ ప్రవేశాలు చేయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జయలక్ష్మి, తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు



తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 59,751 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 20,177 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

విశాఖ వేదికగా పాలన హర్షణీయం

892వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



తాడికొండ: ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజల ఆశయాలకు అనుగుణంగా విశాఖ వేదికగా పాలన కొనసాగించాలనే ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 892వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆనాడే డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగ వేదికగా సూచించారని, అదే విషయాన్ని రాజధాని కోసం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీలు సైతం సూచించినా బాబు పెడచెవిన పెట్టిన కారణంగానే ఈ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. వికేంద్రీకరణ ద్వారా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ, వలంటీర్‌లను తీసుకొచ్చి ఇంటింటికీ సేవలు అందిస్తుంటే ఓర్చుకోలేక ఓ సామాజిక వర్గం తప్పుడు ప్రచారాలు చేస్తుండడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. బాబు అండ్ కో, ఎన్ఆర్ఐ బినామీలు చేస్తున్న దొంగ దీక్షలకు ఆదరణ కరువవడంతో అమరావతి దీక్షా శిబిరాలు వెలవెలబోతున్నాయని తెలిపారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నారీ శక్తికి సలాం: మోదీ

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రగతిలో మహిళలు అమూల్య పాత్ర పోషిస్తున్నారంటూ కొనియాడారు. మహిళా సాధికారత కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందంటూ ట్వీట్ చేశారు. మన్ కీ బాత్‌లో క్రోడీకరించిన మహిళల స్ఫూర్తి గాథలను షేర్ చేశారు. నారీశక్తి ఫర్ న్యూ ఇండియా అంటూ హ్యాష్‌ట్యాగ్ జత చేశారు. భారత మహిళల స్ఫూర్తిదాయకత్వంపై 'హర్ స్టోరీ, మై స్టోరీ...' శీర్షికతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాసిన వ్యాసాన్ని కూడా ప్రధాని షేర్ చేశారు. ''త్రిపుర నుంచి తిరిగొస్తూ వ్యాసం చదివా. ఎంతో స్ఫూర్తిదాయకంగా అనిపించింది. అతి సాధారణ స్థాయి నుంచి దేశ అత్యున్నత అధికార పీఠం దాకా ఎదిగిన ఒక స్ఫూర్తిదాయక మహిళ ప్రయాణాన్ని కళ్లకు కట్టిన ఆ వ్యాసాన్ని అందరూ చదవాలి'' అని సూచించారు. అన్ని రంగాల్లోనూ దేశాభివృద్ధిలో మహిళలది కీలక పాత్ర అంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ కూడా కొనియాడారు.

సిసోడియాకు ప్రాణ హాని

నేరగాళ్లతో కలిపి ఉంచారు: ఆప్

న్యూఢిల్లీ: మద్యం విధానం కేసులో అరెస్టైన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోడియాకు తిహార్ జైల్లో ప్రాణ హాని ఉందని పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ఆయన్ను ఒకటో నంబర్ జైల్లో కరడుగట్టిన నేరగాళ్లతో కలిపి ఉంచారని ఆప్ అధికార ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. ''ధ్యానం చేసుకోవడానికి వీలుగా విపాసన సెల్‌లో ఉంచాలన్న సిసోడియా విజ్ఞప్తి చేశారు. అందుకు కోర్టు కూడా సమ్మతించినా జైలు అధికారులు మాత్రం తోసిపుచ్చారు'' అని విమర్శించారు. దీనిపై కేంద్రం బదులిచ్చి తీరాలన్నారు. ఆప్ ఆరోపణలను జైలు వర్గాలు తోసిపుచ్చాయి. ''సిసోడియాతో పాటున్న ఖైదీల్లో అంతా సత్ప్రవర్తన గలవారే. గ్యాంగ్‌స్టర్లెవరూ లేరు'' అని చెప్పాయి.

ఇరాన్‌లో 'బాలికలకు విషం'... యునెస్కో ఆందోళన

దుబాయ్: ఇరాన్‌లో ను విద్యకు దూరం చేసేందుకు వారి స్కూళ్లపైకి విష వాయువులు వదులుతున్న ఉదంతాలపై యునెస్కో ఆందోళన వెలిబుచ్చింది. దీనిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరింది. స్కూళ్లలో బాలికలకు పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని సూచించింది. ఇరాన్‌లో జరుగుతున్న పరిణామాలను తన మనసును తీవ్రంగా కలచివేస్తున్నాయని యునెస్కో సారథి ఆద్రే అజౌలే అన్నారు.

రైలెక్కి రయ్.. రయ్...

విమానాల కంటే మేలు ● రైలు ప్రయాణాలకే జనం మొగ్గు ● యూరప్‌లో కొత్త పోకడ

ఇంటి నుంచి కాలు బయట పెడితే విమానాలు ఎక్కడమే వారికి తెలుసు. రయ్యిమంటూ గాల్లో తేలిపోతూ గమ్యస్థానాలకు చేరుకోవడాన్ని ఇష్టపడతారు. అలాంటిది ఇప్పుడు వారిలో కూడా మార్పు వస్తోంది. హాయిగా రాత్రిపూట రైలెక్కి బెర్త్ వాల్చితే ఉదయానికల్లా ఊరు చేరుకోవడంలో ఎంత సదుపాయముందో యూరప్ వాసులు గ్రహించారు. చుకు బుకు చుకు బుకు రైలును, అదిరిపోయే దాని స్టైలును, ఆ ప్రయాణంలోని మజాను ఆస్వాదిస్తున్నారు. విమాన ప్రయాణాలతో పెరిగిపోతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి యూరప్‌లో పలు దేశాలు కూడా రైలు ప్రయాణాలకు ప్రజలను ప్రోత్సహిస్తున్నాయి. దాంతో వారు కూడా తక్కువ దూరాలకు విమానానికి బదులుగా రైలు వైపే మొగ్గు చూపిస్తున్నారు...

యూరప్‌లో రైలు ప్రయాణాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని డచ్ విమానయాన సంస్థ కేఎల్ఎమ్ వంటివి రైలు రవాణా నెట్‌వర్క్‌లో భాగస్వాములవుతున్నాయి. యూరోపియన్ కమిషన్ కూడా 2021ని ఇయర్ ఆఫ్ యూరోపియన్ రైల్‌గా ప్రకటించి రైలు ప్రయాణికులకు భారీగా ప్రోత్సాహకాలు కల్పించింది. హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టడం, రైలు టికెట్ ధరల్ని తగ్గించడం వంటి చర్యలతో ఇప్పుడు చాలామంది రైలు జర్నీయే సో బెటరని అంటున్నారు. ముఖ్యంగా స్వల్ప దూర ప్రయాణాలకు రైళ్లల్లో వెళ్లడానికి యూరప్ పౌరుల్లో 62% మంది ఇష్టపడుతున్నారని తాజా సర్వేలో తేలింది. 1990 తర్వాత మళ్లీ ఇప్పుడు రాత్రిళ్లు ప్రయాణించే స్లీపర్ రైళ్లకు హఠాత్తుగా డిమాండ్ పెరిగింది.

ప్రభుత్వాల ద్వంద్వ ప్రమాణాలు...

యూరప్‌లో విమాన ప్రయాణాల వల్ల వెలువడుతున్న కాలుష్యం ఏటా పెరుగుతూనే ఉంది. ఈ పెరుగుదల 2013–2019 మధ్య ఏడాదికి సగటున 5% చొప్పున నమోదైంది! ఈ నేపథ్యంలో యూరప్ దేశాలు కేవలం స్వల్ప దూరాల విమానాలను మాత్రమే నిరుత్సాహపరుస్తూ అధిక దూరం ప్రయాణించే విమానాలకు ప్రోత్సాహకాలు కొనసాగించడాన్ని పర్యావరణవేత్తలు వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల వచ్చే పెద్దగా ఒరిగేదేమీ ఉండదంటూ పెదవి విరుస్తున్నారు. **- సాక్షి, నేషనల్ డెస్క్**



వాటి కాలుష్యమే అధికం

ప్రపంచవ్యాప్తంగా అధిక దూరాలు ప్రయాణించే విమానాల నుంచి వెలువడే కాలుష్యమే ఎక్కువ! జర్నల్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ జియోగ్రఫీ తాజా నివేదిక ప్రకారం 500 కి.మీ. కంటే తక్కువ దూరం ప్రయాణించే విమానాల యూరోపియన్ యూనియన్‌లో 27.9 % కాగా వాటి నుంచి వెలువడే కర్బన ఉద్గారాలు 5.9%. 4 వేల కి.మీ. కంటే అధిక దూరం వెళ్లే విమానాలు కేవలం 6.2% మాత్రమే. కానీ వాటినుంచి వెలువడే కాలుష్యం ఏకంగా 47 శాతం! అలాంటప్పుడు కేవలం తక్కువ దూరాలు ప్రయాణించే విమానాల రద్దుతో ఒరిగే ప్రయోజనాలేమిటన్న ప్రశ్న వినిపిస్తోంది.

కొన్ని దశాబ్దాలుగా విమాన ప్రయాణానికే అలవాటు పడడంతో చాలా మార్గాల్లో రైలు సదుపాయం లేదు. కొత్త ట్రాక్‌లు నిర్మించడం, రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచడం వంటి చర్యలు ఇంకా తీసుకోవాల్సి ఉంది. చాలా దేశాల్లో విమాన ప్రయాణాల కంటే రైలు ప్రయాణాలు

రైల్వేలకున్న అడ్డంకులివే..!

ఎక్కువ ఖరీదు. అధిక చార్జీలు కూడా రైలు ప్రయాణానికి అడ్డంకిగా మారింది. యూరప్ రైలు ఆపరేటర్లకు లాభార్జనే ధ్యేయం. మార్కెట్ షేర్ కంటే అధిక లాభాలు ప్రజల నుంచి గుంజాలని చూస్తుంటాయి. ఇవన్నీ రైల్వేల విస్తరణకు అడ్డంకిగా మారుతున్నాయి.

ఫ్లైట్ షేమ్ ఉద్యమంతో దశ మారిన రైల్వే

యూరప్‌లో ప్రజలు రైలు ప్రయాణానికి మొగ్గుచూపించడానికి ఫ్లైట్ షేమ్ ఉద్యమం ప్రధాన కారణం. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి స్వీడన్‌కు చెందిన టీనేజ్ ఉద్యమకారిణి గ్రేటా థెన్‌బర్గ్ 2019లో ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. న్యూయార్క్‌లో జరిగిన ఐక్య రాజ్యసమితి పర్యావరణ సదస్సుకి హాజరవడానికి ఆమె విమాన ప్రయాణం చెయ్యకుండా అట్లాంటిక్ సముద్రంలో నౌకలో కొద్ది రోజుల పాటు ప్రయాణించి మరీ అమెరికా చేరుకున్నారు. విమానం నడపడానికి భారీగా చమురు ఖర్చు చేయడం వల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోతోందని అందుకే విమానానికి బదులుగా పడవలు, రైళ్లు, బస్సుల్లో ప్రయాణించాలని గ్రేటా థెన్‌బర్గ్ పిలుపునిచ్చారు. ఈ ఉద్యమ ప్రభావంతో యూరప్ వాసులు విమానాలకి బదులుగా రైలు ప్రయాణంపై ఆసక్తి చూపించడం మొదలుపెట్టారు.

యూరప్ దేశాలు తీసుకుంటున్న చర్యలివే...

- జర్మనీ, ఆస్ట్రియా, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, స్పెయిన్, ఇటలీ వంటి దేశాలన్నీ రైలు ప్రయాణానికే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి.
- తక్కువ దూరం ఉండే మార్గాల్లో ఫ్రాన్స్ ప్రభుత్వం విమానాలను రద్దు చేసింది. ఆయా మార్గాల్లో కొత్త రైళ్లను నడపడం ప్రారంభించింది.
- రెండున్నర గంటల కంటే తక్కువ సమయం పట్టే రెండు ఊళ్ల మధ్య రైళ్లలోనే ప్రయాణం చేయడం తప్పనిసరి చేసింది.
- దీని వల్ల దేశీయంగా విమానం ద్వారా వెలువడే గ్రీన్‌హౌస్ వాయువుల్ని 3% తగ్గించగలిగింది.
- 2020లో ఆస్ట్రియా ప్రభుత్వం రైలులో ప్రయాణిస్తే మూడు గంటల కంటే తక్కువ సమయం పట్టే అన్ని మార్గాల్లోనూ విమానాలను రద్దు చేసింది.
- ఆస్ట్రియాలో 350 కి.మీ. కంటే తక్కువ దూరం విమానాల్లో వెళ్లే ప్రయాణికుల నుంచి 30 యూరోల పన్ను వసూలు చేస్తోంది.
- మరోవైపు 2050 నాటికి 2.5 గంటల కంటే తక్కువ సమయాల్లో వెళ్లే విమానాలన్నీ రద్దు చేయడానికి స్పెయిన్ సన్నాహాలు చేస్తోంది.

బాల్యంలో నిమోనియా బారిన పడితే...
పెద్దయ్యాక ఇన్ఫెక్షన్ల ముప్పు



లండన్: బాల్యంలో నిమోనియా వంటివాటి బారిన పడ్డవారికి పెద్దయ్యాక శ్వాసపరమైన ఇన్ఫెక్షన్ల ముప్పు అధికమని ఓ అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా 26 నుంచి 73 ఏళ్ల మధ్య వయసులో శ్వాస సంబంధిత సమస్యలతో మరణించే ప్రమాదమూ ఎక్కువేనని అది తేల్చింది. ''రెండేళ్లు, అంతకంటే తక్కువ వయసులో బ్రాంకైటిస్, నిమోనియా వంటివాటి బారిన పడేవారిలో పెద్దయ్యాక శ్వాస సంబంధిత వ్యాధులతో అకాల మరణం సంభవించే ఆస్కారం ఇతరులతో పోలిస్తే 93 శాతం ఎక్కువ'' అని వివరించింది. దీర్ఘకాలిక శ్వాస సమస్యలు పెద్ద ఆరోగ్య సమస్యగా మారాయి. వీటివల్ల 2017లో ప్రపంచవ్యాప్తంగా 39 లక్షల మంది మరణించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో చాలా మరణాలకు క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) కారణమని అధ్యయనం పేర్కొంది. అందుకే శ్వాస సంబంధిత సమస్యలను చిన్నతనంలోనే సంపూర్ణంగా నయం చేయడంపై మరింతగా దృష్టి సారించాల్సిన అవసరం చాలా ఉందని అధ్యయనానికి సారథ్యం వహించిన ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్‌కు చెందిన జేమ్స్ అలిన్సన్ అభిప్రాయపడ్డారు. దీని ఫలితాలు ద లాన్సెట్ జర్నల్లో ప్రచురితమయ్యాయి.

అంగారకుడిపై సూర్యకిరణాలు



వాషింగ్టన్: ఫొటోలో కనిపిస్తున్నవేమిటో తెలుసా? అంగారకునిపై కనువిందు చేస్తున్న సూర్య కిరణాలు. కుజ గ్రహంపై సూర్య కిరణాలు మన కంటపడటం ఇదే తొలిసారి! మార్స్‌పై పరిశోధనలు చేస్తున్న క్యూరియాసిటీ రోవర్ తాజాగా వీటిని తన కెమెరాలో బంధించింది. దిగంతాల మీదుగా సూర్యుడు అస్తమిస్తున్న క్రమంలో మేఘాలన్నింటినీ ప్రకాశవంతం చేస్తున్న తీరును ఫొటోలో గమనించవచ్చు. కుజునిపై మేఘాలు ఉపరితలానికి 60 కిలోమీటర్ల ఎత్తున నీరు, మంచుతో కూడి ఉన్నాయని నాసా అంచనా. కుజ గ్రహాన్ని వాసయోగ్యం చేసుకుని అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధనలకు కేంద్రంగా మార్చుకోవాలని అమెరికా భావిస్తోంది. ఈ క్రమంలో అక్కడి వాతావరణం, దాని కూర్పు, ఇతర స్థితిగతులను తెలుసుకోవడానికి దాని మేఘాలను విశ్లేషించడం కీలకం.



గాయపడ్డ సైనికులకు సహాయ చర్యలందించే డ్రిల్స్‌లో పాల్గొన్న బ్రిటన్ యువరాణి కేట్ మిడిల్టన్. ఐరిష్ గార్డ్స్‌లో కల్నల్‌గా నియమితురాలైన నేపథ్యంలో ఆమె తాజాగా ఇలా 1వ బెటాలియన్‌ను సందర్శించారు.

రెండోసారి త్రిపుర సీఎంగా మాణిక్ సాహా



కార్యక్రమంలో సీఎం సాహాతో ప్రధాని మోదీ

అగర్తలా: త్రిపుర ముఖ్యమంత్రిగా వరుసగా రెండోసారి బీజేపీ నేత మాణిక్ సాహా ప్రమాణస్వీకారం చేశారు. అగర్తలాలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో సాహా చేత రాష్ట్ర గవర్నర్ సత్యదేవ్ నారాయణ్ ఆర్య ప్రమాణం చేయించారు. సాహాతోపాటు మరో ఎనిమిది మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. 60 సీట్లున్న త్రిపుర అసెంబ్లీలో బీజేపీ 32 స్థానాల్లో గెలిచి మెజారిటీ మార్కును సాధించి అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న సంగతి తెల్సిందే. ఈ నేపథ్యంలో బుధవారం ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమంలో ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బిరేన్ సింగ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాహాను ప్రధాని అభినందించారు. మంత్రులుగా ప్రమాణం చేసిన వారిలో ముగ్గురు గిరిజన ప్రాంత ఎమ్మెల్యేలు, బీజేపీ కూటమి పార్టీ ఇండీజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ) పార్టీ నేత కూడా ఉన్నారు. సీఎం రేసులో ఉన్నట్లు వార్తలొచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ఎమ్మెల్యే ప్రతిమా భౌమిక్ కేబినెట్‌లో చేరలేదు. ఎన్నికల తర్వాత హింసాత్మక ఘటనలకు నిరసనగా విపక్ష వామపక్ష, కాంగ్రెస్ పార్టీలు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరించాయి.

తిప్రా మోతా చీఫ్‌తో షా భేటీ

'గ్రేటర్ తిప్రాల్యాండ్' సాధన కోసం ఉద్యమసంస్థగా మొదలై తర్వాత రాజకీయ పార్టీగా మారిన తిప్రా మోతా తరఫున ఆరుగురు సభ్యుల ప్రతినిధుల బృందం బీజేపీ అగ్రనేత అమిత్ షాతో భేటీ అయింది. అగర్తలాలో మొదలైన భేటీలో తిప్రా మోతా చీఫ్ ప్రద్యోత్ కిశోర్ దేవ్ బర్మన్, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, నూతన సీఎం మాణిక్ సాహా సైతం పాల్గొన్నారు. చిన్న రాష్ట్రాన్ని ముక్కలు చేయబోమని, త్రిపుర ట్రైబల్ అటానమస్ కౌన్సిల్‌కు శాసన, ఆర్థిక, కార్యనిర్వాహక అధికారాల్లో ప్రాధాన్యత కల్పిస్తామని బీజేపీ మొదట్నుంచీ చెబుతున్న విషయం తెల్సిందే.

మెరుగైన స్నేహబంధం కోసం
ఎదురుచూస్తున్నాం

ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ భారత పర్యటనపై మోదీ

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: భారత్– ఆస్ట్రేలియా బలీయ స్నేహబంధం కోసం ఎదురుచూస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నాలుగు రోజుల భారత పర్యటనలో భాగంగా బుధవారం అహ్మదాబాద్ చేరుకున్న ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్‌నుద్దేశిస్తూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం అహ్మదాబాద్ చేరుకున్న అల్బనీస్ నేరుగా సబర్మతీ ఆశ్రమానికి వెళ్లి మహాత్మునికి నివాళులర్పించారు. 'వాణిజ్యం, భద్రత వంటి అంశాల్లో క్రియాశీలకంగా ఉన్న భారత్‌తో బహుముఖ బంధాలను బలపరుచుకునేందుకు ఆస్ట్రేలియాకు లభించిన అద్భుత అవకాశం ఇది. నూతన సాంకేతికత, ఆవిష్కరణలకు చోదక శక్తి భారత్. మా దేశంలో పెద్దసంఖ్యలో వైవిధ్య భారత్, ఆస్ట్రేలియా ప్రజల వల్లే మా దేశం ఇంతగా అభివృద్ధి చెందింది ' అని భారత్‌కు విచ్చేసిన సందర్భంగా అల్బనీస్ వ్యాఖ్యానించారు.

భారతీయ డిగ్రీలకు ఆస్ట్రేలియాలో గుర్తింపు

'ఆస్ట్రేలియా–భారత్ విద్యార్హత గుర్తింపు వ్యవస్థ'ను అందుబాటులోకి తెస్తున్నట్లు అల్బనీస్ ప్రకటించారు. అంటే ఆస్ట్రేలియా చదువుకుంటున్న, చదివిన భారతీయ విద్యార్థుల డిగ్రీలను ఇండియాలో అనుమతిస్తారు. అలాగే భారత్‌లో చదివిన డిగ్రీనీ ఆస్ట్రేలియాలో గుర్తింపునకు అనుమతిస్తారు. మరోవైపు గాంధీనగర్‌లోని గిఫ్ట్ సిటీలో ఆస్ట్రేలియాకు చెందిన డీకెన్ యూనివర్సిటీ తన అంతర్జాతీయ బ్రాంచ్ క్యాంపస్‌ను నెలకొల్పనుంది. ఆస్ట్రేలియా నాలుగేళ్లపాటు చదవనున్న భారతీయ విద్యార్థులకు 'మైత్రి' పేరిట ఉపకారవేతనం సైతం అందిస్తామని అల్బనీస్ చెప్పారు.



బుధవారం గాంధీనగర్‌లోని రాజ్‌భవన్‌లో హోలీ వేడుకలో అల్బనీస్

నేడు మోదీతో కలిసి టెస్ట్ మ్యాచ్ వీక్షణ

బుధవారం గాంధీనగర్‌లోని రాజ్‌భవన్‌లో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో కలిసి హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గురువారం అహ్మదాబాద్‌లోని మోతెరా నిర్మించిన నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్, ఆస్ట్రేలియా నాలుగో టెస్ట్ మ్యాచ్ తొలి రోజు ఆటను ప్రధాని మోదీతో కలిసి వీక్షిస్తారు. అల్బనీస్‌తో కలిసి మ్యాచ్ చూసేందుకు మోదీ సైతం బుధవారమే అహ్మదాబాద్ చేరుకున్నారు. తర్వాత అల్బనీస్ ముంబై చేరుకుంటారు. శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతిభవన్‌లో రాష్ట్రపతి ముర్మును మర్యాదపూర్వకంగా కలుస్తారు. తర్వాత మోదీతోపాటు ఇరుదేశాల వార్షిక సదస్సులో పాల్గొంటారు. సమగ్ర వ్యూహాత్మక ఒప్పందం తదితరాలపై చర్చించనున్నారు. ప్రధానిగా అల్బనీస్‌కు ఇదే తొలి భారత పర్యటన.

మళ్లీ కశ్మీర్‌పై పాక్ ఏడుపు

ఐరాస వేదికగా ప్రస్తావన ● దీటుగా తిప్పికొట్టిన భారత్

ఐక్యరాజ్య సమితి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో జరిగిన ఒక చర్చాకార్యక్రమంలోనూ కశ్మీర్ అంశాన్ని లేవదీసి పాకిస్తాన్ భారత్‌పై తన అక్కసును మరోసారి వెళ్లబోసుకుంది. దీంతో భారత్ ఘాటుగా స్పందించింది. పాకిస్తాన్ చేసే ద్వేషపూరిత, తప్పుడు ప్రచారాలకు కనీసం స్పందించాల్సిన అవసరం తమకు లేదని భారత్ తేల్చిచెప్పింది. నెలపాటు మొజాంబిక్ దేశ అధ్యక్షతన ఐరాస భద్రతా మండలిలో సమావేశాలు జరుగుతున్నాయి. ఇందులోభాగంగానే ' మహిళలు, శాంతి, భద్రత' అంశంపై చర్చలో పాకిస్తాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ అసంబద్ధంగా జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రసంగించారు. ఆ తర్వాత ఐరాస భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ మాట్లాడారు. ' బిలావల్ వ్యాఖ్యానాలు పూర్తిగా నిరాధారం. పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో చేసిన ప్రసంగమిది. మహిళలకు భద్రతపై చర్చాకార్యక్రమాన్ని మేం గౌరవిస్తున్నాం. మహిళా దినోత్సవ కాల విలువకు గుర్తించాం. ఈ అంశంపైనే మనం దృష్టిసారిద్దాం. అసందర్భంగా పాక్ విదేశాంగ మంత్రి చేసిన వ్యాఖ్యలపై కనీసం స్పందించాల్సిన అగత్యం భారత్‌కు లేదు. గతంలో చెప్పాం. ఇప్పుడూ, ఇకమీదటా చెప్పేది ఒక్కటే. కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు భారత్‌లో అంతర్భాగమే. దాయాదిదేశం పాక్‌తో పొరుగుదేశ సంబంధాలను సాధారణస్థాయిలో కొనసాగించాలని భారత్ మొదట్నుంచీ ఆశిస్తోంది. అలాంటి వాతావరణం నెలకొనేలా చూడాల్సిన బాధ్యత పాక్‌పై ఉంది. కానీ ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారి శత్రుత్వాన్ని పెంచుకుంటోంది' అని రుచిరా ఘాటుగా వ్యాఖ్యానించారు. పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ బలగాలపై దారుణ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లోని బాలాకోట్‌లో కొనసాగుతున్న జైషే మొహమ్మద్ ఉగ్ర శిబిరంపై భారత వాయుసేన మెరుపుదాడి తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. జమ్మూకశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతాలుగా విడదీశాక భారత్‌పై పాక్ ఆక్రోశం మరింతగా ఎగసింది.

ఫారిన్ ఏజెంట్ బిల్లుపై రణరంగంగా జార్జియా

తిబ్లిస్: జార్జియా ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఒక బిల్లు రణరంగానికి దారితీసింది. ఆ బిల్లుని వ్యతిరేకిస్తూ నిరసనకారులు రాజధాని తిబ్లిస్‌లోని పార్లమెంటు భవనాన్ని ముట్టడించారు. నిరసనకారుల్ని అడ్డుకోవడానికి పోలీసులు వాటర్ కెనాన్లు ప్రయోగించడంతో పరిస్థితులు అదుపు తప్పాయి. పోలీసులకు, నిరసనకారులకి మధ్య జరిగిన ఘర్షణలో 50 మందికి పైగా పోలీసులు గాయపడ్డారు. ప్రతిపక్ష నాయకుడు జురాబ్ జపారిడ్జ్ సహా 66 మందిని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. జురాబ్‌ను బాగా కొట్టినట్టుగా కూడా వార్తలు వెలువడ్డాయి. జార్జియా ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుపై స్వదేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. దీని ప్రకారం 20 శాతానికి పైగా విదేశీ నిధులు కలిగిన స్వచ్ఛంద సంస్థలు, మీడియా సంస్థలు తమని తాము విదేశీ ఏజెంట్లుగా ప్రకటించుకోవాల్సి ఉంటుంది. అలా ప్రకటించుకోకపోతే జైలు శిక్షతో పాటుగా భారీగా జరిమానాలు విధిస్తారు.

సంయుక్త నిసార్ ఇస్రో చేతికి

బెంగళూరు: అమెరికాకు చెందిన నాసా, భారత్‌కు చెందిన ఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేసిన నిసార్ ఉపగ్రహం ఇస్రో చెంతకు చేరింది. నాసా–ఇస్రో సింథటిక్ అపర్చర్ రాడార్(నిసార్)ను అమెరికాలోని కాలిఫోర్నియాలో తయారుచేయగా ఆ దేశ వాయుసేనకు చెందిన సీ–17 విమానం దానిని బెంగళూరుకు తీసుకొచ్చింది. ' నిసార్ భారత్‌కు బుధవారం వచ్చేసింది. ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ తుది ఇంటిగ్రేషన్ మొదలైంది' అని చెన్నైలోని అమెరికా కాన్సులేట్ జనరల్ బుధవారం ట్వీట్ చేసింది. వ్యవసాయ సంబంధ మ్యాపింగ్, కొండచరియలు విరిగే ప్రమాదమున్న ప్రాంతాల గుర్తింపు తదితరాల కోసం నిసార్‌ను వినియోగించనుంది. ఏపీలోని సతీశ్ ధవన్ అంతరిక్ష ప్రయోగం కేంద్రం నుంచి వచ్చే ఏడాదిలో ఈ ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగించనుంది.

పూర్తిగా మహిళా సిబ్బందితో 90 విమాన సర్వీసులు

న్యూఢిల్లీ: ఆకాశంలో సగం అనే నారీశక్తి నినాదానికి మరింత మద్దతు పలికింది ఎయిర్‌ఇండియా. మార్చి ఒకటోతేదీ నుంచి 90 జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను పూర్తి మహిళా సిబ్బందితోనే నడిపింది! బుధవారం సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. తమ మొత్తం 1,825 మంది పైలెట్లలో 15 శాతం మంది అంటే 275 మంది పైలెట్లు మహిళలేనని పేర్కొంది. ఎయిర్‌ఇండియా మొత్తం సిబ్బందిలో 40 శాతానికిపైగా నారీమణులే ఉండటం విశేషం. కాక్‌పిట్ క్రూలో 15 శాతం అతివలే. 'ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ మంది కమర్షియల్ ఉమెన్ పైలెట్లు ఉన్న దేశం భారత్' అని ఎయిర్ ఇండియా సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ క్యాంప్‌బెల్ విల్సన్ చెప్పారు. ' వైమానిక రంగ సంబంధ వృత్తులను ఎంచుకుంటున్న భారతీయ మహిళల సంఖ్య పెరుగుతోంది. అందుకే ఈ రంగంలో లింగ సమానత్వాన్ని సాధించగలిగే అవకాశం వచ్చింది' అని ఆయన అన్నారు.




ఢిల్లీలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ నివాసంలో ఆయనతో పాటు హోలీ సంబరాల్లో పాల్గొన్న విదేశాంగ మంత్రి జైశంకర్, అమెరికా వాణిజ్య మంత్రి గినా రైమాండో



బుధవారం అహ్మదాబాద్‌లో అంబరాన్నంటిన హోలీ వేడుకలు

రోజంతా కేజ్రీవాల్ ధ్యానం

గాంధీ విగ్రహం వద్ద నివాళులు



న్యూఢిల్లీ: దేశాభ్యున్నతి కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బుధవారం రోజంతా ధ్యానం, పూజలు, ప్రార్థనలు చేశారు. అవి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం దాకా కొనసాగినట్టు ఆప్ ట్వీట్ చేసింది. అంతకుముందు ఉదయం ఢిల్లీలో రాజ్‌ఘాట్ వద్ద మహాత్మాగాంధీ సమాధిని కేజ్రీవాల్ సందర్శించి నివాళులర్పించారు. హోలీ సందర్భంగా దేశం కోసం ప్రార్థనలు చేస్తానని కేజ్రీవాల్ మంగళవారమే పేర్కొన్నారు. దేశం కోసం మంచి పనులు చేస్తున్న వారిని జైళ్లపాలు చేస్తున్నారని, దోచుకుంటున్న వారిని మాత్రం వదిలేస్తున్నారని ఆరోపించారు.

వేడుకగా అగ్నిగుండ మహోత్సవం



సేలం: ఈరోడ్ నగరంలోని కల్లుకుడై ప్రాంతంలో కొలువున్న భద్రకాళియమ్మన్ ఆలయంలో బుధవారం అగ్నిగుండ మహోత్సవం వైభవంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

న్యూస్‌రీల్

వీరరాఘవుడి ఆలయానికి కుశస్థలి నది నీరు



ఆలయ పుష్కరిణికి వస్తున్న కుశస్థలి నీరు

తిరువళ్లూరు: పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వైద్య వీరరాఘవుడి ఆలయ పుష్కరిణి నింపడానికి కుశస్థలి నది నీరు అందుబాటులోకి వచ్చింది. రూ.25 కోట్లు వ్యయంతో చేపట్టిన ఈ పైప్ లైన్ పనులు పూర్తి కావడంతో అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ పుష్కరిణిలో సుమారు 0.50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చు. ఇక్కడ ఆలయానికి వచ్చే భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించడంతో పాటు బెల్లం, పాలు వేసి మొక్కులు చెల్లిస్తే రోగాలు నయం అవుతుందన్న నమ్ముతారు. అయితే ఆలయ పుష్కరిణి తరచూ ఎండిపోవడంతో పట్రపెరంబదూరు వద్ద ఉన్న కుశస్థలి ఆనకట్ట నుంచి నీటిని తెప్పించి పుష్కరిణిని నింపాలని నిర్ణయించారు. ఇందు కోసం ప్రభుత్వం రూ.25 కోట్లు కేటాయించడంతో 8 సంవత్సరాల క్రితం పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. పట్రపెరంబదూరు ఆనకట్ట నుంచి 11 కిలోమీటర్ల దూరం మేరకు పైపులు అమర్చే పనులు ఇటీవల పూర్తయింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ట్రయల్ నిర్వహించారు. ఎక్కడా లీకేజీ లేకపోవడంతో త్వరలోనే ఈ పథకాన్ని ప్రారంభించి పుష్కరిణిని పూర్తిగా నింపుతామని అధికారులు వెల్లడించారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం



ఉర్దూ పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కదీర్ ఆనంద్

వేలూరు: డీఎంకే ప్రభుత్వంలోనే విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎంపీ కదీర్ ఆనంద్ తెలిపారు. వేలూరు జిల్లా కాట్పాడి నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ. 47 లక్షల వ్యయంతో విరుదంబట్టులో నిర్మించిన ఉర్దూ పాఠశాల భవనాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని భాషలు, మతాలు సమానం అనే భావనతో తమిళనాడులోని కాట్పాడి నియోజక వర్గంలో ఉర్దూ పాఠశాలను ప్రారంభించి ముస్లిం ప్రజల చిరకాల కోరికను నెరవేర్చడం జరిగిందన్నారు. కేంద్రీయ విద్యాలయ పాఠశాలను ప్రారంభించడానికి కలెక్టర్ స్థలాన్ని ఎంపిక చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించలేదని ఆరోపించారు. రానున్న బడ్జెట్ సమావేశంలో అధిక నిధులపై డిమాండ్ చేస్తామన్నారు. పెరుముగైలో బ్రిడ్జి పనులు, తిరుపత్తూరు జిల్లా ఆంబూరులోని బెత్‌లేగేమ్ నుంచి ఓఆర్ఆర్ థియేటర్ వరకు 900 మీటర్ల వరకు బ్రిడ్జి నిర్మాణం శరవేగంగా సాగుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసి నిధులు కేటాయించిన వెంటనే కాంగనెల్లూరు బ్రహ్మపురం బ్రిడ్జి నిర్మాణ పనుల గురించి తమ తండ్రి దురై మురుగన్ ప్రకటిస్తారన్నారు. ఆయనతో పాటు కార్పొరేటర్ నిత్యకుమార్, డీఎంకే పట్టణ కార్యదర్శి దేవనేశన్, డీఎంకే ప్రతినిధులు వన్నియరాజ, పరమశివం, కార్యకర్తలు పాల్గొన్నారు.

లారీ ఢీకొని నవ వధువు మృతి

అన్నానగర్: చెన్నైలోని ఎన్నూర్ తిలాగర్ నగర్‌కు చెందిన సిలువైమేరి (26) అంబత్తూరులోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగిగా పనిచేస్తోంది. ఈమెకు గత నెల 6న వివాహం జరిగింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి స్కూటీపై పని ముగించుకుని ఇంటికి బయలుదేరింది. మనలి ఎక్స్‌ప్రెస్ వే వెనుక వైపు.. సత్యమూర్తి సమీపంలో ఆమె స్కూటీని కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సిలువమేరి అక్కడికక్కడే మృతి చెందింది. లారీ డ్రైవర్ పరారయ్యాడు. మాధవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సీఎం స్టాలిన్‌తో మహిళా పోలీసులు, ఉన్నతాధికారులు



అన్నాడీఎంకే నేతృత్వంలో నిర్వహించిన వేడుకల్లో పళని స్వామి

మహిళా సాధికారతే ధ్యేయం

మహిళా సాధికారతే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు తెలిపారు. స్త్రీలు, పురుషులు అనే వివక్ష లేకుండా అందరూ సమానమే అన్న భావన ప్రతి ఒక్కరిలోనూ రావాలని ఆకాంక్షించారు. దేశంలోనే అబలకు అత్యంత సురక్షిత రాష్ట్రంగా తమిళనాడు ఉందని ఉమెన్స్ డే వేడుకల్లో వెల్లడించారు.

- రాష్ట్ర ప్రగతిలో అతివలకు సముచిత స్థానం
- ఉన్నత విద్యలో మరింత ప్రోత్సాహం
- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో సీఎం స్టాలిన్ వెల్లడి
- వాడవాడలా ఘనంగా వేడుకలు



అవార్డులను ప్రదానం చేస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ మహిళల గొప్పతనాన్ని తెలియజేసేలా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఉదయాన్నే చెన్నై మెరీనా తీరంలోని అవ్వయార్ విగ్రహానికి మంత్రులు గీతా జీవన్, వెల్లకోవిల్ స్వామినాథన్ నివాళులర్పించారు. ఉత్తర చెన్నైలో జరిగిన కార్యక్రమానికి సినీ నటి రాధిక హాజరై తాను దివంగత సీఎం కరుణానిధికి ముద్దుబిడ్డగా ఈ వేడుకకు హాజరైనట్లు పేర్కొన్నారు. పుదుచ్చేరి సముద్ర తీరంలో వివిధ రకాల బెలూన్లను ఎగుర వేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలో..

చెన్నై ఎతిరాజ్ కళాశాలలో ఉమెన్స్ డే వేడుకలు రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలో కోలాహలంగా సాగింది. ఇందులో సీఎం స్టాలిన్ పాల్గొని విశిష్ట సేవలను అందించిన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ, ఈ శుభవేళ మహిళా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా తరలి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలు, మంత్రులు, మేయర్లుగా ఇక్కడున్న మహిళా ప్రతినిధులను చూస్తుంటే, దేశాభివృద్ధి మహిళల చేతుల్లోనే ఉన్న విషయం స్పష్టం కాక తప్పదన్నారు.

అవార్డుల ప్రదానం..

సామాజిక అంశాల్లో ఉత్తమ సేవలందించిన మహిళలకు అవ్వయ్యార్ అవార్డులను ప్రదానం చేస్తామని సీఎం ప్రకటించారు. 2023 సంవత్సరానికి గాను సాహిత్య రంగంలో ఈ అవార్డును ఆర్. కమలం చిన్నస్వామికి ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. తమిళనాడులో సంగం కాలం నుంచి స్త్రీల పాత్ర కీలకంగా ఉన్నట్లు వివరించారు. దాన్ని ప్రాతిపదికగా తీసుకుని ప్రస్తుత రాజకీయాల్లో మహిళ సంఖ్య పెరగాలని పిలుపునిచ్చారు.

అతివలకు అగ్రస్థానం..

డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడల్లా రాష్ట్రంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా పలు అంశాలలో పెద్దపీట వేసినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ వివరించారు. ఆస్తిలో సమాన హక్కు, ప్రభుత్వ ఉద్యోగాల్లో 40 శాతం కోట, స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్, పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, అణగారిన వర్గాల బాలికలకు కళాశాల స్థాయి వరకు ఉచిత విద్య, 1 నుంచి 5వ తరగతి వరకు పాఠశాల ప్రాధానోపాధ్యాయులుగా మహిళలకు ప్రాధాన్యత కల్పించిందని తమ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. డాక్టర్ ముత్తులక్ష్మి స్మారక ప్రసూతి సహాయ పథకం, మువలూరు రామామృతం స్మారక వివాహ సహాయ పథకం అంటూ మహిళల అభ్యున్నతి కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామని ప్రకటించారు. ఉన్నత విద్యలో మరింత ప్రాధాన్యం, మహిళా సాధికారత కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నామని వివరించారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళలకు సముచిత స్థానం కల్పించామన్నారు. స్వయం సహాయక బృందాలకు మరింత ప్రోత్సహకాలను అందిస్తామన్నారు. మహిళలను అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లే విధంగా ద్రవిడ మోడల్‌లో ఎన్నో అంశాలు పొందు పరిచామని వివరించారు. చట్టం ముందు వివక్ష లేకుండా స్త్రీ, పురుషులందరు సమానమే అని చాటే విధంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తమిళనాడు మహిళలకు సురక్షితమైన రాష్ట్రంగా మారిందని, ఇటీవల ఉత్తరాదికి చెందిన ఓ మహిళ భద్రత కోసం ఇక్కడి కోర్టును ఆశ్రయించినట్లు కూడా ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో మంత్రులు కయల్విలి సెల్వరాజ్, పొన్ముడి, శేఖర్‌బాబు, మేయర్ ప్రియ, ఎంపి దయానిధి మారన్ పాల్గొన్నారు.

అన్నాడీఎంకే నేతృత్వంలో..

అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి ఎడపాడి కె. పళని స్వామి నేతృత్వంలో రాయపేటలోని కల్యాణ మండపంలో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. 50 కేజీల కేక్‌ను ఆయన కట్ చేసి మహిళలకు పంపిణీ చేశారు. అలాగే, మహిళలకు సంక్షేమ పథకాలను అందజేశారు. ఈ సందర్భంగా పళని స్వామి ప్రసంగిస్తూ, దివంగత నేత ఎంజీఆర్, జయలలిత మహిళాభ్యున్నతిని కాంక్షిస్తూ అనేక పథకాలను తీసుకొచ్చారని వివరించారు. ప్రస్తుతం ఆ పథకాలను డీఎంకే ప్రభుత్వం తుంగలో తొక్కిందని మండిపడ్డారు.

మహిళా పోలీసులకు కానుకలు..

అంతకుముందు సీఎం స్టాలిన్‌ను ఆయన నివాసంలో మహిళా పోలీసులు కలిశారు. సీఎం సెక్యూరిటీ వింగ్‌లోని వీరందరికీ స్టాలిన్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, మొక్కలను అందజేశారు. అనంతరం అన్నాసాలైలోని మహిళ పోలీసు స్టేషన్‌కు ముఖ్యమంత్రి వెళ్లారు. అక్కడున్న వారందరికీ కానుకలను పంపిణీ చేశారు. ఈ కార్యకమంలో డీజీపీ శైలేంద్ర బాబు, కమిషనర్ శంకర్‌జివ్వాల్ పాల్గొన్నారు. అలాగే రాణిపేట జిల్లా అరక్కోణానికి చెందిన వెంకటేషన్ తన ముగ్గురు కుమార్తెలు ప్రీతి, వైష్ణవి, రంజనిని పోలీసు ఉద్యోగాల్లో చేర్చారు. దీంతో వెంకటేషన్‌కు కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేస్తూ సీఎం ఫోన్లో మాట్లాడారు. శిక్షణలో ఉన్న కుమార్తెలకు తన తరపున మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయాలని వెంకటేషన్‌కు సీఎం సూచించారు.



మెరీనా తీరంలో అవ్వయార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు

మాటల యుద్ధం!

మిత్రపక్షాలైన బీజేపీ – అన్నాడీఎంకే మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతోంది. అన్నాడీఎంకే నేతలను టార్గెట్ చేసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై విరుచుకుపడ్డారు. తనను ఏకంగా మాజీ సీఎం జయలలితతో సమానంగా పోల్చుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో ఆయనపై బుధవారం అన్నాడీఎంకే సీనియర్ నేత జయకుమార్ ఎదురు దాడికి దిగారు. అదే సమయంలో బీజేపీ ఐటీ వింగ్ నుంచి అన్నాడీఎంకేలోకి మరింతగా వలసలు పెరగడం గమనార్హం.

- బీజేపీ – అన్నాడీఎంకే మధ్య ముదిరిన వివాదం
- అన్నామలైపై ఎదురు దాడి చేసిన జయకుమార్



జయకుమార్, అన్నామలై (ఫైల్)

సాక్షి, చెన్నై: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళని స్వామి శిబిరాలు ప్రస్తుతం ఉప్పు– నిప్పును తలపిస్తున్నాయి. భారతీయ జనతా పార్టీ నుంచి అన్నాడీఎంకేలో చేరికలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఆ పార్టీ ఐటీ విభాగానికి చెందిన మరో నలుగురు నేతలు, తూత్తుకుడికి చెందిన పలువురు బీజేపీ మహిళా నేతలు బుధవారం పళనిస్వామి వర్గంలోకి వెళ్లారు. ఈ పరిణామాల నేపథ్యంలో అన్నాడీఎంకే తీరుపై అన్నామలై విరుచుకు పడ్డారు. ఇదేనా రాజకీయ నైతికత అని విమర్శలు గుప్పించారు. అదే సమయంలో తనను జయలలితకు సమాన రాజకీయ నేతగా అభివర్ణించుకున్నారు. నిన్న కాకుండా మొన్న రాజకీయాల్లోకి వచ్చి జయలలితతో సమాన రాజకీయ నాయకుడిగా తనను అన్నామలై ప్రచారం చేసుకోవడాన్ని పళని స్వామి శిబిరం తీవ్రంగా పరిగణించింది. అన్నామలైను టార్గెట్ చేసి అన్నాడీఎంకే ఐటీ విభాగం కొన్ని వీడియోలను విడుదల చేసింది. దోశలు కాల్చే విధంగా నటిస్తూ, తానేదో గొప్ప అని చాటుకునే విధంగా అన్నామలై వ్యవహరిస్తున్నట్లుగా ఆ వీడియోల్లో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అదే సమయంలో అన్నామలై తీరుపై పళనిస్వామి తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు సంకేతాలు వెలువడ్డాయి. బుధవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో పళని స్వామి ఈ వ్యవహారంపై చర్చించినట్లు తెలిసింది. గురువారం జరిగే జిల్లాల కార్యదర్శుల సమావేశంలో అన్నామలైకు చెక్ పెట్టే విధంగా బీజేపీ అధిష్టానానికి సంకేతాన్ని ఇచ్చే నిర్ణయాన్ని తీసుకునేందుకు సిద్ధమయ్యారు.

హాస్యాస్పదం..

ఈ సమావేశానంతరం అన్నాడీఎంకే సీనియర్ నేత జయకుమార్ మీడియాతో మాట్లాడుతూ, ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి నాయకులు వచ్చి చేరడం సర్వసాధారణమని, అంతమాత్రాన అన్నామలై విమర్శలు గుప్పించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయనకు రాజకీయాలు తెలియనట్లుందని అన్నారు. జయలలితతో సమానంగా తనను తాను ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జయలలిత ఎక్కడ, అన్నామలై ఎక్కడ అని విమర్శిస్తూ, సెంజి కోటకు వెళ్లినంత మాత్రాన రాజుకాలేడని, మీసాలు తిప్పినంత మాత్రాన కట్టబొమ్మన్ కాలేడని మండి పడ్డారు. రాళ్లను విసిరితే.. పగిలిపోయేందుకు అన్నాడీఎంకే అద్దాల భవనం కాదని ఎద్దేవా చేశారు. అన్నాడీఎంకే మహా సముద్రం అని, అందులో వేసే రాళ్లన్నీ కనిపించకుండా పోతాయన్న విషయాన్ని అన్నామలై గుర్తుంచుకుంటే మంచిదని హితవు పలికారు.

ఇక పన్నీరు సెల్వం శిబిరానికి చెందిన వైద్యలింగం తనను విమర్శిస్తూ కొన్ని వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. తాను ముఖ్యమంత్రి పదవిని ఆశించడంతోనే స్పీకర్ పదవి నుంచి తనను అమ్మ జయలలిత తప్పించినట్లు ఆరోపణలు గుప్పించడం తగదన్నారు. తనను ఆమె నిజంగానే పదవి నుంచి తప్పించి ఉంటే 2016 ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యే సీటు, తన కుమారుడు జయవర్ధన్‌కు ఎంపీ సీటు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఆధార రహిత ఆరోపణలను తన మీద పార్టీ మీద చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, అన్నామలై వ్యాఖ్యలను సమర్థించే విధంగా ఆ పార్టీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ స్పందించారు. జయలలిత భావాలకు అనుగుణంగా.. తానూ వెళ్తున్నట్లు అన్నామలై చెప్పారని.. సమర్థించే ప్రయత్నం చేశారు.

రూ.2 లక్షల కోట్లు దోచేశారు

– అన్నామలై తీవ్ర ఆరోపణలు

సాక్షి, చెన్నై : అధికారంలోకి వచ్చిన 2 ఏళ్ల కాలంలో రూ.2 లక్షల కోట్లను డీఎంకే పాలకులు దోచేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరోపించారు. ఏప్రిల్ 14న అవినీతి మంత్రుల జాబితాను ఆన్‌లైన్‌లో ప్రకటిస్తానని తెలిపారు. బుధవారం మదురైలో అన్నామలై మీడియాతో మాట్లాడుతూ, బీజేపీని ఉద్దేశించి 420 అని మంత్రి ఉదయ నిధి స్టాలిన్ వ్యాఖ్యలు చేయడం శోచనీయమని విమర్శించారు. ఉదయ నిధి అస్సలు నాయకుడేనా, ఆయనకు ఉన్న అర్హత ఏమిటి, విద్యార్హత ఏమిటి, ఏం కష్ట పడ్డారు..? ఆయనకు ఉన్న రాజకీయ అనుభవం ఎంత అని ప్రశ్నించారు. చేపాక్కం ట్రిప్లికేన్ నియోజకవర్గం డీఎంకే కోట అని అక్కడ ఎవరు నిలబడ్డా గెలవడం ఖాయం అని స్పష్టం చేశారు. ఆ నియోజకవర్గం నిలబడి గెలవడం కూడా ఒక గెలుపేనా అని ఎద్దేవ చేశారు. అధికారంలోకి వచ్చిన 2 ఏళ్లలో రూ.2 లక్షల కోట్లను డీఎంకే పాలకులు దోచేశారని, ఈ అవినీతి జాబితాను ఏప్రిల్ 14న ఆన్‌లైన్‌లో విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ఎక్కడెక్కడ ఎంత ఆస్తులు, కూడబెట్టారో, షాపింగ్ మాల్స్‌ను కొన్నారో వంటి అన్ని వివరాలనూ బహిర్గతం చేస్తామన్నారు.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

ప్రేమానురాగాలను పంచే హోలీ పండుగను బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. చెన్నై నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో నివసిస్తున్న ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ, రాజస్థాన్, బిహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, గుజరాత్, అస్సాం వాసులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నై పులల్, సావుకార్‌పేట, త్యాగరాయనగర్, పట్టాళంలో కోలాహలం నెలకొంది. ఇక చెన్నై పులల్ ప్రాంతంలో సిల్వర్ స్కై సమర్పణలో రంగీలా ఈవెంట్స్ ఆధ్వర్యంలో హోలీ -2023 పేరిట ప్రత్యేక వేడుకలను నిర్వహించారు. ఇందులో సినీ నటి అర్చనా సింగ్, యాంకర్ విజే ప్రతోష్, లైఫ్ కోచ్ డాక్టర్ ఆల్ ఫ్రెడ్ జోషీ అతిథులుగా పాల్గొని అందరితో కలిసి రెయిన్ డ్యాన్స్ చేసి, పాటలతో హోరెత్తించారు. పర్యావరణ హితమైన రంగులను చల్లుతూ హోలీ శుభాకాంక్షలు చెప్పుకుంటూ యువతీ యువకులు ఆనందాన్ని పంచుకున్నారు. - కొరుక్కుపేట



వేడుకల్లో సినీ తారలు



హోలీ పండుగలో యువతుల కేరింతలు







సేలం : నామక్కల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ నేతృత్వంలో..

ఇన్‌ఫ్లూయెంజా విజృంభణ

- రోజుకు సగటున వెయ్యి కేసులు నమోదు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ సూచన



సాక్షి, చెన్నై: చెన్నై నగరం, శివారు జిల్లాల్లో హెచ్3 ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా కేసులు రోజురోజుకూ అధికమౌతున్నాయి. గత కొన్ని రోజులుగా రోజుకు సగటున వెయ్యికి పైగా ఈ జ్వర పీడితులు ఆసుపత్రుల్లో చేరారు. ఈ వైరస్ మరింత విజృంభించే అవకాశాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలనే హెచ్చరికలు జారీ అయ్యాయి. వివరాలు.. వాతావరణ మార్పుల నేపథ్యంలో గత కొద్ది రోజులుగా చెన్నై శివారుల్లో విష జ్వరాలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇది హెచ్3ఎన్2 వైరస్‌గా పరిశోధనల్లో తేలింది. కరోనా లక్షణాలతో కూడిన ఈ వైరస్ ప్రస్తుతం చెన్నై శివారు జిల్లాలో విజృంభిస్తోంది. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి, తుమ్ములు, శ్వాసకోశ సమస్యలతో బాధ పడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేటు క్లీనిక్‌లకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. గత రెండు రోజులుగా అయితే, రోజుకు వెయ్యికి పైగా ప్రజలు ఈ జ్వరాలతో ఆసుపత్రులకు వస్తున్నట్లు తేలింది. పిల్లలను సైతం ఈ వైరస్ తాకింది. చెన్నైలో ఎగ్మూర్ చిన్న పిల్లల ప్రభుత్వ ఆసుపత్రికి 20 మంది మేరకు ఇన్‌పేషంట్లుగా అడ్మిట్ అవుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, జన సంచార ప్రాంతాల్లోకి పిల్లలను తీసుకు రావద్దు అని, పెద్దలు మాస్క్ ధరించినప్పుడే వైరస్ బారి నుంచి బయట పడగలరని ఆరోగ్య శాఖ వర్గాలు హెచ్చరించాయి. ఈ వైరస్ బారిన పడ్డ వారు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటే, వారంలోపు కోలుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో ఆయా ప్రాంతాలలో ఈనెల 10వ తేదీన మొబైల్ వైద్య శిబిరాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

రూ.80 లక్షల వ్యయంతో పూండిలో పార్క్‌ల అభివృద్ధి



తిరువళ్లూరు: పర్యాటక కేంద్రమైన పూండిలోని పార్క్‌లను రూ.80 లక్షల వ్యయంతో అభివృద్ధి చేశారు. కాగా వీటిని త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు అధికారులు వెల్లడించారు. తిరువళ్లూరు జిల్లా పూండిలో చెన్నై ప్రజలకు తాగునీటిని అందించే సత్యమూర్తి సాగర్ రిజర్వాయర్ ఉంది. అలాగే ఇక్కడి గుడియం గుహల్లో 1200 సంవత్సరాల క్రితం మానవులు జీవించినట్లు ఆధారాలు లభించాయి. తిరువళ్లూరు జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టిన సమయంలో దొరికిన పురాతన వస్తువులను పూండీలో వుంచి పురావత్తుశాఖ ఆధ్వర్యంలో మ్యూజియం ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడికి నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తున్నారు. అయితే పూండిలో పర్యాటకులను ఆకర్షించడానికి సరైన సదుపాయాలు లేకపోవడంతో పార్క్‌లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. తర్వాత రూ.80 లక్షలను కేటాయించి పనులను చేపట్టారు. వీటిని త్వరలోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

కలెక్టర్‌కు ఉత్తమ సేవ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: బాలికల విద్య, భద్రత విషయంలో ఉత్తమ పనితీరును కనబరిచిన తిరువళ్లూరు కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు సీఎం స్టాలిన్ చేతుల మీదుగా బుధవారం ఉదయం అవార్డును అందజేశారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా వెట్టిచాకిరి, బాల్య వివాహాలు, మహిళల భద్రత తదితర వాటిని సవాలుగా స్వీకరించిన జిల్లా యంత్రాంగం కఠినంగా చట్టాలను అమలు చేసింది. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి పని చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఉత్తమ సేవ అవార్డుకు ఎంపికయ్యారు. ఇందులో భాగంగానే చెన్నైలో జరిగిన అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు అవార్డును ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, శేఖర్ బాబు, గీతజీవన్, ఎగ్మోర్ ఎమ్మెల్యే పరందామన్, మేయర్ ప్రియ పాల్గొన్నారు.

వాడవాడలా.. మహిళా దినోత్సవం



వండర్ ఉమెన్ ఐకాన్ అవార్డులు అందిస్తున్న కమిషనర్ నందకుమార్



మహిళా పోలీసులు, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న డీఐజీ ముత్తుస్వామి

కొరుక్కుపేట: చెన్నై నగరంలోని తెలుగు లోగిళ్లలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. నమో గాడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. విల్లివాక్కంలోని ఎస్‌కేడీటీ పాఠశాలలో ఉచిత బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏఐటీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ సీఎంకేరెడ్డి పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభిచారు. ప్రత్యేక అతిథులుగా పాల్గొన్న సమాజ సేవకులు లయన్ డాక్టర్ రజిని, చిత్ర అరవింద్‌ను నమో గాడ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సీఎం కిషోర్, ట్రస్టీలు ఆర్.నందగోపాల్, డాక్టర్ ఎస్. నాగభూషణం కలసి సత్కరించారు.

శ్రీ కన్యకాపరమేశ్వరి కళాశాలలో: శ్రీ కన్యకా పరమేశ్వరీ మహిళా కళాశాలలో నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా రేలా హాస్పిటల్ మెడికల్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డాక్టర్ గోమతి నరసింహన్ పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశాను. ఈ వేడుకల్లో కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరు శరత్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ టి. మోహన శ్రీ పాల్గొన్నారు. నక్షత్రా స్టూడెంట్ కౌన్సిల్ ముగింపు సమావేశం, విద్యార్థినులు ఎగ్జిబిషన్, స్కాలర్‌షిప్‌లు, స్పెషల్ అవార్డులతో సత్కరించారు.

వండర్ ఉమెన్ ఐకాన్ అవార్డులు ప్రదానం: మహిళా దినోత్సవం సందర్భంగా చెన్నై నగరంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న 15 మంది ప్రముఖ మహిళలకు వండర్ ఉమెన్ ఐకాన్ అవార్డులను ప్రదానం చేశారు. స్వచ్ఛంద సంస్థ జియో ఇండియా ఫౌండేషన్ తరపున ముఖ్యఅతిథిగా పాల్గొన్న భారతప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖ రెవెన్యూ విభాగం ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ వి. నందకుమార్ పాల్గొని అవార్డులను ప్రదానం చేశారు. పౌండేషన్ వ్యవస్థాపకులు ప్రియా జెమిమా తదితరులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థినిలతో అతిథులు, నిర్వాహకులు

వేలూరు: మహిళా పోలీసుల శ్రమ సాటిలేనిదని డీఐజీ ముత్తుస్వామి తెలిపారు. వేలూరు సత్‌వచ్చారిలోని ప్రైవేటు కల్యాణ మండపంలో పోలీసు విభాగంలో పని చేస్తున్న మహిళా పోలీసుతో కలిసి జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీఐజీ ముత్తుస్వామి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బిడ్డల అభివృద్ధిలో స్త్రీల శ్రమ సాటి లేదన్నారు. అనంతరం మహిళా పోలీసులు నృత్యం చేసి అలరింప జేశారు. ఎస్పీ రాజేష్ కన్నన్, అదనపు ఎస్పీ శేఖర్, డీఎస్పీ మనోహరన్ పాల్గొన్నారు.

తిరువళ్లూరు: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలని తిరువళ్లూరు కోర్టు న్యాయమూర్తి శాండిల్యన్ సూచించారు. తిరువళ్లూరు జిల్లా పూండి బీడీఓ కార్యాలయంలో అంతర్జాయతీయ మహిళ దినోత్సవ వేడుకలను ఐఆర్‌సీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి తేన్‌మొళి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా తిరువళ్లూరు కోర్టు న్యాయమూర్తి శాండిల్యన్ హాజరై ప్రసంగించారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు వాటి ద్వారా ఆర్థిక పురోగతి సాధించాలని పిలుపు నిచ్చారు. ఐఆర్‌సీడీఎస్ నిర్వాహకుడు స్టీఫెన్, యూనియన్ వైస్ చైర్మన్ మహాలక్ష్మిమోతీలాల్, పంచాయతీ అధ్యక్షురాలు చిత్రరమేష్ పాల్గొన్నారు.

తిరుత్తణి: తిరుత్తణి పోలీస్ స్టేషన్‌లో మహిళా దినోత్సవం బుధవారం కోలాహలంగా నిర్వహించారు. తిరుత్తణిలోని ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో ఎస్‌ఐ రాఖీకుమారి ఆధ్వర్యంలో బాలికలకు పుష్పాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ విఘ్నేష్, సీఐ ఏలుమలై సమక్షంలో మహిళా పోలీసులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.



వేడుకలు నిర్వహిస్తున్న తిరుత్తణి మహిళా పోలీసులు



తిరువళ్లూరు: మహిళలకు ట్యాబ్‌లను అందజేస్తున్న న్యాయమూర్తి శాండిల్యన్



నమో గాడ్ చారిటబుల్ ట్రస్ట్ తరపున వేడుకల్లో సీఎంకే రెడ్డి, కిషోర్



సేలంలో కేక్ కట్ చేస్తున్న జిల్లా పోలీసు కమిషనర్ విజయకుమారి

వార్షికోత్సవం



ఎస్‌ఆర్‌ఎం నైటింగ్ గేట్ స్కూల్ 55వ వార్షికోత్సవం బుధవారం రామాపురంలో ఘనంగా జరిగింది. ఇందులో చెన్నైలోని థాయ్ కాన్సులేట్ జనరల్ నీతిరూగే ఫోన్‌ప్రసెర్ట్, ప్రముఖ వ్యాఖ్యత మణి కండన్, ఎస్‌ఆర్‌ఎం గ్రూప్ చీఫ్ డైరెక్టర్ ఎస్‌నిరంజన్, డీన్ డాక్టర్ సుందర్‌లు పాల్గొని విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. - సాక్షి, చెన్నై

అవగాహన



ఎంజీఎం హెల్త్ కేర్ నేతృత్వంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన ప్రచార కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. హీలింగ్ టు ఎంపవర్ పేరిట జరిగే ఈ అవగాహనకు 32 మంది విద్యార్థినులను ఎంపిక చేశారు. వీరిని ఆ హెల్త్ కేర్ సీఈఓ హరీష్ మణియన్, గైన కాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ జయ శ్రీ గజరాజ్, లక్ష్మీ అశ్వత్థామన్, నివేదా భారతి పరిచయం చేశారు. - సాక్షి, చెన్నై

శిశు రక్షణకు రన్



శిశు మరణాల కట్టడి, సంరక్షణ, ప్రోత్సాహంపై అవగాహన కల్పించే విధంగా బుధవారం ది ప్యూపిల్, సవీత ఎకో స్కూల్ సంయుక్తంగా 5 కి.మీ దూరం సేవ్ ఏ చైల్డ్ నినాదంతో చెన్నై శివారులో రన్ నిర్వహించారు. 1200 మంది పిల్లలు, బాలికలు పాల్గొన్న ఈ రన్‌ను డబ్ల్యూ హెచ్‌ఓ మాజీ చీఫ్ శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య స్వామినాథన్, తిరువళ్లూరు కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీస్, ఆ విద్యా సంస్థ చాన్స్‌లర్ ఎన్‌ఎం వీరయ్యన్ జెండా ఊపి ప్రారంభించారు. - సాక్షి, చెన్నై

లాల్ సలామ్‌కు శ్రీకారం..!



లాల్ సలామ్ చిత్ర ప్రారంభోత్సవంలో యూనిట్ సభ్యులు

తమిళసినిమా: లాల్ సలామ్ ఈ పదానికే ఓ పవర్ ఉంది. అయితే ఇది చిత్ర టైటిల్‌గా మారడం, ఇందులో సూపర్‌స్టార్ రజనీకాంత్ అతిథిగా నటించనుండడంతో లాల్ సలామ్‌కు మరింత శక్తి వచ్చింది. వివరాల్లోకి వెళ్లితే రజనీకాంత్ పెద్ద కూతురు ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం ఇది. ఈమె ఇంతకు ముందు ధనుష్ హీరోగా 3 చిత్రాన్ని, గౌతమ్ కార్తీక్ హీరోగా వై రాజా వై చిత్రాన్ని తెరకెక్కించారు. కాగా తాజాగా చాలా గ్యాప్ తరువాత లాల్ సలామ్ చిత్రానికి మెగాఫోన్ పడుతున్నారు. దీన్ని లైకా సంస్థ నిర్మిస్తోంది. రజనీకాంత్ అతిథిగా పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్న ఇందులో నటుడు విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇది క్రికెట్ క్రీడా నేపథ్యంలో రూపొందుతున్న కథా చిత్రమని భావిస్తున్నారు. కాగా ఏఆర్.రెహ్మాన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఇటీవల రజనీకాంత్ పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేశారు. కాగా తాజాగా జాతీయ మహిళా దినోత్సవం, హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని చిత్ర షూటింగ్‌ను మంగళవారం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ రోజుకు మరో ప్రత్యేకత కూడా ఉంది. నటుడు శివాజీరావ్ గైక్వాయిడ్‌ను దర్శకుడు కె.బాలచందర్ రజనీకాంత్‌గా మార్చింది ఈ రోజునే కావడం విశేషం.

ఆటా.. పాటతో హోలీ సంబరాలు



నటి అమలాపాల్

తమిళసినిమా: నటి అమలాపాల్ ప్రస్తుతం ఏది చేసినా వార్తగానే ఉంటోంది. కేరళకు చెందిన ఈ అమ్మడు కోలీవుడ్‌లోనే ఎక్కువ పేరు తెచ్చుకుంది. ఇక తెలుగు, హిందీ భాషల్లోనూ కథానాయకిగా పేరు తెచ్చుకున్న ఈమె తమిళ తెరపై కనిపించి చాలా కాలమే అయ్యింది. ఆ మధ్య నిర్మాతగా మారి కడావర్ అనే చిత్రాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. అయితే ఆ చిత్రం ఓటీటీకి విక్రయించి సేఫ్‌గా బయట పడింది. తర్వాత చిత్ర నిర్మాణం జోలికి పోలేదు. ప్రస్తుతం తమిళంలో చిత్రాలు లేకపోయినా, మలయాళం, హిందీ భాషల్లో నటిస్తూనే ఉంది. కాగా ఇటీవల విదేశీ యాత్రకు వెళ్లిన ఈ సంచలన నటి అక్కడ సముద్ర తీరంలో జలకాలాడుతున్న ఫొటోలను మీడియాకు విడుదల చేసి వార్తల్లోకెక్కింది. అదేవిధంగా బుధవారం తన తల్లి పుట్టిన రోజును విదేశాల్లో ఘనంగా జరుపుకుంది. అక్కడ ఒక మొక్కను నాటి దాన్ని తన తల్లికి పుట్టిన రోజు కానుకగా సమర్పించింది. ఇకపోతే పౌర్ణమి, హోలీ సందర్భంగా తన అభిమానులకు సర్‌ప్రైజ్‌ను ఇచ్చింది. నటుడు సూర్య, అశిన్ జంటగా నటించిన కాక్క కాక్క చిత్రంలోని ఎన్నై కొంచెం మాట్రి అనే పాటకు డాన్స్ చేసిన వీడియోనూ సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసి అభిమానులకు హోలీ శుభాకాంక్షలు తెలిపింది. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

కుల మతాలకంటే మానవత్వమే ముఖ్యం



అయోధి చిత్రం యూనిట్

తమిళసినిమా: నటుడు శశికుమార్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం అయోధి. మందిరన్ మూర్తి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ట్రిడెంట్ ఆర్ట్స్ పతాకంపై ఆర్.రవీంద్రన్ నిర్మించారు. యదార్థ ఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో నటి యాష్ పాల్ శర్మ, పుగళ్, బోస్‌వెంకట్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. గత 3వ తేదీన విడుదలై మంచి టాక్‌తో ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్రానికి విమర్శకుల నుంచి ప్రశంసలు లభించడంతో శరత్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి చిత్రాన్ని ఆదరిస్తారని ప్రేక్షకులు మరోసారి నిరూపించారన్నారు. కుల మతాలకంటే మానవత్వమే ముఖ్యం అని చెప్పే ఇతి వృత్తంతో రూపొందించిన చిత్రం ఇదన్నారు. సమాజంలో జరుగుతున్న ఘటనలనే ఇందులో చూపించామని చెప్పారు. ఉత్తరాదికి చెందిన వారికి తమిళులు సహకారం అందిస్తున్నారనే విషయాన్ని.. అదే ఈ చిత్రంలో చూపించామన్నారు. ఇది అందరి జీవితాల్లో జరిగే కథేనని పేర్కొన్నారు. దర్శకుడు కథ చెప్పినప్పుడే కచ్చితంగా ఈ చిత్రం చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. కాగా కమర్షియల్ అంశాలను కావాలని జోడించకుండా కథనే నమ్ముకుని చేసిన చిత్రం అయోధి. అయితే చిత్రం ఎక్కడా బోర్ కొట్టకుండా, అనవసర విషయాల జోలికి పోకుండా దర్శకుడు తాను అనుకున్నది తెరపై ఆవిష్కరించారని విమర్శకులు సైతం ప్రశంసిస్తుండడం గమనార్హం.

కోలీవుడ్ టాక్స్

తమిళ ఇండస్ట్రీలోకి జూనియర్ ఎన్టీఆర్?



ధనుష్



వెట్రిమారన్




జూనియర్ ఎన్టీఆర్

తమిళసినిమా: తాజాగా కోలీవుడ్‌లో ఓ భారీ మల్టీ స్టారర్ చిత్రం గురించిన చర్చ జోరుగా సాగుతోంది. ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంతో టాలీవుడ్, బాలీవుడ్‌ను దాటి హాలీవుడ్‌లోనూ జెండా పాతిన నటుడు జూనియర్ ఎన్టీఆర్. ప్రస్తుతం తన 30వ చిత్రంలో నటించడానికి సిద్ధం అవుతున్నారు. కాగా కోలీవుడ్‌లో స్టార్ హీరోగా రాణిస్తున్న ధనుష్ కూడా బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాల్లో నటించి యూనివర్సల్ నటుడిగా గుర్తింపు పొందారు. ఈయన ఇటీవల తమిళం, తెలుగు భాషల్లో నటించిన సార్(తమిళంలో వాత్తీ) చిత్రం మంచి విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈయన కెప్టెన్ మిల్లర్ చిత్రంలో నటిస్తున్నారు. దీని తరువాత తన 50వ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించడానికి సిద్ధం అవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇకపోతే కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం కలిగిన దర్శకుడు వెట్రిమారన్. ఈయన దర్శకత్వ శైలి భిన్నంగా ఉంటోంది. ఇటీవల ధనుష్ హీరోగా మారన్ చిత్రం సంచలన విజయాన్ని సాధించింది. ప్రస్తుతం నటుడు సూరి, విజయ్‌సేతుపతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న విడుదలై చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. ఆర్‌ఎస్ .ఇన్ఫోటెంట్ పతాకంపై ఎల్‌రెడ్.కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం తొలి భాగం త్వరలో విడుదలకు సిద్ధం అవుతోంది. కాగా అసలు విషయం ఏమిటంటే జూనియర్ ఎన్టీఆర్, ధనుష్ హీరోలుగా దర్శకుడు వెట్రిమారన్ ఒక మల్టీస్టారర్ చిత్రాన్ని తమిళం, తెలుగు భాషల్లో తెరకెక్కించడానికి సిద్ధం అవుతున్నట్లు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం వైరల్ అవుతోంది. దీన్ని ప్రస్తుతం విడుదలై చిత్రాన్ని నిర్మిస్తున్న ఎల్‌రెడ్.కుమార్‌నే రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నట్లు టాక్. కాగా విడుదలై చిత్రం తరువాత దర్శకుడు వెట్రిమారన్ సూర్య హీరోగా వాడివాసల్ చిత్రాన్ని పూర్తి చేయనున్నట్లు సమాచారం.ఆ తరువాత ఈ మల్టీస్టారర్ చిత్రాన్ని చేపట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

హన్సిక కథానాయకిగా మ్యాన్

తమిళసినిమా: తమిళం, తెలుగు, హిందీ భాషల్లో అగ్రనటిగా రాణిస్తున్న నటి హన్సిక. ఇటీవల హీరోయిన్ ఓరియంటెడ్ కథాచిత్రాలతోనూ సత్తా చాటుతున్నారు. అలా హన్సిక నటించిన 50వ చిత్రం మహా. ఇది ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందనను అందుకుంది. కాగా ప్రస్తుతం ఈమె చేతిలో పలు చిత్రాలు ఉన్నాయి. తాజాగా మరో కొత్త చిత్రానికి సిద్ధం అవుతున్నారు. దీనికి మ్యాన్ అనే టైటిల్‌ను నిర్ణయించారు. దీని ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం విడుదల చేశారు. ఇంతకు ముందు 96, రోమియో జూలియట్, గలాటా కాదల్ వంటి విజయవంతమైన సినిమాలను నిర్మించిన మద్రాస్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న తాజా చిత్రం ఇది. అదే విధంగా గలాటా కాదల్ చిత్రం ఫేమ్ ఇగోర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్ ఓరియంటెడ్ కథా చిత్రంగా తెరకెక్కుతున్న ఇందులో నటుడు ఆరి అర్జునన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. చిత్ర వివరాలను దర్శకుడు వెల్లడిస్తూ.. పురుషత్వం అనేది అహంకారానికి చిహ్నం అన్నారు. అది నకిలీ గుర్తింపు అని పేర్కొన్నారు. అది స్త్రీపై అధికారం చెలాయించేతత్వం అని పేర్కొన్నారు. మ్యాన్ చిత్ర ప్రధాన నేపథ్యం ఇదేనన్నారు. అలాంటి పురుషాధిక్యంపై పోరాటం చేసే ఒక యువతి కథే ఈ చిత్రం అన్నారు. ఇందులో నటి హన్సిక పాత్ర చాలా స్ట్రాంగ్‌గా, నటనకు అవకాశం కలిగిన పాత్ర అని చెప్పారు.ఇక నటుడు ఆరి అర్జునన్ చాలా భిన్నమైన పాత్రలో విలనిజాన్ని ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ఇది చాలా గట్స్ ఉన్న పాత్ర అని చెప్పారు. ఇది సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో సాగే కథా చిత్రంగా ఉంటుందన్నారు. దీనికి జిబ్రాన్ సంగీతాన్ని, మణికంఠన్ ఛాయాగ్రహణం అందిస్తున్నారని, శరణ్యా భాగ్యరాజ్ దీనికి స్క్రీన్‌ప్లే రాయగా, పాన్ పార్తీపన్ మాటలను అందిస్తున్నారని చెప్పారు. చిత్ర షూటింగ్ చివరి దశలో ఉందని దర్శకుడు చెప్పారు.



మ్యాన్ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్

క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రిలో పసికందు మృతి

• బంధువుల రాస్తారోకో

అన్నానగర్: రామనాథపురం ప్రభుత్వాస్పత్రిలో శిశువు మృతిచెందింది. దీంతో ఆగ్రహించిన బంధువులు ఆస్పత్రి ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. వివరాలు.. పసుంపొన్‌నగర్‌కు చెందిన మణికంఠన భార్య లక్ష్మీ ఫిబవరి 28న ప్రసవం కోసం రామనాథపురం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేరింది. ఈ నెల 2వ తేదీ ఆడ శిశువు జన్మించింది. 3 రోజుల తర్వాత బిడ్డ ఆరోగ్యం అకస్మాత్తుగా బాగు లేదాని పేర్కొంటూ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు తరలించారు. బుధవారం తెల్లవారుజామున చిన్నారికి కృత్రిమ శ్వాస అందిస్తుండగా మృతి చెందింది. దీంతో బంధువులు ఆస్పత్రిలోని పిల్లల వార్డు ఎదుట బైటాయించి ఆందోళనకు దిగారు. చిన్నారికి సరైన వైద్యం అందించలేదని ఆరోపించారు. మృతదేహాన్ని తీసుకోబోమని భీష్మించారు. విచారణలో ఇన్‌ఫెక్షన్ సోకి చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు. నిరసనకారులతో పోలీసులు, అధికారులు మాట్లాడి వారిని అక్కడి నుంచి పంపించారు.

ప్లస్- 2 విద్యార్థిని ఆత్మహత్య

అన్నానగర్: కోయంబత్తూరు దుడియలూర్ ప్రాంతానికి చెందిన మోహన్ కార్పోరేషన్ ఉద్యోగి. ఇతని కుమార్తె ధరణి (17) ఆ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 12వ తరగతి చదువుతోంది. ఈ నేపథ్యంలో ధరణి మంగళవారం రాత్రి తన ఫ్లాట్‌లోని 13వ అంతస్తు నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకుంది. దుడియాలూరు పోలీసులు ధరణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ధరణి ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ సాగుతోంది.

తల్లి మందలించడంతో..

అన్నానగర్: ఇంటికి ఆలస్యంగా వచ్చినందుకు తల్లి మందలించడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కన్యాకుమారి జిల్లా ఆరల్వాయిమొళి మంగమ్మాళ్ రోడ్డుకు చెందిన జెబన్ విఘ్నేష్ (27) టెంపో డ్రైవర్. ప్రస్తుతం దేవసగాయం మౌంట్ సౌత్ స్ట్రీట్ ఫార్మర్స్ ఫామ్‌లో నివసిస్తున్నాడు. తల్లి విజయారోస్ ఆ ప్రాంతంలో ఇడ్లీ దుకాణం నడుపుతోంది. జెబన్ విఘ్నేష్ రోజూ ఇంటికి ఆలస్యంగా వచ్చేవాడు. తల్లి మందలించేది.

దీంతో మనస్తాపానికి గురైన జెబన్ విఘ్నేష్ మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరల్వాయిమొళి సబ్ ఇన్స్పెక్టర్లు ఫ్రాన్సిస్, స్టీఫెన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆచారిపాళయం మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు.

ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి దూకి..

అన్నానగర్: ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. క్రోంపేట జమీన్రాయపేటకు చెందిన ఆనందరాజ్ (30) పెయింటర్. తల్లిదండ్రులు అతనికి పెళ్లి చేయడానికి అమ్మాయి కోసం వెతుకుతున్నారు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న ఆనందరాజ్ ఎరికరై వీధిలోని 100 అడుగుల ఎత్తున్న ట్యాంక్ పైకి ఎక్కాడు. అక్కడి నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు చెన్నై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

తిరువొత్తియూరు: భార్య వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. క్రిష్ణగిరి జిల్లా మత్తూరు సమీపంలోని పల్లత్తూరు గ్రామానికి చెందిన సురేష్ (32) సౌండ్ సర్వీస్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతనికి దుర్గాదేవి (26)తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. ఈ క్రమంలో దుర్గాదేవికి అరుణ్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం భర్తకు తెలియడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. మనస్తాపం చెందిన సురేష్ మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు కారణమైన అతని భార్య దుర్గాదేవి, ఆమె వివాహేతర ప్రియుడు అరుణ్‌ను అరెస్టు చేశారు.

నామ్ తమిళర్ పార్టీ నేత అరెస్టు

అన్నానగర్: తిరువారూర్ జిల్లాకు చెందిన నామ్ తమిళర్ పార్టీ నేతను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. మన్నార్‌గుడి రాజ గోపాల స్వామి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలలో ఈ నెల 4వ తేదీ ఉద్యోగ మేళా జరిగింది. కలెక్టర్ చారుశ్రీ, ఎమ్మెల్యే టీఆర్‌పీ రాజా, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం జరుగుతుండగా మన్నార్‌గుడి రామ అరవిందన్ (54) తమ పార్టీ నాయకులతో కలిసి ప్రచారం ప్రారంభించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని వారిని బయటకు పంపించారు. దీనిపై తిరువారూర్ జిల్లా ఉపాధి అధికారి చంద్రశేఖర్ మంగళవారం మన్నార్‌గుడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులను బెదిరించడం, విధులను అడ్డుకోవడంతో ఆయనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బుధవారం రామ అరవిందన్ ఇంటికి వెళ్లి ఆయన్ను అరెస్టు చేశారు.

చిరుత మృతి

అన్నానగర్: మాంజోలాయి అటవీ ప్రాంతంలో చిరుత మృతి చెందింది. నెల్లై జిల్లాలోని పశ్చిమ కనుమల్లోని మంజోలై నాలుముక్కు తేయాకు తోట వద్ద బుధవారం ఉదయం చిరుత కళేబరం కనిపించింది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు.

ఆంధ్రా నుంచి తీసుకొచ్చే పశువులపై నిఘా

వేలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా నుంచి వేలూరు మీదుగా తరలిస్తున్న పశువులపై నిఘా ఉంచాలని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు జిల్లా పలమనేరు, పుంగనూరు, బైరెడ్డిపల్లె ప్రాంతాల్లో జరిగే పశువుల సంతల నుంచి రోగాల బారిన పడిన పశువులను వేలూరు మీదుగా కేరళ రాష్ట్రానికి తరలిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. దీని కారణంగా వేలూరు జిల్లాలోని పశువులకు వింత వ్యాధులు సోకుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన సైనగుంట చెక్‌పోస్టును తనిఖీ చేశామన్నారు. పశువులు ఆరోగ్యంగా ఉన్నాయని పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి సర్టిఫికెట్ ఉంటేనే తమిళనాడులో అనుమతించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేయాలన్నారు. చెక్‌పోస్టు ద్వారా తరలిస్తున్న పశువుల వివరాలను సీసీ కెమెరాలో



ఆంధ్రా సరిహద్దు చెక్‌పోస్టులో తనిఖీలు చేస్తున్న కలెక్టర్

నమోదు చేసి పూర్తి వివరాలు అందజేయాలన్నారు. గుడియాత్తం సబ్ కలెక్టర్ వెంకట్రామన్, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నవనీత క్రిష్ణన్, డీఎస్పీ రామూర్తి, తహసీల్దార్ విజయకుమార్ ఉన్నారు.

అన్నాడీఎంకే నేత హత్య

అన్నానగర్ : తిరుచ్చిలో మంగళవారం అన్నాడీఎంకే నేతను హత్య చేసి పరారైన ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. తిరువెరుంభూర్‌లోని ఈచ్చాంగాడుకి చెందిన ముత్తుకృష్ణన్ కుమారుడు గోపి (32) మూడేళ్ల క్రితం లిబరేషన్ టైగర్స్ ఆఫ్ ఇండియా నుంచి అన్నాడీఎంకేలో చేరాడు. మంగళవారం రాత్రి తిరువెరుంభూర్‌లో జరిగిన పార్టీ సమావేశానికి వెళ్లాడు. రాత్రి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో తువాక్కుడి వద్ద ఓ రెస్టారెంట్‌కు వెళ్లాడు. అక్కడికి వచ్చిన ముగ్గురు వ్యక్తులు కొడవలితో దాడి చేశారు. గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్పీ సుజిత్ కుమార్, దువక్కుడి పోలీసులు విచారణ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుచ్చి ప్రభుత్వ మార్చురీకి తరలించారు. 2019లో అన్న గొడవకు సంబంధించి గోపీపై హత్యాయత్నం కేసు ఉంది. ఈ కేసు మంగళవారం విచారణకు వచ్చింది. ఇందులో హాజరైన గోపి మంగళవారం సాయంత్రం వరకు కోర్టులోనే ఉన్నాడు. పాత కక్షలతోనే హత్య జరిగిందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హంతకులను పట్టుకునేందుకు 3 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.

అన్నాడీఎంకేలోకి తిరుత్తణి యూనియన్ చైర్‌పర్సన్

తిరుత్తణి: యూటర్న్ తీసుకున్న తిరుత్తణి యూనియన్ చైర్‌పర్సన్ తీరు చర్చనీయాంశంగా మారింది. 2021లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మురుకంపట్టు నుంచి ఇండిపెండెంట్‌గా పోటీచేసి గెలుపొందిన తంగధనం అన్నాడీఎంకే సభ్యుల మద్దతుతో తిరుత్తణి యూనియన్ చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. అయితే వైస్ చైర్మన్ ఈఎస్‌కండ్రిగ రవితో విభేదించి సీఎం స్టాలిన్ సమక్షంలో ఏడాది క్రితం డీఎంకేలో చేరారు. చైర్‌పర్సన్‌పై అన్నాడీఎంకే సభ్యులు తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానాలకు డీఎంకే సభ్యులు సైతం మద్దతు పలికారు. అయితే 10 మంది సభ్యుల్లో 9 మంది మాత్రమే అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటు వేయడంతో చైర్మన్ పదవీ గండం తప్పింది. ఈ క్రమంలో ఆమె అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామిని కలిసి అన్నాడీఎంకే తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం అన్నాడీఎంకే శ్రేణులతో



ఎంజీఆర్‌కు నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ తంగధనం

బీడీఓ కార్యాలయంలోని ఎంజీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. ఆ పార్టీ శ్రేణులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఏడాది వ్యవధిలో ఆమె మూడోసారి పార్టీ మారడం గమనార్హం.

25 కిలోల సముద్రపు నత్తలు స్వాధీనం

అన్నానగర్: తూత్తుకుడిలో మంగళవారం సాయంత్రం 25 కిలోల సముద్రపు నత్తలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్ట్ చేశారు. తూత్తుకుడిలో గల్ఫ్ ఆఫ్ మన్నార్ బయోస్పియర్ రిజర్వ్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లోని తూత్తుకుడి వైల్డ్‌లైఫ్ రిజర్వ్‌కు చెందిన ఫారెస్ట్ రేంజర్ బాలాజీ, గార్డెనర్ రాబిన్‌సన్ మంగళవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. తూత్తుకుడిలోని ఓ కళాశాల వెనుక ఉన్న చందన మారియమ్మన్ దేవాలయం దగ్గరకు ఓ వ్యక్తి బైక్‌పై బస్తాలతో వచ్చాడు. అనుమానంతో అతన్ని తనిఖీ చేశారు. అందులో 25 కిలోల సముద్రపు నత్తలు ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకుని తూత్తుకుడి సమీపంలోని మేట్టుపట్టికి చెందిన ఖాజామైదీన్ (39)ను అరెస్ట్ చేశారు. ఫారెస్ట్ అధికారి జినోఫ్లసిల్, ఫారెస్టర్ మదనకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న సముద్రపు నత్తలు, నిందితుడు

విమానంలో బంగ్లాదేశ్ మహిళ మృతి

తిరువొత్తియూరు: చికిత్స తీసుకోవడానికి బంగ్లాదేశ్ నుంచి చెన్నైకి వస్తున్న మహిళ విమానంలోనే గుండెపోటుతో మృతిచెందింది. వివరాలు.. బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ అబు భార్య కుర్షిత బేగం (43) కొన్ని నెలలుగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. అక్కడ పలు ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకుండా పోయింది. వేలూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేసుకోవడానికి దంపతులు ఇద్దరూ మంగళవారం సాయంత్రం బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నుంచి చెన్నై వస్తున్నారు. విమానంలో కుర్షిత బేగంకు హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. సమాచారం అందుకున్న పైలెట్ చెన్నై విమానాశ్రయం కంట్రోలింగ్ రూంకు సమాచారం అందించారు. మంగళవారం రాత్రి చెన్నై విమానాశ్రయంలో దిగిన వెంటనే సిద్ధంగా ఉన్న వైద్య బృందం ఆమెకు పరీక్షలు చేసింది. అయితే అప్పటికే ఆమె మృతి చెందింది. విమానాశ్రయం పోలీసులు కుర్షిత బేగం మృతదేహాన్ని క్రోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 59,751 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 20,177 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు స్వాధీనం



గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు, నిందితుడు కస్తూరి

అన్నానగర్: చెన్నై అన్నాసాలై పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటేశన్ 2వ వీధిలోని ఓ ఇంట్లో పెద్దఎత్తున గంజాయి చాక్లెట్లను ఇన్‌స్పెక్టర్ వీరాస్వామి నేతృత్వంలో పోలీసు బృందం మంగళవారం స్వాధీనం చేసుకుంది. 38 కిలోల గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు, కొన్ని గుట్కా ప్యాకెట్లను సీజ్ చేశారు. వాటిని నిల్వ ఉంచిన బిహార్‌కు చెందిన గంజాయి వ్యాపారి కస్తూరి (28)ను అరెస్టు చేశారు.

హత్య కేసు నిందితుడి అరెస్టు

తిరువొత్తియూరు: డీఎంకే నేత హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నై టీపీ సత్రం ప్రాంతానికి చెందిన డీఎంకే నేత సంపత్తు. ఇతన్ని అన్నానగర్‌లో ఏడుగురి ముఠా కత్తులతో దాడి చేసి హత్య చేసింది. ఈ కేసులో చెన్నై కుండ్రత్తూర్ ప్రాంతానికి చెందిన రౌడీ లారెన్స్‌ను (26) అరెస్టు చేసి జైలులో ఉంచారు. బెయిల్‌పై బయటకు వచ్చిన లారెన్స్ కోర్టులో హాజరుకాకుండా ఏడాదిగా అజ్ఞాతంలో ఉన్నాడు. అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని అన్నానగర్ పోలీసులకు కోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో లారెన్స్ సెల్ నంబర్ ఆధారంగా పోలీసులు కుండ్రత్తూర్‌లో బుధవారం అతన్ని అరెస్టు చేశారు. ఎగ్మూర్ కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి: కోరమంగళంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. మండల వైద్యాధికారి గోపీకృష్ణ ఆధ్వర్యంలోని వైద్య సిబ్బంది సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే చంద్రన్, సర్పంచ్ నరసింహరాజు పరిశీలించారు. డీఎంకే కార్యదర్శులు కృష్ణన్, ఆర్తిరవి పాల్గొన్నారు

డివైడర్‌ను ఢీకొన్న కారు

పూతలపట్టు: మండలంలో రంగంపేట క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం ఓ కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. ఎస్‌ఐ హరిప్రసాద్ వివరాల మేరకు బెంగళూరుకు చెందిన దిలీప్ బుధవారం తిరుపతికి కారులో బయలుదేరాడు. మార్గమధ్యంలోని రంగంపేట క్రాస్ వద్ద ఆ కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. దీంతో దిలీప్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. దీనిపై వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారు-లారీ ఢీ

• ఇద్దరు కేరళ యువకుల మృతి

అన్నానగర్: తేనిలో కారును లారీ ఢీకొనడంతో ఇద్దరు కేరళ యువకులు మృతి చెందారు. కేరళ రాష్ట్రం కొట్టాయం జిల్లా వడవత్తూరు సమీపంలోని ఆనందభవన్ ప్రాంతానికి చెందిన రాజేష్ కుమారుడు అనంతు (22). ఇతని చెల్లెలు అమ్ములు. ఆమె సేలంలోని ఓ నర్సింగ్ కాలేజీలో చదువుతోంది. ఆమెకి అస్వస్థతకు గురికావడంతో స్వగ్రామానికి తీసుకురావడానికి అదే ప్రాంతానికి చెందిన తన స్నేహితులు అక్షయ్ (23), గోకుల్ (23)లతో కలిసి అనంతు కారులో సేలం బయలుదేరాడు. అక్షయ్ కారు నడిపాడు. బుధవారం తెల్లవారుజామున 3.15 గంటలకు తేని సమీపంలోనే కుముళి-దిండుక్కల్ జాతీయ రహదారిపై మధురాపురి ప్రాంతంలో కారు వెళుతోంది. పేవర్ బ్లాకు రాళ్లతో కర్ణాటక రిజిస్ట్రేషన్ నంబర్ గల లారీ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న అక్షయ్, గోకుల్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. అనంతు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న తేని అల్లినగరం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన అనంతుని చికిత్స నిమిత్తం 108లో తేని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. అక్షయ్, గోకుల్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అదే ఆసుపత్రికి తరలించారు. ధర్మపురి జిల్లా పాలకోడ్ సమీపంలోని పానంగల్లి ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ మురుగేశన్‌పై అల్లినగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న బంధువులు తేని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి వచ్చారు. మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరయ్యారు.

కొడుకును చూడలేకపోయామనే బాధతో..

అన్నానగర్: కొడుకు పుట్టిన రోజు చూడలేకపోయామన్న బాధతో తల్లి ఆత్మహత్య చేసుకుంది. చెన్నై వేలాచ్చేరి ఎళిల్ నగర్‌కు చెందిన వినోద్ కుమార్ (34), అంబిక (30) దంపతులకు కుమారులు జగదీశ్వరన్ (10), లోకేష్ (7) ఉన్నారు. ఇద్దరూ అమ్మమ్మ ఇంట్లో చదువుకుంటున్నారు. ఈ నెల 5న లోకేష్ పుట్టినరోజు. వినోద్ కుమార్ కుమారుడిని ఊరి నుంచి తీసుకురాకుండా పుట్టిన రోజు వేడుకలు జరిపాడు. పుట్టిన రోజున కూడా కొడుకుని చూడలేకపోయానన్న బాధతో అంబిక తన భర్తతో గొడవ పడింది. మనస్తాపానికి గురైన అంబిక మంగళవారం రాత్రి తన బెడ్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త వినోద్ కుమార్ పెరుంబాక్కం పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి విచారణ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేషన్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ అరెస్టు

అన్నానగర్: కరూర్ కార్పొరేషన్ పరిధిలోని తిల్లైనగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో మాణికవాసగం కొత్త ఇంటిని నిర్మించారు. ఆ ఇంటికి పన్ను కట్టాలని కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తు స్వీకరించి ఆ వార్డు ఇన్‌చార్జిగా ఉన్న కార్పొరేషన్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర కొత్త పన్ను కట్టేందుకు రూ.20 వేలు లంచంగా అడిగినట్లు తెలుస్తోంది. అతనికి రూ.20 వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు. లంచం చెల్లించేందుకు ఇష్టపడని మాణికవాసకం కరూర్ ఏసీబీని ఆశ్రయించాడు. గాంధీగ్రామంలోని టీ దుకాణం యజమాని భారతీరాజా వద్ద డబ్బులు ఇవ్వాలని రవిచంద్రన్ తెలిపాడు. దీంతో మాణికవాసం మంగళవారం సాయంత్రం ఆ డబ్బును టీ దుకాణం యజమానికి ఇచ్చాడు. వెంటనే భారతీరాజా, రవిచంద్రను సంప్రదించి డబ్బులు తీసుకున్నట్లు తెలిపాడు. గాంధీగ్రామం బస్టాండ్ దగ్గర డబ్బులు తీసుకురావాలని రవిచంద్రన్ చెప్పడంతో భారతీరాజా డబ్బులు తీసుకుని అక్కడ వేచి ఉన్న రవిచంద్రకు ఇచ్చాడు. దీంతో పోలీసులు వారిద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

అరుదైన కోతులు స్వాధీనం

అన్నానగర్: చెన్నై విమానాశ్రయానికి థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి విమానం వచ్చింది. ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు పర్యవేక్షించారు. తమిళనాడుకు చెందిన ఓ ప్రయాణికుడిపై అనుమానం వచ్చింది. అతని బ్యాగులను తనిఖీ చేశారు. పెద్ద బ్యాగులోని ఓ బుట్టలో బ్రెజిల్, కొలంబియా దేశాల్లో నివసించే 'మర్మో సేతు' అనే అరుదైన జాతికి చెందిన 4 కోతి పిల్లలు గుర్తించారు. అతన్ని విచారించగా పెంచుకునేందుకు తీసుకొచ్చానని చెప్పాడు. జంతువులను తీసుకొచ్చినందుకు సరైన పత్రాలు లేవని, వైద్య పరీక్షల అనంతరం కోతులకు రోగాలు లేవని ధ్రువీకరణ పత్రం ఉన్నట్లు గుర్తించారు. ఇతర దేశాల నుంచి వన్యప్రాణులను భారత్‌లోకి తీసుకురావడానికి అంతర్జాతీయ వన్యప్రాణుల సంరక్షణ విభాగం, భారతీయ వన్యప్రాణి విభాగం నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ లేకపోవడంతో కస్టమ్స్ అధికారులు 4 కోతి పిల్లలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని తిరిగి థాయ్‌లాండ్‌కు పంపించేందుకు చెన్నైలోని కేంద్ర వన్యప్రాణి, క్రైమ్ విభాగం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



అరుదైన జాతి కోతి పిల్ల

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

గుడుపల్లె: మండలంలోని బెగ్గిలిపల్లె గ్రామంలో బుధవారం సుబ్రమణ్యం(35) ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెంకటేష్ కుమార్తె మునెమ్మకు కర్ణాటక రాష్ట్రం కామ సముద్రం సమీపంలోని కలవంచి గ్రామానికి చెందిన సుబ్రమణ్యంతో 15 ఏళ్ల కిందట వివాహమైంది. వివాహమైన కొన్ని నెలలకే వెంకటేష్ బెగ్గిలిపల్లెలో సుబ్రమణ్యానికి కాపురం పెట్టించాడు. వీరికి శ్రావణి, ప్రకాష్ పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు గొడవలు జరిగేవి. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఒక గదిలో తలుపులు వేసుకుని సుబ్రమణ్యం శ్లాబ్‌కమీక్కి తాడుతో ఉరేసుకుని మృతి చెందాడు. కిటికీలో నుంచి గమనించిన మునెమ్మ విలపిస్తూ చుట్టుపక్కల వారికి విషయం తెలిపింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానిస్తున్నారు.

వినాయకుని హుండీ ఆదాయం రూ.85 లక్షలు




కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.85లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయంలో 13 రోజుల హుండీ కానుకల ఆదాయాన్ని బుధవారం ఆస్థాన మండపంలో లెక్కించారు. బంగారం 40 గ్రాములు, వెండి కిలో 510 గ్రాములు, ఫారిన్ కరెన్సీ యూఎస్‌ఏ 697 డాలర్లు, ఇంగ్లాండ్ 50 పౌండ్లు, సింగపూర్ 10 డాలర్లు, మలేషియా 6 రింగిట్స్, యూఏఈ 40 దినార్‌లతో కలిపి మొత్తం రూ.85 లక్షలు ఆదాయం లభించింది. ఆలయ అభివృద్ధి పనులకు ఈ ఆదాయాన్ని వెచ్చించనున్నట్లు చైర్మన్, ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు విద్యాసాగర్ రెడ్డి, హేమమాలిని, పర్యవేక్షకులు శ్రీధర్ బాబు, కోదండపాణి, రవి, యూనియన్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

11న సంకటహార చతుర్థి వ్రతం

• అదే రోజు రాత్రి స్వర్ణ రథోత్సవం



వ్రతం ఆచరిస్తున్న భక్తులు (ఫైల్)



కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం

కాణిపాకం(యాదమరి): స్వయంభు కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈనెల 11వ తేదీన సంకట హర చతుర్థి వ్రతం నిర్వహించనున్నారు. ఇక్కడి ఆలయంలో వ్రతం చేసుకుంటే కష్టాలు తొలగి ఆనందాలు వెల్లివిరుస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయంలో ప్రతి పౌర్ణమి తరువాత నాలుగో రోజు చతుర్థి రోజున ఈ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం రెండు విడతలుగా వ్రతం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌లో 150 మంది భక్తులను అనుమతిస్తారు. సంకటాలు తొలగించుకునేందుకు భక్తులు ఈ వ్రతంలో పాల్గొనవచ్చని ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు. సంకట హర చతుర్థి వ్రతం సందర్భంగా శనివారం సాయంత్రం శ్రీసిద్ధి, బుద్ధి సమేతంగా వినాయకస్వామివారు స్వర్ణ రథంపై కొలువుదీరి ఆలయ మాడ వీధుల్లో భక్తులను కటాక్షించనున్నారు.

అందుబాటులో టికెట్లు

ఆలయంలో సంకటహర చతుర్థి గణపతి వ్రతం నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నాం. వ్రతంలో పాల్గొనే భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో రెండు విడతలుగా నిర్వహిస్తున్నాం. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు వ్రతం నిర్వహిస్తున్నాం. రూ.350 టికెట్ కొనుగోలు చేసి ఒకరు వ్రతంలో పాల్గొనవచ్చు. పూజా సామగ్రిని ఆలయ తరపునే సమకూరుస్తాం.



–మోహన్ రెడ్డి, ఆలయ చైర్మన్

జాతర నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



పుంగనూరు ప్యాలెస్‌లో జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, కమిషనర్ నరసింహప్రసాద్

పుంగనూరు: పట్టణంలో ఈనెల 14, 15న జరగనున్న శ్రీసుగుటూరు గంగమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా నిర్వహిస్తామని పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి, సీఐ మధుసూదన్‌రెడ్డితో కలసి ప్యాలెస్‌ను పరిశీలించారు. ప్యాలెస్ పురాతన భవనం కావడంతో ముందు జాగ్రత్తగా అక్కడ రద్దీని నియంత్రిస్తామన్నారు. అలాగే తొక్కిసలాట జరగకుండా బారికేడ్లు, షామియానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, దొంగతనాలు జరగకుండా ఉండేందుకు అధికసంఖ్యలో పోలీసులను బందోబస్తుకు కేటాయిస్తున్నామని చెప్పారు. మఫ్టీలో పోలీసులను ఉంచుతామన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో జాతరను జరుపుకోవాలని డీఎస్పీ కోరారు. కార్యక్రమంలో ఏఈ కృష్ణకుమార్, ఎస్‌ఐ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

నియంత్రణలో క్షయ

- రాష్ట్రంలో విజయవంతంగా వ్యాధి నియంత్రణ

సాక్షి, అమరావతి: ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే క్షయ(టీబీ) ఒకప్పుడు భయంకరమైన వ్యాధి. ఈ వ్యాధి నివారణకు పూర్తిస్థాయిలో మందులు ఉండేవి కావు. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రస్తుతం వైద్య సదుపాయాలు, మందులు పెరిగాయి. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించడం, బాధితులకు మంచి వైద్యం, క్రమం తప్పకుండా మందులు అందిస్తే నివారణ సాధ్యం. ఇదే వ్యూహంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో క్షయ వ్యాధిని నియంత్రిస్తోంది. వ్యాధి నియంత్రణ, నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. గత ఏడాది క్షయ రోగులకు చేసిన చికిత్సలో 93 శాతం సక్సెస్ రేటు నమోదైంది. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 8,52,414 మందికి టీబీ పరీక్షలు నిర్వహించగా 92,129 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. వీరిలో 90,862 మందికి వైద్య సేవలు అందించారు. 84,501 మంది కోర్సు పూర్తి చేసుకుని వ్యాధి నుంచి బయటపడ్డారు. 2020 నుంచి వరుసగా రాష్ట్రంలో సక్సెస్ రేటు 90 శాతం మేర నమోదవుతుండటం గమనార్హం. దేశంలోనే సమర్థవంతంగా క్షయ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్న టాప్‌-3 రాష్ట్రాల్లో ఏపీ ఒకటి. 2021లో కనబరిచిన ఉత్తమ పనితీరుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వైద్య శాఖకు అవార్డులు కూడా అందించింది.

లక్షణాలున్న ప్రతి ఒక్కరికీ పరీక్షలు

రెండు వారాలైనా తగ్గని దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, కఫంలో రక్తం పడటం వంటి లక్షణాలున్న అందరికీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, వైద్యం చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రెండున్నర లక్షల జనాభాకు ఒక సూపర్‌వైజర్ రోగులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

2025కి ముందే టీబీ నిర్మూలన లక్ష్యం

కేంద్ర వైద్య శాఖ 2025 నాటికి దేశంలో టీబీ నిర్మూలనే లక్ష్యంగా పెట్టుకుంది. అంతకన్నా ముందే రాష్ట్రంలో టీబీని నిర్మూలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టీబీ రోగులకు పౌష్టికాహారం అందించడానికి చాలా మంది ముందుకు వస్తున్నారు. ఇప్పటివరకూ రాష్ట్రంలో 2,300 సంస్థలు, వ్యక్తులు 16వేల మంది బాధితులను దత్తత తీసుకుని వారికి పౌష్టికాహారం అందించడానికి సాయం చేస్తున్నారు. – జె. నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్

‘చెడు’జోలికి పోకుండా

కౌమార దశలోని బాలలకు కౌన్సెలింగ్

- లైంగిక, పునరుత్పత్తి, ఆరోగ్య సమస్యలపై అవగాహన
- కౌన్సెలింగ్‌కు స్నేహపూర్వక ఆరోగ్య క్లినిక్‌లలో పెరుగుతున్న రిజిస్ట్రేషన్లు
- క్లినిక్‌లలో దేశవ్యాప్తంగా 2021–22లో 36.52 లక్షల బాలురు నమోదు
- 45.73 లక్షల బాలికల రిజిస్ట్రేషన్
- రాష్ట్రంలో ప్రతి లక్ష మంది జనాభాకు 1,673 మంది నమోదు
- కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ వెల్లడి



2021–22లో దేశంలోనూ, వివిధ రాష్ట్రాల్లో కౌమార స్నేహపూర్వక ఆరోగ్య క్లినిక్స్‌లో ప్రతి లక్ష మందికి కౌమార బాలల నమోదు ఇలా..

రాష్ట్రం	2021 అక్టోబర్‌కి జనాభా	రిజిస్టర్ చేసుకున్న కౌమార దశలోని బాలలు	ప్రతి లక్షమందిలో రిజిస్టర్ చేసుకున్న కౌమార బాలలు
రాజస్థాన్	7,97,90,000	15,32,680	1,921
ఆంధ్రప్రదేశ్	5,28,95,000	8,85,150	1,673
సిక్కిం	6,80,000	10,729	1,578
గుజరాత్	7,02,89,000	3,56,506	1,361
తమిళనాడు	7,65,36,000	10,26,145	1,341
దేశవ్యాప్తంగా..	137,03,15,000	82,30,115	601

సాక్షి, అమరావతి: ప్రపంచంలోనే 25.3 కోట్ల మందితో అత్యధికంగా యువత కలిగిన దేశం భారత్. ఈ యువతలో ప్రతి ఐదుగురిలో ఒకరు 10 ఏళ్ల నుంచి 19 ఏళ్ల మధ్య కౌమార దశలో (టీనేజీలో) ఉన్నారు. కౌమార దశలో ఉన్న బాలబాలికలు చెడు ప్రభావాలకు గురికాకుండా లైంగిక, పునరుత్పత్తి, ఆరోగ్య సమస్యలపై అన్ని రాష్ట్రాల్లో కౌమార స్నేహపూర్వక ఆరోగ్య క్లినిక్స్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ క్లినిక్స్‌లో నమోదు చేసుకునే కౌమార బాలల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇది ఆరోగ్యకరమైన పరిణామం అని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పేర్కొంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో దేశంలో, వివిధ రాష్ట్రాలవారీగా కౌమార స్నేహపూర్వక ఆరోగ్య క్లినిక్స్‌లో నమోదు సంఖ్య, కౌన్సెలింగ్ తీరుపై విశ్లేషణాత్మక నివేదికను ఈ మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. 2020–21 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2021–22లో వివిధ రాష్ట్రాల్లో క్లినిక్‌లలో నమోదు చేసుకున్న వారి సంఖ్య పెరిగిందని నివేదిక తెలిపింది. 2020–21లో కోవిడ్ నేపథ్యంలో ప్రతి లక్ష జనాభాలో 383 మంది ఈ క్లినిక్‌లలో కౌన్సెలింగ్‌కు పేర్లు నమోదు చేసుకోగా 2021–22లో ఆ సంఖ్య 601కు పెరిగిందని పేర్కొంది. రాష్ట్రంలో కూడా 2020–21లో ప్రతి లక్ష మందిలో 283 మంది నమోదు చేసుకోగా 2021–22లో ఆ సంఖ్య 1,673కు పెరిగిందని పేర్కొంది. యుక్త వయస్సులోని యువతీ యువకులను ఆరోగ్యంగా, విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడతారని, ఈ నేపథ్యంలోనే కౌమార దశలోని బాలికలు, బాలురకు పని, విద్య, వివాహం, సామాజిక సంబంధాల విషయంలో చెడు ప్రభావాలకు లోనుకాకుండా చేయడమే స్నేహపూర్వక ఆరోగ్య క్లినిక్స్‌లో కౌన్సెలింగ్ అని నివేదిక పేర్కొంది. రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమం కింద కౌమార ఆరోగ్య సమస్యలు, పౌష్టికాహారం, లింగ ఆధారిత హింస, నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, మానసిక ఆరోగ్యంతోపాటు పెడ ధోరణులకు లోనుకాకుండా వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. శిక్షణ పొందిన సర్వీస్ ప్రొవైడర్ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో ఈ కౌన్సెలింగ్ ఇస్తున్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో దేశంలో మొత్తం కౌమార స్నేహపూర్వక ఆరోగ్య క్లినిక్స్‌లో 36,56,271 మంది బాలురు, 45,73,844 మంది బాలికలు నమోదయ్యారు. 2021–22లో కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు మినహా మిగతా రాష్ట్రాల్లో 60 శాతం పైగా కౌమార దశలోని బాలబాలికలు క్లినికల్ సేవలు, కౌన్సెలింగ్ పొందినట్లు నివేదిక పేర్కొంది. 2021–22లో దేశం మొత్తమ్మీద 70 శాతం బాలికలు, 66 శాతం బాలురు క్లినికల్ సేవలు పొందారు. అలాగే 76 శాతం బాలికలు, 69 శాతం బాలురు కౌన్సెలింగ్ తీసుకున్నారు. మన రాష్ట్రంలో 2021 నాటికి 5,28,95,000 జనాభా ఉండగా అందులో 8,85,150 మంది కౌమార బాలలు నమోదైనట్లు నివేదిక పేర్కొంది.

• తెలంగాణ

మనవడికి ఈత నేర్పించడానికి వెళ్లి..

నీట మునిగి తాత, మనవడు మృతి

ములుగు(గజ్వేల్): కొండపోచమ్మసాగర్ కాలువ కింద ఉన్న కుడిగుంట్ల వాగు గుంతలో మనవడికి ఈత నేర్పిస్తూ ప్రమాదవశాత్తు నీట మునిగి తాత.. ఇద్దరూ మృతి చెందారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం అడవిమజీద్ గ్రామంలో జరిగిన ఈ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ములుగు ఎస్‌ఐ రంగాకృష్ణ తెలిపిన వివరాలివి. అడవిమజీద్ గ్రామానికి చెందిన పిట్టల వెంకటయ్య (60), మనవడు పిట్టల జస్వంత్ (12) ఇద్దరూ పొలం వద్దకు వెళ్లి వస్తామని ఇంట్లో చెప్పి మంగళవారం టీవీఎస్ మోపెడ్‌పై వెళ్లారు. ఇద్దరూ రాత్రి 7 గంటలైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు వారికోసం గాలించారు. రాత్రివేళ గ్రామ సమీపంలోని కొండపోచమ్మ సాగర్ కాలువ గట్టుపై మృతుడు వెంకటయ్య టీవీఎస్ మోపెడ్‌తో పాటు దుస్తులు గుర్తించారు. వెంటనే సాగర్ కాలువ కింద ఉన్న కుడిగుంట్ల వాగు గుంతలో వెతకగా వెంకటయ్య, జస్వంత్ మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసి మృతదేహాలకు గజ్వేల్ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

• తెలంగాణ

ఆన్‌లైన్‌లో భద్రాద్రి ‘నవమి’ టికెట్లు



భద్రాచలం: భద్రాచలంలో ఈనెల 30న జరగనున్న శ్రీ సీతారామచంద్రస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం, 31న నిర్వహించే పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలను వీక్షించే భక్తుల కోసం సెక్టార్ టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు ఈవో రమాదేవి తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా కూడా టికెట్లు విక్రయించనున్నట్లు వివరించారు. ఉత్సవాలకు నేరుగా హాజరయ్యే అవకాశం లేని భక్తులు పరోక్షంగా గోత్ర నామాలతో కల్యాణం జరిపించుకునేందుకు రూ.5 వేలు, రూ.1,116 టికెట్లను వెబ్‌సైట్ ద్వారా, కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. రూ.5 వేల రుసుముకు శ్రీస్వామి వారి మూలవరుల శాలువా, జాకెట్ ముక్క, కుంకుమ, తలంబ్రాలు, మిస్రీ ప్రసాదం పోస్టల్ లేదా కొరియర్ ద్వారా పంపిస్తామని తెలిపారు. రూ.1,116 టికెట్ తీసుకున్న వారికి శ్రీస్వామి వారి కల్యాణ కండువా, జాకెట్ ముక్క, కుంకుమ, తలంబ్రాలు, మిస్రీ ప్రసాదం పంపుతామని పేర్కొన్నారు. వెబ్‌సైట్ చిరునామా: WWW.bhadrachalamonline.com

నవ వధువుది ఆత్మహత్యే..

- పోలీసుల దర్యాప్తులో వెల్లడి
- భర్త అరెస్టు.. రిమాండ్

ఖలీల్‌వాడి: ఈ నెల 2న నిజామాబాద్ సుభాష్‌నగర్‌లోని సుధా హైట్స్ అపార్ట్‌మెంట్ పైనుంచి పడి చనిపోయిన పూర్ణిమ (26)ది ఆత్మహత్యేనని టౌన్ సీఐ వెంకట నారాయణ తెలిపారు. భర్త వేధింపులు తాళలేక ఆమె బలవన్మరణానికి పాల్పడిందని, భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వివరాలివి. రెండు నెలల క్రితం హమాల్‌వాడికి చెందిన పూర్ణిమకు, విశాల్‌తో వివాహం జరిగింది. పూర్ణిమ ఐటీసీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ.. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోంలో భాగంగా ఇంట్లోనే ఉంటోంది. భర్త విశాల్ బిల్డింగ్ కాంట్రాక్ట్ వ్యాపారం చేస్తున్నాడు. పెళ్లయిన రెండు నెలల్లోపే.. పూర్ణిమ నివసిస్తున్న అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తు పైనుంచి పడి చనిపోవడంపై.. ఆమె కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొదట ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం జరిపిన విచారణలో పూర్ణిమను భర్త విశాల్ వేధించేవాడని వెల్లడైంది. అపార్ట్‌మెంట్‌లోని సీసీ ఫుటేజ్, చుట్టుపక్కల వారిని విచారించాక ఆమెది ఆత్మహత్యగా నిర్ధారించి.. భర్తపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కవితకు ఈడీ నోటీసులు..

నేడు విచారణకు రావాలని పిలుపు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో గురువారం ఢిల్లీలో విచారణకు హాజరు కావాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం నోటీసులు జారీ చేసింది. అయితే ముందే ఖరారైన కార్యక్రమాల కారణంగా గురువారం హాజరు కాలేనని కవిత ఈడీ అధికారులకు తెలిపారు. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలన్న డిమాండ్‌తో శుక్రవారం ఢిల్లీలో దీక్ష చేస్తున్నందున విచారణ వాయిదా వేయాలని కోరారు. ఈ నెల 15 వరకు వేర్వేరు కార్యక్రమాలు ఉన్నాయని, అందువల్ల 15 తర్వాత, అత్యవసరమనుకుంటే 11న అందుబాటులో ఉంటానని ఈడీకి ఈమెయిల్ పంపినట్లు సమాచారం. కవిత విజ్ఞప్తిపై ఈడీ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని తెలుస్తోంది. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద తను దీక్ష చేపట్టడం వల్లే ఈడీ విచారణకు నోటీసులు ఇచ్చిందని బుధవారం ఉదయం విడుదల చేసిన ఓ లేఖలో కవిత ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను ఎవరూ లొంగదీసుకోలేరని అందులో పేర్కొన్నారు.

మరోపక్క.. జంతర్‌మంతర్ వద్ద దీక్ష ఏర్పాట్లు పరిశీలించడానికి కవిత బుధవారం రాత్రే ఢిల్లీకి చేరుకున్నారు. అంతకుముందు హైదరాబాద్‌లో న్యాయవాదులతో చర్చించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆందోళన వద్దని, దీక్ష కొనసాగించాలని, బీజేపీ అకృత్యాలను న్యాయపరంగా ఎదుర్కొందామని కేసీఆర్ ఆమెకు భరోసా ఇచ్చినట్లు తెలిసింది.

10న బీఆర్‌ఎస్ సమావేశం

బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 10న తెలంగాణ భవన్‌లో పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరగనుంది. రాష్ట్రంలో ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, పార్టీ కార్యకలాపాలతోపాటు కవితకు ఈడీ నోటీసులు, తాజా పరిణామాల పైనా చర్చించే అవకాశం ఉందని సమాచారం.

శనగ కొనుగోలుకు సర్వం సిద్ధం

బాపట్ల జిల్లాలో 30 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

- మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో వారం రోజుల్లో కొనుగోలు ప్రారంభం
- 16 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- ఈ–క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించుకున్న రైతులు అర్హులు
- జిల్లాలో రబీ శనగ సాగు 24,457 హెక్టార్లు



సాగులో ఉన్న శనగ పైరు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అన్నదాతలను అన్నిరకాలుగా ఆదుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రబీలో రైతులు పండించిన శనగలు కొనుగోలుకు సిద్ధమైంది. ఈ మేరకు మార్క్‌ఫెడ్‌కు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఏపీ మార్క్‌ఫెడ్ శనగల కొనుగోలుకు సర్వం సిద్ధం చేసింది. ఇందుకోసం జిల్లాలో 30 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి శనగలు కొనుగోలు చేయనున్నారు. వారం రోజుల్లో శనగల కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 24,457 హెక్టార్లలో రైతులు శనగ పంటను సాగు చేశారు. ప్రధానంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో శనగ పంటను అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం ఈ పంట కోత దశలో ఉంది. దీంతో గిట్టుబాటు ధరతో శనగలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తక్షణమే పంట కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్‌కు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మార్క్‌ఫెడ్ జిల్లాలోని అద్దంకి, బల్లికురవ, చినగంజాం, ఇంకొల్లు, జే–పంగులూరు, కారంచేడు, కొరిశపాడు, మార్టూరు, పర్చూరు, సంతమాగులూరు, యద్దనపూడి మండలాల పరిధిలో ఇప్పటికే 23 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఇంకొల్లు, కారంచేడు, కొరిశపాడు, పర్చూరు, యద్దనపూడి మండలాల పరిధిలో మరో 7 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మార్క్‌ఫెడ్ సిద్ధమైంది. ఆయా మండలాల పరిధిలోని ప్రాథమిక సహకార పరపతి సంఘాల ద్వారా శనగల కొనుగోళ్లు చేపట్టనున్నారు. మొత్తం 16 వేల మెట్రిక్ టన్నుల శనగలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వారం రోజుల్లోనే శనగల కొనుగోళ్లు మొదలు కానున్నాయి. క్వింటాల్‌కు రూ.5,335 ధర చెల్లించనున్నారు.

కొనుగోలు నిబంధనలు ఇలా..

ఈ–క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించుకున్న రైతులు శనగ పంటను అమ్ముకునేందుకు అర్హులు. వీరు గ్రామంలోని అగ్రికల్చరల్ అసిస్టెంట్ ద్వారా శనగ పంట అమ్మకానికి సంబంధించి పేర్లు నమోదు చేయించుకోవాలి. అధికారులు కేటాయించిన తేదీల ప్రకారం రైతులు పీఏసీఎస్‌లకు పంటను తీసుకెళ్లి అమ్ముకోవాల్సి ఉంటుంది.

శనగ రైతులు హర్షం

ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని రకాలుగా రైతులకు సహాయసహకారాలు అందిస్తున్న ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తోంది. ఇప్పటివరకు రైతుల కడుపుకొడుతున్న దళారీ వ్యవస్థకు చెక్ పెట్టింది. ప్రతి సీజన్‌లో ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కర్షకులకు అండగా ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా నిలుస్తోంది. రైతులు పండించిన పంటలకు ఎప్పటికప్పుడు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తోంది. తాజాగా రబీలో రైతులు పండించిన శనగలను కొనుగోలు చేయనుంది. ఇందుకోసం జిల్లాలో 30 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ సీజన్‌లో 16 వేల మెట్రిక్ టన్నుల శనగలను కొనుగోలు చేయనున్నాం.

– షేక్ అబ్దుల్ సత్తార్, జేడీఏ

చిత్తు కాగితాలే మది దోచే చిత్తరువులై..



పేపర్ క్విల్లింగ్ ఆర్ట్‌లో కళాకృతులు తయారు చేస్తున్న రజని



రజని చేతిలో రూపుదిద్దుకున్న కళాఖండాలు

పేపర్ క్విల్లింగ్ ఆర్ట్‌లో రాణిస్తున్న రజని

ఆమె చేతుల్లో వ్యర్థాలు కూడా అర్థవంతమైన ఆకృతులు రూపుదాలుస్తాయి. ఎందుకూ పనికిరాని చెత్త కాగితపు ముక్కలు అద్భుతాలు ఆవిష్కరిస్తాయి. చిత్తు కాగితాలే అచ్చెరువు గొల్పే కళాఖండాలవుతాయి. తనలోని సృజనాత్మకతకు కళను జోడించి రంగులు మేళవించి అద్భుతాలు సృష్టిస్తున్నారు మేడ రజని. పేపర్ క్విల్లింగ్ ఆర్ట్‌లో రాణిస్తూ, తోటి మహిళలకు కూడా ఉపాధి కల్పిస్తున్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ అయ్యప్ప నగర్‌కు చెందిన మేడ రజని పేపర్ క్విల్లింగ్ ఆర్ట్‌లో అద్భుతాలు సృష్టిస్తున్నారు. మనసు దోచుకునే కళాఖండాలు సృష్టించి ఔరా అని పించుకుంటున్నారు. చిన్నతనంలోనే పేపర్లతో పలు ఆకృతులను కళాత్మకంగా రూపొందించి పలువురి మన్ననలు పొందారు. పదవ తరగతి వరకు చదువుకున్న రజని వివాహం అనంతరం భర్త ప్రోత్సాహంతో తన కళకు మరింత మెరుగులు దిద్దారు. కుటుంబ బాధ్యతలు నెరవేరుస్తునే ఖాళీ సమయంలో కాగితపు కళాకృతులను సృజించడమే కాకుండా దానినే కుటీర పరిశ్రమలా మార్చుకుని, తాను ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా తోటి మహిళలకు ఉపాధి అవకాశాలు చూపెడుతున్నారు.

పూల నుంచి ప్రేరణ

ప్రకృతిలో విరబూసిన పూల నుంచి రజని ప్రేరణ పొందారు. దానికి తనలోని సృజనాత్మక ఆలోచనలు జోడించి పర్యావరణ హితంగా ఉండే కాగితాల ద్వారా ''పేపర్ క్విల్లింగ్' ఆర్ట్ పై పట్టు సాధించారు. పలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి అక్కడ చదువుతున్న పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. వారికి ఈ కళ పట్ల అవగాహన కల్పిస్తూ ఉపాధి అవకాశాలను బోధిస్తున్నారు.

సింధు డిజైన్స్ పేరిట కుటీర పరిశ్రమ

శ్రీ ‘క్రియేషన్స్’ సంస్థను స్థాపించి క్రియేటివ్ క్రాఫ్ట్ అండ్ ఆర్ట్ శిక్షణ తరగతులను ఆఫ్ లైన్ – ఆన్ లైన్ నిర్వహిస్తున్నారు.‘సింధు డిజైన్స్’అనే పేరు మీద కుటీర పరిశ్రమను స్థాపించి పలు శుభకార్యాలకు అందమైన ఆకృతిలో పేపర్ బ్యాగులు, కాగితపు పూలతో చేసిన ఫ్లవర్ వాజ్ లు, బొకేలు పూలజడలు, పేపర్ క్విల్లింగ్ ఆర్ట్స్ తో చేసిన ఫొటో ఫ్రేములు, మైనంతో చేసిన కొవ్వొత్తులు తయారు చేస్తున్నారు. వాటిని విక్రయిస్తూ తోటి మహిళలకు ఆసరా కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.

- మచిలీపట్నంలోని పట్టాభి ఇనిస్టిట్యూట్ ద్వారా రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్ మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఆర్‌ఎస్‌ఈటీఐ) శిక్షణ తిస్తున్నారు.
- విజయవాడ ‘స్ఫూర్తి’ క్రియేటివ్ ఆర్ట్ స్కూల్‌లో 2013 నుంచి 2021 వరకు క్రియేటివ్ ఆర్ట్ టీచర్‌గా పనిచేసి వేల సంఖ్యలో చిన్నారులకు పేపర్ క్విల్లింగ్ ఆర్ట్ లో మెలకువలను నేర్పారు.
- ప్రస్తుతం ప్రముఖ మల్టీ మీడియా అండ్ ఎలక్ట్రానిక్ పబ్లిషర్స్ ‘ఆస్టాజెన్’ సంస్థలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్‌గా, సపోర్టివ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తూ నర్సరీ నుంచి పదవ తరగతి విద్యార్థులకు వీడియో పాఠాలను ప్రిపేర్ చేస్తున్నారు.
- చండీగఢ్‌కి చెందిన ప్రాచీన కళా కేంద్ర నుంచి దూరవిద్యలో ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ (భూషణ్) మొదటి సంవత్సరం పూర్తి చేశారు.
- 2021లో కాట్రేనికోనకి చెందిన క్రియేటివ్ హార్ట్స్ – ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ అకాడమీ వారు జాతీయస్థాయిలో నిర్వహించిన పోటీల్లో రజని రూపొందించిన రాధాకృష్ణ పేపర్ క్విల్లింగ్ ఆర్ట్‌కి అత్యుత్తమ పురస్కారం ‘గోల్డెన్ బ్రష్ అవార్డు’ దక్కింది.




మహిళలకు ఉపాధి కల్పించాలన్నదే లక్ష్యం

చిన్నతనం నుంచే కాగితాలతో ఏదో చేయాలని మక్కువ. అదే ఈ కళలో రాణించడానికి నాంది అయింది. ఈ కళ ద్వారా తోటి మహిళలకు ఉపాధి కల్పించాలన్నదే నా లక్ష్యం. శుభకార్యాలకు కళాకృతులు తయారు చేస్తూ పలువురికి ఉపాధి కల్పిస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది.

– మేడ రజని, పేపర్ క్విల్లింగ్ ఆర్టిస్ట్

నిద్రలేచి నిందలా?

- అశోక్‌గజపతిరాజు ఆనాడు నోరెందుకు తెరవలేదు?
- రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్



సాక్షి, రాజమహేంద్రవరం: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడంలో వైఎస్సార్‌సీపీ ఎంపీల పనితీరు బాగోలేదంటూ కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజు విమర్శించడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో కేంద్రమంత్రి హోదాలో ఉన్న ఆయన.. కేంద్రం స్పెషల్ ప్యాకేజీ ఇస్తామని ప్రకటిస్తే ఆనాడు నోరు మెదపకుండా నిద్రపోయారా అని ప్రశ్నించారు. అప్పుడు నిద్రపోయి, ఇప్పుడు నిద్రలేచినట్టు నిందలు వేస్తారా అని మండిపడ్డారు. ఆయన బుధవారం రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడారు. ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తేనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని నాడు చంద్రబాబు అన్నారని, దీనికి బదులు ఆనాడు ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తేనే సీఎంగా ప్రమాణ స్వీకారం, సంతకం చేస్తానని అంటే అప్పుడే వచ్చేది కదా అని ప్రశ్నించారు. చంద్రబాబు వల్లే రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. తాము అప్పటి టీడీపీ ఎంపీల్లా సన్నాయి నొక్కులు నొక్కడంలేదని, అవకాశం దొరికినప్పుడల్లా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉన్నామని గుర్తుచేశారు. ఉత్తర కుమారుడిలా ప్రగల్భాలు పలుకుతున్న లోకేశ్ భాష, బాధ ఏమిటో ఆయన వెంట తిరిగే వారికైనా అర్థమవుతోందా అని ప్రశ్నించారు. లోకేశ్ తన కుటుంబ సభ్యులకు అక్షరాభ్యాసం చేసేటప్పుడైనా బూతులు రాకుండా చూసుకోవాలని ఎద్దేవా చేశారు. కాపురం తెలంగాణలో, రాజకీయ డ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లోనా అని దుయ్యబట్టారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల మేర ఎంవోయూలు కుదరడం చూసి ప్రతిపక్షాలు ఏడుస్తున్నాయన్నారు. పారిశ్రామిక దిగ్గజాలు వస్తే అభినందించాల్సింది పోయి విమర్శించడం ద్వారా ప్రతిపక్షాల నైజం బహిర్గతమైందని పేర్కొన్నారు. ఎంపీ రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ‘నేను ఏకచిత్ర నటుడినైనా హీరోనే. నీకూ ఒక కామెడీ క్యారెక్టర్ ఇప్పిస్తా. నోరు అదుపులో పెట్టుకో రఘూ..’ అంటూ ఎంపీ భరత్ హెచ్చరించారు.


పల్లవి ఘోష్

మానవ అక్రమ రవాణను ఒంటి చేత్తో అడ్డుకుంటోంది పల్లవి ఘోష్. తను స్థాపించిన 'ఇంపాక్ట్ అండ్ డైలాగ్ ఫౌండేషన్' ద్వారా పది వేల మంది బాల బాలికలను, స్త్రీలను అక్రమ రవాణ నుంచి కాపాడగలిగింది. అస్సాంకు చెందిన పల్లవి ఘోష్ ఈశాన్య రాష్ట్రాల పోలీసులకు, సరిహద్దు భద్రతా దళాలకు సుపరిచితం. వారి సహాయంతో పల్లవి చేస్తున్న కృషికి ఎన్నో ప్రశంసలు లభిస్తున్నాయి.

యాంటీ ట్రాఫికింగ్ యాక్టివిస్ట్

కిడ్నాపర్లకు సింహస్వప్నం

'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' లెక్కల ప్రకారం భారత్‌లో 2021లో 77,535 మంది బాల బాలికలు 'మిస్' అయ్యారు. వీరిలో 59,544 మంది ఆడపిల్లలు. వీరంతా ఏమయ్యారు?

అంతులేని అక్రమం

'మన దేశంలో పేదరికం, వలసలు, వరదలు, అధిక సంతానం, ఇంటి సభ్యుల మధ్య సఖ్యతా, ప్రేమా లేకపోవడం... ఇవి ఉన్నంత కాలం మానవ అక్రమ రవాణా ఉంటుంది. ఆడపిల్లలను వ్యభిచారం కోసం, బలవంతపు పెళ్లిళ్ల కోసం కిడ్నాప్ చేస్తున్నారు. అబ్బాయిలను వెట్టి కార్మికులుగా మార్చడానికి తీసుకెళుతున్నారు. ఇవి ఆగాలంటే సమాజంలో చైతన్యం రావాలి' అంటోంది పల్లవి ఘోష్.

2013 నుంచి 2023 మధ్య కాలంలో పల్లవి ఘోష్ యాంటీ ట్రాఫికింగ్ యాక్టివిస్ట్‌గా దాదాపు 10 వేల మంది బాల బాలికలను, స్త్రీలను కాపాడింది. ఈమె కార్యరంగం అంతా ఈశాన్య రాష్ట్రాల్లో ఉంది. అక్కడి ట్రాఫికర్లకు పల్లవి పేరు చెబితే హడల్.

బాల్యంలో పడిన తొలిముద్ర

పల్లవి ఘోష్‌ది అస్సామ్‌లోని లుమ్‌డింగ్. ఏడవ క్లాస్‌లో ఉండగా వేసవి సెలవుల్లో బెంగాల్‌లోని మేనమామ ఇంటికి వెళ్లింది. 'అప్పుడు ఆ పల్లెటూళ్లో ఒకాయన తన కూతురి కోసం వెతుకుతూ తిరుగుతున్నాడు. ఎవరో అపరిచితుడు బైక్ మీద వచ్చి మాట కలిపి ఆ అమ్మాయిని తీసుకెళ్లాడని ఊళ్లో చెప్పుకున్నారు. ఆ వయసులో ఆ ఘటన నా మీద చాలా ముద్ర వేసింది' అంటుంది పల్లవి. ఢిల్లీలో డిగ్రీ చేసిన పల్లవి చెన్నై నుంచి 'జెండర్ ఇష్యూస్' మీద పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి హ్యూమన్ ట్రాఫికింగ్ నిరోధానికై పని చేసే ఢిల్లీ స్వచ్ఛంద సంస్థ 'శక్తివాహిని'లో 2013లో చేరింది.


తాను రక్షించిన పిల్లలతో పల్లవి

ఎన్నో అనుభవాలు

యాంటీ ట్రాఫికింగ్ యాక్టివిస్ట్‌గా పల్లవి ఎన్నో అనుభవాలు చూసింది. 'ఈశాన్య రాష్ట్రాల నుంచి తెచ్చి ఢిల్లీలో పని మనుషులుగా స్త్రీలను అమ్మేస్తారు. ఆ స్త్రీలను ఇంటి యజమానులు దారుణంగా హింసిస్తారు. అలాంటి వారిని ఎందరినో విడిపించాను. హర్యానాలో పెళ్లికూతుళ్లది పెద్ద సమస్య. అందుకని బెంగాల్, అస్సాం, నాగాలాండ్ వంటి రాష్ట్రాల నుంచి మహిళలను ఎత్తుకొచ్చి బలవంతంగా పెళ్లి చేసి ఇళ్ల లోపల ఉంచేస్తారు. పల్లెల్లో ఈ విషయం అందరికీ తెలిసినా ఎవరూ నోరు మెదపరు. అడ్డుకోరు. ఆశ్చర్యం ఏమంటే వయసు కూడా పట్టించుకోరు. 50 ఏళ్ల మహిళను కూడా ఎత్తుకొచ్చి హర్యానాలో పెళ్లి చేశారు' అంటుంది పల్లవి.

ప్రాణాలకు ప్రమాదమైనా

శక్తివాహినిలో ఏడేళ్లు పని చేశాక 2020లో సొంతగా 'ఇంపాక్ట్ అండ్ డైలాగ్' అనే ఎన్.జి.ఓ స్థాపించి యాంటీ ట్రాఫికింగ్ మీద పని చేస్తున్న పల్లవి ఈ పనిలో చాలా రిస్క్ ఉందని చెబుతుంది. 'ఆడపిల్లలను/స్త్రీలను ఇళ్ల నుంచి వ్యభిచార గృహాల నుంచి విడిపించడానికి వెళ్లినప్పుడు దారుణంగా ఎదురుదాడి చేస్తారు. చంపాలని చూస్తారు. అయితే పోలీసుల సహాయం లేకుండా నేను వెళ్లను. కొంతమంది బ్రోకర్లు నాకు నేరుగా ఫోన్ చేసి ఈ దాడులు మానేస్తే ఇల్లు కొనిస్తాం అని బేరానికి వచ్చారు. కోర్టులో ఒకడు నాకు కత్తి చూపించాడు' అంటుంది పల్లవి. అయినా సరే ఆమె తన కృషి మానలేదు.

డ్రైవర్లను చైతన్యవంతం చేయాలి

ఈశాన్య రాష్ట్రాల్లో పల్లవి ఊరూరు తిరిగి అక్కడి కార్మికులతో, కూలి మహిళలతో, స్కూలు విద్యార్థినులతో మాట్లాడుతుంది. తన సంస్థ వాలంటీర్ల ద్వారా పెద్ద సంఖ్యలో మహిళలను కలిసి మానవ అక్రమ రవాణా గురించి చెబుతుంది.

'అన్నింటి కంటే ముఖ్యం రిక్షావాళ్లను, క్యాబ్ డ్రైవర్లను, ఆటోవాళ్లను చైతన్యవంతం చేయాలి. ఎందుకంటే ఆడవాళ్లను ఎత్తుకుపోవాలంటే వీరి ద్వారానే పోవాలి. వీరు ఆపగలిగితే సగం కేసులు ఆగిపోతాయి' అంటుంది పల్లవి. ఆడపిల్లల అక్రమ రవాణాను నిరోధించడం ఒకెత్తయితే తిరిగి పట్టుకొచ్చాక వారికి కొత్త జీవితాలు ఇవ్వడం ఒకెత్తు. 'తీసుకొచ్చిన వారిని షెల్టర్ హోమ్స్‌లో పడేయడం సరి కాదు. ఆ హోమ్స్‌లో రకరకాల అనుభవాల పిల్లలు ఉంటారు. వారందరూ కలిసి ఉండటం వల్ల పిల్లలు ఆరోగ్యకరమైన మానసిక స్థితితో ఎదగలేరు' అంటుంది పల్లవి.

● కొత్త దారి

కళారాజభవనం


కాంతులీనే రాజభవనం





ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో బరిపడ పట్టణంలో ఉన్న 1804 కాలానికి చెందిన అందమైన రాజభవనంలోకి వెళ్లే అవకాశం కొందరికి మాత్రమే ఉండేది. రాజవంశీకులు వివిధ ప్రాంతాలలో స్థిరపడిన తరువాత ఈ రాజభవనం కళావిహీనమై ఒంటరి ద్వీపంలో మౌనముద్రతో కనిపించేది.

అలాంటి రాజభవనంలోకి మళ్లీ కళ తీసుకువచ్చారు అక్షిత, మృణాళిక అనే అక్కాచెల్లెళ్లు.

ఇప్పటి ఆ ప్రత్యేకత ఏమిటంటే సామాన్యులు కూడా ఈ రాజభనంలోకి అడుగు పెట్టడం.

స్థానిక సంస్కృతి, కళలను ప్రోత్సహించడంతో పాటు అ భవనం పర్యాటకులను ఆకర్షించే పర్యాటక కేంద్రంగా మారింది.

రాజవంశీకులైన అక్షిత, మృణాళికలు కోల్‌కత్తాలో చదువుకొని, పై చదువులకు విదేశాలకు వెళ్లారు. అక్షిత పొలిటికల్ సైన్స్, హ్యూమన్‌రైట్స్, మృణాళిక సోషియాలజీ చదువుకుంది. సెలవుల్లో మాత్రమే ఈ రాజభవనానికి వచ్చేవాళ్లు. ఈ ప్యాలెస్ పూర్వవైభవం గురించి తల్లిదండ్రులు, తాతల నుంచి ఎన్నో అద్భుత విషయాలు విన్నారు. అలాంటి ప్యాలెస్ కాస్త కళావిహీనంగా మారడంతో తమ వంతుగా ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నారు.

'మనం ఏమీ చేయలేము. అదంత తేలికైన విషయం కాదు' అని నిరాశ పరిచారు తల్లిదండ్రులు.

అయిన వెనక్కి తగ్గలేదు ఈ అక్కాచెల్లెళ్లు. గత వైభవం ఆనవాళ్లు చెరిగిపోకుండా సకల జాగ్రత్తలు తీసుకొని పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఒరిజినల్ స్ట్రక్చర్‌ను అలాగే పెట్టి మార్పులు చేశారు. వందల సంవత్సరాల నాటి కళాకృతులకు బూజు దులిపి వెలుగు తీసుకువచ్చారు. వివిధ రకాల కళాకృతులు తయారు చేయడానికి చేతివృత్తి కళాకారులందరికీ ఈ రాజభవనం కేంద్రం అయింది. రాజభవనాన్ని బొటీక్ హోటల్‌గా మార్చడం ద్వారా ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని అనుకున్నారు.


అక్షిత, మృణాళిక

'నక్సల్స్ ప్రభావిత ప్రాంతంలో ఉన్న ఇక్కడికి ఎవరు వస్తారు?' అని చాలా మంది భయపెట్టారు.

తమ నిర్ణయంపై నమ్మకంతో వారి మాటలను పట్టించుకోలేదు అక్షిత, మృణాళికలు.

అయిదు సంవత్సరాల తరువాత...

రాజభవనం పూర్వంలాగే చిద్విలాసంగా ఉంది. మనుషుల రాకపోకలతో సందడి సందడిగా ఉంది. ఒడిశాకు వచ్చే పర్యాటకులకు 'చూడాల్సిన ప్యాలెస్' జాబితాలో మయూర్‌భంజ్ ప్యాలెస్ చేరింది. ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు రావడం వల్ల స్థానిక కళాకృతులకు గిరాకీ పెరిగింది. స్థానిక కళాకారులు వచ్చి తమ కళారూపాలను ఇక్కడ ప్రదర్శిస్తారు.

కనువిందు చేసే ఆకర్షణలే కాదు చవులూరించే స్థానిక వంటకాలకు కూడా రాజభవనం వేదిక అయింది. చిరుధాన్యాలతో చేసే వంటకాల రుచులు ప్రత్యేక ఆకర్షణగా మారాయి.

భయం, నిరాశల కంటే 'ఆశ' అనేది వంద రెట్లు పదునైనది. బలమైనది. స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్)లో మహిళల ప్రాతినిధ్యం తగినంత లేదనే నిరాశ స్వరం వినిపిస్తున్న నేపథ్యంలో నేటి తరం అమ్మాయిలు సాంకేతికరంగంపై చూపుతున్న ఆసక్తి, ఆవిష్కరణలు కొత్త భవిష్యత్‌కు ఊపిరి పోస్తున్నాయి.

అవును...ఆశయం నెరవేరుతుంది!

యూత్ పల్స్

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) రిపోర్ట్ ప్రకారం 75 శాతం మంది ఉద్యోగులు రాబోయే కాలంలో స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్)కు సంబంధించి ఉంటారు. ఇప్పటికైతే 'స్టెమ్'లో పురుషులతో పోల్చితే మహిళల ప్రాతినిధ్యం తక్కువగా కనిపిస్తోంది.

అయితే శాస్త్రీయరంగంలో ఈతరం అమ్మాయిల ఆవిష్కరణలు చూస్తుంటే సాంకేతికత, ఆవిష్కరణల విషయంలో లింగసమానత్వం అనేది కచ్చితంగా సాధ్యమే అనిపిస్తోంది.

'క్వెస్ట్ అలయెన్స్' స్వచ్ఛంద సంస్థ, ఐబీఎం-ఇండియాతో కలిసి దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన 'స్టెమ్ ఫర్ గర్ల్స్ హ్యాక్‌థాన్'లో ఎంతోమంది అమ్మాయిలు పాల్గొన్నారు. శాస్త్రీయ ఆలోచనలు, ఆవిష్కరణలకు ఈ హ్యాక్‌థాన్ వేదిక అయింది.

రెండు నెలల పాటు సాగిన ఈ వర్క్‌షాప్‌లలో శానిటరీ డిస్పోజల్ మిషన్ (విష వాయువులను నిరోధించే యంత్రం), వీధుల్లో ఉన్న చెత్తను సేకరించే గార్బేజ్ కలెక్టర్, బియ్యంలో రాళ్లు ఏరివేసే డీస్టోన్, సౌరశక్తితో పనిచేసే సెల్ఫ్-ఆపరేటెడ్ డిష్ వాషర్, మల్టీ పర్పస్ క్లీనింగ్‌టూల్ ... ఇలా ఎన్నో కొత్త పరికరాలను అమ్మాయిలు తయారుచేశారు.

ఈ వర్క్‌షాప్‌తో సంబంధం లేకుండా తమ ఆవిష్కరణలతో వార్తల్లో నిలిచిన వాళ్లు ఎంతోమంది ఉన్నారు.

మధ్యప్రదేశ్‌లోని పన్నా పట్టణానికి చెందిన నిషి గోస్వామి వైద్యసమాచారానికి ఉపకరించే ఏఐ ఆధారిత యాప్‌కు రూపకల్పన చేసింది.

తమిళనాడులోని తిరువణ్ణామలైకి చెందిన వినిష సోలార్ ఐరన్ బండిని తయారుచేసి 'శభాష్' అనిపించుకుంది.

భోపాల్‌కు చెందిన సీనియర్ ఇంటర్ స్టూడెంట్ అనుష్క శ్రీవాస్తవ ఎకో-ఫ్రెండ్లీ వాటర్‌బాటిల్ తయారుచేసింది. ఉత్తరాఖండ్‌లోని పటా గ్రామానికి చెందిన బీఎస్సీ విద్యార్థి మనీష రమోలా ఔషధ మొక్కలకు సంబంధించిన లోతైన సమాచారాన్ని అందించే ఏఐ ఆధారిత యాప్‌కు రూపకల్పన చేసింది. బెంగళూరుకు చెందిన



దిగాంతిక బోస్ 'వైరస్ డెస్ట్రాయిడ్ మాస్క్' తయారుచేసింది.

నిషి గోస్వామి నుంచి దిగాంతిక బోస్ వరకు తరగతి గదిలో పాఠాలు మాత్రమే వినలేదు. ఆనంది భాయి గోపాలరావు జోషి, అసిమా ఛటర్జీలాంటి ఎంతోమంది అలనాటి ప్రసిద్ధ శాస్త్రవేత్తల నుంచి, నేటి తరానికి కొత్త శక్తిని ఇస్తున్న 'నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్' తొలి మహిళా అధ్యక్షురాలు దేబ్‌జానీ ఘోష్, ఐబీఎం, ఇండియా ఆవిష్కరణలలో రెండు దశబ్దాల భాగస్వామిగా ఉన్న గార్గీ దాస్ గుప్తా, ఐటీ విభాగంలో మూడు దశబ్దాల అనుభవం ఉన్న అమృత గంగోత్ర, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ తొలి మహిళా డైరెక్టర్ సంఘమిత్ర బందోపాధ్యాయ లాంటి ఎంతో మంది స్ఫూర్తిదాయక విజేత గురించి విని ఉన్నారు.

స్ఫూర్తి ఉన్న చోట కొత్త ఆలోచన మొదలవుతుంది. కొత్త ఆవిష్కరణకు బీజం పడుతుంది. భవిష్యత్‌పై కొత్త ఆశను రేకెత్తిస్తుంది.

సైబర్ టాక్

ఈ వేధింపులనూ రిపోర్ట్ చేయండి!

వినీత్ (పేరు మార్చడమైనది) సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగి. అతను తన సహచరుడు ప్రేమించుకున్నారు. వారిద్దరూ కలిసి బతకాలని నిర్ణయం తీసుకున్నారు. కుటుంబ సభ్యులు కూడా చివరకు వారి నిర్ణయానికి ఆమోదం తెలిపారు. కానీ, 'మగవాళ్లు ఇద్దరూ పెళ్లి చేసుకుంటున్నారట..' అనే వ్యంగ్యపు మాటలు వారిని బాధిస్తున్నాయి. అంతేకాదు, సోషల్ మీడియాలో వారికి సంబంధించిన వార్తలు, వ్యతిరేక కామెంట్లు, లైంగికపరమైన చర్చలు జరుపుతుండటంతో వారిలో ఆందోళన మొదలైంది. 'మేం, మాలాంటి వారంతా గౌరవంగా బతకాలనుకుంటున్నాం. ఉద్యోగాలు చేసుకుంటున్నాం. అలాంటప్పుడు మా ఎదుగుదలకు సంబంధించి కాకుండా, లైంగికపరంగా మమ్మల్ని దిగజార్చే మాటలే ఎందుకు పదే పదే వస్తున్నాయి. ఈ బాధించే మాటలు, వీడియోల నుంచి మాకు విముక్తి ఎప్పుడు?' అంటూ ప్రశ్నిస్తున్నారు.

• • •

మాయ ట్రాన్స్‌జెండర్. ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తోంది. సమాజంలో తమ వర్గాన్ని తక్కువగా చూస్తారన్న భయం ఆమెలో లేకపోలేదు. దానికి తోడు యూ ట్యూబ్ చూస్తున్నప్పుడల్లా ఆమెను వేల ప్రశ్నలు చుట్టుముడుతున్నాయి. వీడియోలు వైరల్ అవడం కోసం తమ వర్గానికి చెందిన వారిని లైంగికపరమైన విషయాలమీదనే ఫోకస్ చేస్తున్నారనేది ఆమె బాధ. దీనివల్ల సహచర ఉద్యోగుల్లోనూ, చుట్టుపక్కల కుటుంబాల్లోనూ తనను కూడా అదే విధంగా చూస్తారని, నాలాగ బాధపడుతున్నవారు ఎంతో మంది ఉన్నారంటోంది మాయ.

• • •


ప్రతీకాత్మక చిత్రం

ఇది నేటి సమాజంలో అణచివేతకు గురికాబడుతున్న మరో వర్గంగా స్వలింగ సంపర్కులు, ట్రాన్స్‌జెండర్లను ప్రధానంగా చూస్తుంటాం. ఎల్‌జిబిటిక్యూఐఎ అనే పేరుతో వీరు హైదరాబాద్‌లోని బేగంపేట్‌లో తమ సమస్యలను విన్నవించుకుంటూ ఓ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా వస్తున్న ఈ జుగుప్సాకరమైన కంటెంట్ కలిగించే ఆందోళనను ఓ సున్నితమైన అంశంగా పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు. తమ వర్గం వారిలోనూ డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, ఇతర ఉన్నతోద్యోగాలు చేసుకుంటున్న వారు ఉన్నారని, తమ విజయగాధలను తెలియజేయమని ఈ సందర్భంగా వారు వేడుకున్నారు.

వైరల్ ప్రధానమా?

సోషల్ మీడియా ద్వారా డబ్బు రావాలంటే ఇప్పుడు యూ ట్యూబ్ అనేది ఒక సాధనం అని మనకు తెలిసిందే. ఎంత వైరల్ అయ్యే అంశాలు ఉంటే ఆ వీడియో ద్వారా అంత డబ్బు, దానితో పాటు పేరు వస్తుందని చాలా మందికి తెలుసు. అందుకే, ఆసక్తిని రేకెత్తించే అంశం ఏమిటో దానినే వీడియో అప్‌లోడ్ చేసేవారు ఎంచుకుంటారు. దీనితో పాటు వెబ్‌సైట్స్ ఇతర సామాజిక మాధ్యమాలు కూడా వార్త వైరల్ అయ్యేందుకు ఈ అంశాలను ఎంచుకుంటాయి.

సైబర్ వేధింపులు

సామాజిక మాధ్యమాల్లో మహిళలే అధిక వేధింపులకు లోనవుతుంటారు. అయితే, ఇటీవల పెరుగుతున్న పరిణామాల్లో ఎల్‌జిబిటిక్యూఐ+ కూడా చేరుతోంది. ఆఫ్‌లైన్‌లో జాతి, మత, వర్గంలో ఉండే విభేధాలు ఆన్‌లైన్‌లోనూ చూస్తుంటాం. డిజిటల్ యుగంలో తమ ఉనికిని చాటుకునే రోజుల్లో ఉన్నాం కాబట్టి ఎంచుకునే అంశాలు మరింత సున్నితంగా, తోటి వారి గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

సహాయం కోసం వీరిని సంప్రదించవచ్చు

రకరకాల సామాజిక మాధ్యమాల ద్వారా, సమాజంలో తమ గౌరవం దెబ్బతింటుందని, ఇతరులు తమను వేధింపులకు లోను చేస్తున్నారని అవి సమస్యగా తమ జీవనానికి అడ్డంకిగా ఉందనుకుంటే...

1. చట్టపరమైన రక్షణ కోసం 100కి కాల్ చేసి, పోలీసుల సాయం పొందవచ్చు.
2. జాతీయ/రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) అనేది జాతీయస్థాయి ప్రభుత్వ సంస్థ. మానవ హక్కుల ఉల్లంఘనలను ఈ సంస్థ ప్రత్యేకంగా పరిశీలిస్తుంది. ఎల్‌జిబిటిక్యూ+ వ్యక్తులైన వారు తమకు తగిన సహాయం కావాలంటే వీరిని సంప్రదించవచ్చు.
3. మహిళల కోసం జాతీయ /రాష్ట్ర కమిషన్: నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ (ఎన్‌సీడబ్ల్యూ) అనేది లైంగిక నేరాలు, గృహహింస, వేధింపులు .. మొదలైన వాటి నుంచి మహిళల రక్షణలో పనిచేసే జాతీయస్థాయి ప్రభుత్వ సంస్థ. ఈ ఎన్‌సీడబ్ల్యూ కూడా తగిన సహాయం చేస్తుంది.
4. ఆన్‌లైన్ క్రైమ్ రిపోర్టింగ్ (ఆన్‌లైన్‌లో చేసిన వేధింపుల కింద) https://www.cybercrime.gov.in లోనూ రిపోర్ట్ చేయవచ్చు.

– సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఎవరికి రిపోర్ట్ చేయాలి?

సామాజిక మాధ్యమాల ద్వారా తమ గౌరవానికి భంగం కలిగించే అంశాలు ఉంటే రిపోర్ట్ చేయాల్సింది..

ఫేస్‌బుక్ ..
https://www.facebook.com/help/116326365118751

ట్విటర్ ...
https://help.twitter.com/en/safety-and-security/report-abusive-behavior

ఇన్‌స్టాగ్రామ్–యూట్యూబ్
https://help.instagram.com/547601325292351https://support.google.com/youtube/answer/2801939#protected_group

లింక్డ్ఇన్:
https://www.linkedin.com/help/linkedin/answer/a1336329/report-harassment-or-a-safety-concern?lang=en

పైన ఇచ్చిన సోషల్‌మీడియా లింక్స్ ద్వారా ఆయా విభాగాలకు రిపోర్ట్ చేయవచ్చు. దానిపైన ఆ మాధ్యమాలు తగు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.


అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

బ్యూటిప్స్

- అర లీటరు నీటిలో రెండు స్పూన్ల ఉసిరిపొడి, టీస్పూను నిమ్మరసం కలిపిన మిశ్రమాన్ని ప్రతిరోజూ తలకు రాసుకుని తలస్నానం చేస్తే, అతి తక్కువ సమయంలో అందమైన నల్లని జుట్టు మీ సొంతమవుతుంది.
- ఒక కప్పు బీట్‌రూట్ రసంలో అరకప్పు పెరుగు, పావుకప్పు బాదం నూనె, చెంచా ఉసిరిక పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లకు పట్టించి, అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. నెలకు రెండుసార్లయినా ఇలా చేస్తే జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.



- పెరుగులో ఒక స్పూను తేనె, రెండు స్పూన్ల నిమ్మకాయ రసం కలిపి తలకి పట్టించి ఒక అరగంట తర్వాత తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.
- పుదీనా ఆకులను రుబ్బి నీళ్లు కలిపి మాడుకు పట్టించి కొంతసేపటి తరువాత తలస్నానం చేస్తే చుండ్రు సమస్య ఉండదు.
- గుడ్డు తెల్లసొనను తలకు పట్టించి... గంట తరువాత స్నానం చేస్తే చుండ్రు తగ్గుతుంది.



పోరాడి ఓడిన సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. బెంగళూరులో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సహజ 6-7 (8/10), 3-6తో డయానా మర్సిన్‌కెవిచా (లాత్వియా) చేతిలో ఓడిపోయింది. గంటా 38 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. మరో మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ అంకితా రైనా 6-3, 6-0తో వన్షిత (భారత్)పై నెగ్గి రెండో రౌండ్‌కు చేరింది.

లక్ష్య సేన్‌కు షాక్

జర్మన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి ఆటగాడు, ప్రపంచ 12వ ర్యాంకర్ లక్ష్య సేన్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 41వ ర్యాంకర్ క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) 21-19, 21-16తో ఆరో సీడ్ లక్ష్య సేన్‌ను బోల్తా కొట్టించి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. పొపోవ్‌పై గతంలో నాలుగుసార్లు నెగ్గిన లక్ష్య సేన్ రెండోసారి ఓటమి చవిచూశాడు.



చివరి పంచ్ ఎవరిదో!

బోర్డర్-గావస్కర్ ట్రోఫీ తొలి రెండు టెస్టుల్లో భారత జట్టు ఆటను చూస్తే 4-0 ఖాయమనిపించింది. అయితే ఒక్కసారిగా పుంజుకున్న ఆస్ట్రేలియా మూడో టెస్టు గెలవడంతో పాటు చివరి మ్యాచ్‌ను కూడా ఆసక్తికరంగా మార్చేసింది. అన్ని రంగాల్లో ప్రత్యర్థికంటే పైచేయిగానే కనిపిస్తున్నా నాలుగో టెస్టులో రోహిత్ సేన విజయం సాధిస్తుందని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. గత మ్యాచ్ గెలుపు ఇచ్చిన ఉత్సాహంతో స్మిత్ బృందం సానుకూల దృక్పథంతో పోరుకు సై అంటోంది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని అతి పెద్ద క్రికెట్ స్టేడియంలో సిరీస్‌కు ఆసక్తికర ముగింపు ఖాయం. ఇరు దేశాల ప్రధానమంత్రులు హాజరు కానుండటం కూడా తొలి రోజు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది.

- నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా నాలుగో టెస్టు
- డబ్ల్యూటీసీ ఫైనల్ లక్ష్యంగా టీమిండియా
- సిరీస్ సమంపై కంగారూల దృష్టి
- మ్యాచ్‌కు హాజరుకానున్న రెండు దేశాల ప్రధానులు
- ఉదయం గం.9:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



కుల్దీప్ యాదవ్, సిరాజ్, రోహిత్ శర్మ

అహ్మదాబాద్: టెస్టు క్రికెట్‌లో అత్యంత హోరాహోరీ సమరాల్లో ఒకటైన భారత్, ఆస్ట్రేలియా పోరు చివరి అంకానికి చేరింది. సిరీస్‌లో ఇప్పటికే ఆధిక్యంలో ఉన్న భారత్ మరో మ్యాచ్ గెలిచి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించాలని పట్టుదలగా ఉండగా... గత కొన్నేళ్లలో ఏ పర్యాటక జట్టుకూ సాధ్యంకాని రీతిలో సిరీస్‌లో రెండు టెస్టులు నెగ్గిన ఘనతను సొంతం చేసుకోవాలని ఆసీస్ భావిస్తోంది. ఇండోర్ టెస్టు అనుభవం దృష్ట్యా టీమిండియా పూర్తిగా స్పిన్ పిచ్ వైపు మొగ్గు చూపకపోవచ్చు. కాబట్టి ఈ మ్యాచ్‌లో ఇరు జట్లకు సమాన అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు.

భరత్ చోటు పదిలం!

ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు చూస్తే భారత బ్యాటర్లకు బాగానే పరీక్ష పెట్టింది. రోహిత్ మినహా మరెవరూ సెంచరీ సాధించలేకపోగా, పుజారా ఒకే ఒక అర్ధ సెంచరీ చేశాడు. కోహ్లి అయితే అది కూడా లేదు. బౌలర్ల చలవతో రెండు టెస్టుల్లోనూ భారత్ విజయాన్ని అందుకోగలిగింది. ఇంకా చెప్పాలంటే అక్షర్ పటేల్ చేసిన రెండు అర్ధసెంచరీలు, జడేజా హాఫ్ సెంచరీ జట్టును ఆదుకున్నాయి. లోయర్ ఆర్డర్ భాగస్వామ్యం లేకపోతే పరిస్థితి భిన్నంగా ఉండేదేమో. ఈ నేపథ్యంలో ప్రధాన బ్యాటర్లంతా ఈ మ్యాచ్‌లోనైనా తమ స్థాయికి తగిన ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. చాలా కాలంగా టెస్టుల్లో విఫలమవుతున్న కోహ్లి తన సత్తా చాటేందుకు ఇదే సరైన అవకాశం. గిల్ కూడా తనకు దక్కిన అవకాశాన్ని వాడుకోవాల్సి ఉంది. మరోవైపు వికెట్ కీపర్‌గా ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ భరత్‌ను తప్పించి ఇషాన్ కిషన్‌ను ఆడించే అవకాశాలు ఉన్నాయని వినిపించింది. అయితే మీడియా సమావేశంలో రోహిత్ చెప్పినదాన్ని బట్టి చూస్తే భరత్ కొనసాగడం ఖాయం. భరత్ బ్యాటింగ్ సంతృప్తికరంగా లేకపోయినా... బ్యాటింగ్‌లో సమష్టి వైఫల్యం కనిపిస్తున్నప్పుడు ఒక్క భరత్‌నే నిందించడంలో అర్థం లేదనే కారణంతో పాటు కీపర్‌గా మెరుగైన నైపుణ్యం ఉండటం భరత్‌కు కలిసి రానుంది. బౌలింగ్‌లో జట్టులో ఒక మార్పు చోటు చేసుకోవచ్చు. గత టెస్టులో విశ్రాంతి తీసుకున్న షమీ నేరుగా రానుండగా... అతని కోసం సిరాజ్‌ను పక్కన పెట్టే అవకాశం ఉంది. ఉమేశ్ ఇండోర్ టెస్టులో చక్కటి బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈ మైదానంలో ఆడిన రెండు టెస్టుల్లోనే 20 వికెట్లు తీసిన అక్షర్ పటేల్‌పై అందరి దృష్టి నిలిచింది. ఈ మైదానం అతనికి సొంత గ్రౌండ్ కూడా కావడం విశేషం.



స్మిత్

మార్పుల్లేకుండా...

గెలిచిన జట్టులో మార్పులు చేయకూడదనేది సహజ సూత్రం. అరుదైన విజయం సాధించిన ఆస్ట్రేలియా కూడా అందుకు మినహాయింపేమీ కాదు. స్పిన్‌కు మరీ అనుకూలించే పిచ్ కాకపోయినా ముగ్గురు స్పిన్నర్లు లయన్, మర్ఫీ, కునెమన్‌లను కంగారూ టీమ్ మేనేజ్‌మెంట్ నమ్ముకుంది. అదనపు బ్యాటర్ కోసం ప్రధాన పేసర్ స్టార్క్‌ను పక్కన పెట్టే ప్రతిపాదన వచ్చినా... మరీ ఒక్క పేసర్ కూడా లేకుండా ఆడటం జట్టును లోపంగా మారవచ్చు. స్టార్క్‌తో పాటు గ్రీన్‌లాంటి మీడియం పేస్ ఆల్‌రౌండర్ ఉండటంతో రెండో రెగ్యులర్ పేసర్ అవసరం లేదు. బ్యాటింగ్‌లోనైతే ఆసీస్ నిశ్చింతగా ఉంది. 1-8 స్థానాల వరకు ఎలాంటి మార్పు అవసరం లేకుండా ఆ జట్టు బ్యాటింగ్ బృందం నిలదొక్కుకుంది. ఉస్మాన్ ఖాజా ఈ సిరీస్‌లో అందరికంటే మెరుగైన ప్రదర్శన కనబర్చగా... హెడ్, హ్యాండ్స్‌కాంబ్ రాణించారు. ఎన్నో అంచనాలతో భారత్‌లో అడుగు పెట్టిన లబుషేన్ ఒక భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. 2017 తరహాలో అద్భుతమైన బ్యాటింగ్‌ను ప్రదర్శించకపోయినా స్మిత్ అందరికంటే కీలకం అనడంలో సందేహం లేదు. ముఖ్యంగా అతని నాయకత్వం కారణంగానే ఆసీస్ గత మ్యాచ్ గెలిచింది. ఈ సారి అతను టీమ్‌ను ఎలా నడపిస్తాడనేది ఆసక్తికరం.



ఆ ఇద్దరు అతిథులుగా...

భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ కలిసి నాలుగో టెస్టు తొలి రోజు ఆటను మైదానంలో వీక్షించనున్నారు. ఇందు కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొదటి సెషన్ సమయంలోనే వీరిద్దరు అక్కడ ఉంటారు. మరోవైపు ఈ మ్యాచ్ ప్రేక్షకుల హాజరులో కూడా కొత్త రికార్డు నెలకొల్పే అవకాశం ఉంది. ఒకరోజు ఆటకు హాజరైన ప్రేక్షకుల సంఖ్య 91,112 ప్రస్తుతం రికార్డుగా ఉంది (2013 మెల్‌బోర్న్‌లో యాషెస్ టెస్టు). అయితే ఇప్పటి వరకు టికెట్ల అమ్మకాలను బట్టి చూస్తే మోదీ స్టేడియంలో కొత్త రికార్డు నమోదు కావచ్చు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శుబ్‌మన్ గిల్, పుజారా, కోహ్లి, శ్రేయస్, జడేజా, శ్రీకర్ భరత్, అశ్విన్, అక్షర్ పటేల్, షమీ, ఉమేశ్ యాదవ్. **ఆస్ట్రేలియా:** స్మిత్ (కెప్టెన్), హెడ్, ఖాజా, లబుషేన్, హ్యాండ్స్‌కాంబ్, గ్రీన్, క్యారీ, స్టార్క్, మర్ఫీ, నాథన్ లయన్, కునెమన్.

పిచ్, వాతావరణం

గత మూడు టెస్టులతో పోలిస్తే ఇది బ్యాటింగ్‌కు కాస్త అనుకూలమైన పిచ్. స్పిన్ ప్రభావం ఉన్నా... మరీ మొదటి రోజునుంచే టర్న్ కాకపోవచ్చు. భారత్‌లో చాలా మైదానాల తరహాలో ఆట సాగుతున్నకొద్దీ నెమ్మదిస్తుంది. టాస్ గెలిచిన జట్టు తొలుత బ్యాటింగ్ చేసుకోవడం సురక్షితం.

గుజరాత్ జెయింట్స్ తొలి విజయం

- సోఫియా దంక్లీ, హర్లీన్ మెరుపులు
- బెంగళూరుకు 'హ్యాట్రిక్' ఓటమి



దంక్లీ



హర్లీన్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో గుజరాత్ జెయింట్స్ ఖాతాలో తొలి విజయం చేరింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 11 పరుగుల తేడాతో నెగ్గింది. ముందుగా గుజరాత్ జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 201 పరుగులు చేయగా... 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసి ఓడిపోయింది. బెంగళూరు జట్టులో సోఫీ డివైన్ (45 బంతుల్లో 66; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఎలీస్ పెరీ (25 బంతుల్లో 32; 5 ఫోర్లు), హీథెర్ నైట్ (11 బంతుల్లో 30 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ప్రయోజనం లేకపోయింది. గుజరాత్ బౌలర్లలో గార్డ్‌నర్ (3/31) రాణించింది. బెంగళూరు జట్టుకిది వరుసగా మూడో ఓటమి. స్నేహ్ రాణా సారథ్యంలోని గుజరాత్ జెయింట్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఆంధ్ర అమ్మాయి సబ్బినేని మేఘన (11 బంతుల్లో 8; 2 ఫోర్లు) తక్కువ స్కోరుకే వెనుదిరగ్గా... సోఫియా డంక్లీ (28 బంతుల్లో 65; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు), హర్లీన్ డియోల్ (45 బంతుల్లో 67; 9 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు వేగంతో అర్ధ సెంచరీలు నమోదు చేశారు. ప్రీతి బోస్ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో డంక్లీ వరుస బంతుల్లో 4,6,4,4,4తో 22 పరుగులు సాధించింది. యాష్లే గార్డ్‌నర్ (19; 2 ఫోర్లు), హేమలత (16; 2 ఫోర్లు, 1 సిక్స్), అనాబెల్ సదర్లాండ్ (14; 1 ఫోర్, 1 సిక్స్) కూడా రాణించడంతో గుజరాత్ స్కోరు 200 దాటింది. ఈ టోర్నీలో ఓ జట్టు 200 పరుగులు దాటడం ఇది నాలుగోసారి. బెంగళూరు బౌలర్లలో శ్రేయంక పాటిల్, హీథెర్ నైట్ రెండు వికెట్ల చొప్పున తీశారు.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

ముంబై ఇండియన్స్ X ఢిల్లీ క్యాపిటల్స్
రాత్రి గం. 7:30 నుంచి
స్పోర్ట్స్ 18 చానెల్‌లో,
జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

బుమ్రా... ఆరు నెలలు ఆటకు దూరం

భారత బౌలర్‌కు న్యూజిలాండ్‌లో శస్త్ర చికిత్స



అహ్మదాబాద్: భారత అగ్రశ్రేణి పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆరు నెలలు క్రికెట్‌కు దూరం కానున్నాడు. వెన్ను నొప్పి గాయంతో బాధపడుతున్న 29 ఏళ్ల బుమ్రాకు బుధవారం న్యూజిలాండ్‌లోని క్రైస్ట్‌చర్చ్‌లో డాక్టర్ రోవన్ షౌటెన్ నిర్వహించిన శస్త్రచికిత్సవిజయవంతమైంది. ఈ గాయం నుంచి కోలుకోవడానికి బుమ్రాకు ఆరు నెలల సమయం పట్టనుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్‌లో జరిగే ఆసియా కప్ వన్డే టోర్నీకి అతను అందుబాటులో ఉండటంలేదు. అయితే భారత్ వేదికగా అక్టోబర్-నవంబర్‌లలో జరిగే వన్డే ప్రపంచకప్ మెగా టోర్నీ సమయానికి బుమ్రా పూర్తిస్థాయిలో కోలుకుంటాడని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

దక్షిణాఫ్రికా 311/7



మార్క్‌రమ్

జొహన్నెస్‌బర్గ్: వెస్టిండీస్‌తో బుధవారం మొదలైన రెండో టెస్టులో... తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 89.2 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 311 పరుగులు సాధించింది. మార్క్‌రమ్ (139 బంతుల్లో 96; 17 ఫోర్లు), టోనీ డి జార్జి (155 బంతుల్లో 86; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. మార్క్‌రమ్ తొలి వికెట్‌కు డీన్ ఎల్గర్ (54 బంతుల్లో 42; 7 ఫోర్లు)తో కలిసి 76 పరుగులు... రెండో వికెట్‌కు టోనీ డి జార్జితో 116 పరుగులు జోడించాడు. విండీస్ బౌలర్లలో గుడకేశ్ మోతీ మూడు వికెట్లు, కైల్ మేయర్స్ రెండు వికెట్లు తీశారు.

శ్రీజకు నిరాశ



సింగపూర్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ సింగపూర్ స్మాష్ టోర్నీలో భారత్‌కు ఆడుతున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించలేకపోయింది. బుధవారం జరిగిన మహిళల క్వాలిఫయింగ్ సింగిల్స్ రెండో మ్యాచ్‌లో జాతీయ చాంపియన్ శ్రీజ 12-10, 6-11, 9-11, 3-11తో జూ చెన్‌హుయ్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో హైదరాబాద్ కుర్రాడు స్నేహిత్ సూరావజ్జుల 11-4, 7-11, 10-12, 11-6, 11-8తో జేవియర్ డిక్సన్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు.

సినిమా

లేడీస్ స్పెషల్



సమంత
అనుష్క
హన్సిక

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'లేడీస్ స్పెషల్' అంటూ కొత్త పోస్టర్స్‌తో ఇండస్ట్రీ కళకళలాడింది.
ఆయా చిత్రబృందాలు వారి సినిమాల్లోని కథానాయికల పోస్టర్స్‌ను రిలీజ్ చేశాయి. ఆ పోస్టర్స్ పై ఓ లుక్ వేయండి.

ఫారిన్ అన్విత

ఫారిన్ వీధుల్లో ఎంచక్కా హ్యాపీగా వాక్ చేస్తున్నారు మిస్ అన్వితా రవళి శెట్టి. ఆమె సంతోషానికి గల కారణాలను వేసవిలో థియేటర్స్‌లో చూడాల్సిందే. అనుష్కా శెట్టి, నవీన్ పొలిశెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం వేసవిలో రిలీజ్ కానుంది. కాగా ఈ చిత్రంలో చెఫ్ అన్విత రవళి పాత్రలో అనుష్క నటిస్తున్నారు. అన్విత కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.

శకుంతల ప్రేమ

ప్రముఖ కవి కాళిదాసు రచించిన ప్రేమకావ్యం 'అభిజ్ఞాన శాకుంతలం' ఆధారంగా రూపొందిన చిత్రం 'శాకుంతలం'. ఇందులో శకుంతలగా సమంత, దుష్యంత మహారాజుగా మలయాళ నటుడు దేవ్ మోహన్ నటించారు. గుణశేఖర్ దర్శకత్వంలో 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 14న విడుదల కానుంది. ఈ చిత్రంలోని సమంత కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అలాగే బుధవారం నుంచి సమంత 'ఖుషి' చిత్రం షూటింగ్‌లో పాల్గొంటున్నారు.

ప్రమాదానికి చేరువలో..

ఉమెన్స్ డే రోజున 'మ్యాన్' సినిమాను అనౌన్స్ చేశారు హన్సిక. క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. మద్రాస్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఇగోర్ దర్శకత్వం వహిస్తున్నారు. ''వేటాడాలి. లేకపోతే మరొకరు మనల్ని వేటాడతారు. ఒక నిజానికి మనం దగ్గరవుతున్నామంటే అర్థం ప్రమాదానికి కూడా చేరువ అవుతున్నట్లే లెక్క'' అని ఈ సినిమా గురించి పేర్కొన్నారు హన్సిక.

మిస్ భైరవి

'రామబాణం' కోసం భైరవిలా ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు డింపుల్ హయతి. 'లక్ష్యం', 'లౌక్యం' చిత్రాల తర్వాత హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'రామబాణం'లో డింపుల్ హయతి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలోని ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి, భైరవి పాత్రలో నటిస్తున్నట్లుగా వెల్లడించారు మేకర్స్. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్న ఈ చిత్రం మే 5న విడుదల కానుంది.

గీత సాక్షిగా..


నిజ జీవిత ఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'గీత సాక్షిగా'. లాయర్ పాత్రలో చిత్రా శుక్లా నటించిన ఈ చిత్రకథ మరో తార చరిష్మా చుట్టూ తిరుగుతుంది. ఆదర్శ్, చిత్రా శుక్లా జంటగా రూపొందిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో ఈ నెల 22న రిలీజ్ కానుంది. ఈ చిత్రం నుంచి చిత్రా శుక్లా లుక్‌ని రిలీజ్ చేశారు. ఆంథోని మట్టిపల్లి స్క్రీన్‌ప్లే రాసి, దర్శకత్వం వహించారు. చేతన్ రాజ్ కథ అందించి, నిర్మించారు.

ఇవే కాదు.. మహిళా దినోత్సవానికి మరికొందరు తారల కొత్త పోస్టర్స్ కూడా విడుదలయ్యాయి.



డింపుల్ హయతి
చిత్రా శుక్లా

సీఈఓగా రామ్ చరణ్?




రామ్ చరణ్

'సీఈఓ'గా కనిపిస్తారట రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా 'దిల్' రాజు, శిరీష్ ఓ సినిమా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా టైటిల్‌గా ఇప్పటికే 'అధికారి', 'సర్కారోడు' వంటి పేర్లు తెరపైకి రాగా తాజాగా 'సీఈఓ' తెరపైకి వచ్చింది. ఫైనల్ టైటిల్‌ను ఈ ఉగాదికి లేదా రామ్ చరణ్ బర్త్ డే (మార్చి 27)కి ప్రకటిస్తారని టాక్.

హాలీవుడ్‌కి... ఆస్కార్ బరిలో నిలిచిన 'నాటు నాటు' ప్రమోషన్స్‌లో భాగంగా 'ఆర్ఆర్ఆర్' టీమ్ అమెరికాలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా హాలీవుడ్‌లో తన తొలి సినిమా గురించిన ప్రకటన త్వరలోనే వెల్లడి కానుందని రామ్ చరణ్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అలాగే తనకు ఎంతో ఇష్టమైన హాలీవుడ్ యాక్టర్స్‌లో ఒకరైన నటి జూలియా రాబర్ట్స్‌తో నటించాలని ఉందని, ఆమె సినిమాలో గెస్ట్ రోల్ అయినా ఇష్టమేనని రామ్ చరణ్ ఆ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు.

అవార్డులపై నమ్మకం పోయింది

- కళ్యాణీ మాలిక్



''ఓ సినిమా సంగీతం విషయంలో అధిక భాగం దర్శకుల పాత్ర ఉంటుంది. దర్శకుడి అభిరుచిని బట్టే సినిమా, సంగీతం ఉంటాయి. నా సంగీతం బాగుందంటే అందులో ఎక్కువ క్రెడిట్ నా దర్శకులకే ఇస్తాను'' అన్నారు సంగీత దర్శకుడు కళ్యాణీ మాలిక్. నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా శ్రీనివాస్ అవసరాల దర్శకత్వం వహించిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వప్రసాద్, పద్మజ దాసరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న రిలీజవుతోంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు కళ్యాణీ మాలిక్ మాట్లాడుతూ– ''2003లో నా తొలి సినిమా 'ఐతే' రిలీజైంది. ఈ 20 ఏళ్లలో 'ఫలానా అబ్బాయి..' నా 19వ సినిమా. సంవత్సరానికో సినిమా చేస్తున్నాను. ఈ ప్రయాణంలో నా సంగీతానికి ఎన్నో ప్రశంసలు దక్కాయి. ఆ విషయంలో సంతృప్తిగా ఉన్నాను. నా కెరీర్‌లో 'ఫలానా అబ్బాయి..' లోని 'కనుల చాటు మేఘమా..' ఉత్తమ పాట అని చెప్పగలను. ఈ పాటకు జాతీయ అవార్డు వస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశాను. కానీ జాతీయ అవార్డులు ఎవరికి ఇస్తారో, అవి ఎలా వస్తాయో ఈ మధ్య ఓ ఫ్రెండ్ చెప్పాడు. దాంతో అవార్డులపై నమ్మకం పోయింది. నాకిప్పటి వరకూ ఒక్క అవార్డు కూడా రాలేదు. 'ఊహలు గుసగుసలాడే'లోని 'ఏం సందేహం లేదు..' పాటని నేను, సునీత పాడాం. సునీతకు అవార్డు వచ్చింది కానీ నాకు రాలేదు. అప్పటి నుంచి అవార్డుల గురించి పట్టించుకోవడం మానేశా. నా సినిమా, నా పాట నచ్చి ఎవరైనా నిర్మాత నాకు మరో చాన్స్ ఇస్తే అదే పెద్ద అవార్డుగా భావిస్తాను. మా అన్నయ్య (కీరవాణి) స్వరపరిచిన 'నాటు నాటు..' ఆస్కార్ బరిలో నిలవడం గర్వంగా ఉంది. ఇక నేను సంగీతం అందించిన 'ఇంటింటి రామాయణం', 'విద్య వాసుల అహం' చిత్రాలు రిలీజ్‌కి రెడీగా ఉన్నాయి. రెండు వెబ్ సిరీస్‌లు చేస్తున్నా'' అన్నారు.

అందరూ కనెక్ట్ అవుతారు

- శివశంకర్ దేవ్

''ఏడాదిన్నర క్రితం దర్శకుడు దేవ్ 'సీఎస్ఐ సనాతన్' కథ చెప్పినప్పుడు ఎగ్జయిట్ అయ్యాను. సాధారణ పౌరులకు కనెక్ట్ అయ్యే కథ ఇది'' అని ఆది సాయి కుమార్ అన్నారు. శివశంకర్ దేవ్ దర్శకత్వంలో ఆది సాయికుమార్, మిషా నారంగ్ జంటగా నటించిన చిత్రం 'సీఎస్ఐ సనాతన్'. సునిత సమర్పణలో అజయ్ శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఆది మాట్లాడుతూ– ''మామూలుగా ఇలాంటి కథలు మలయాళంలో చూస్తుంటాం. తెలుగులో మా 'సీఎస్ఐ సనాతన్' మొదటిది అనుకుంటున్నాను'' అన్నారు. ''కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా ఈ కథ రాసుకున్నాను. ఇప్పటికే మన దేశంలో ఈ కథలోని ఘటనల్లాంటివి జరుగుతున్నాయి కాబట్టి ఈ కథ అందరికీ కనెక్ట్ అవుతుంది'' అన్నారు శివశంకర్ దేవ్.



వాసంతి, అజయ్ శ్రీనివాస్, ఆది, శివశంకర్

ఓటింగ్ డన్



సూర్య

ఆస్కార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు సూర్య. ఈ నెల 12న లాస్ ఏంజిల్స్‌లో 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుక జరగనుంది. విజేతల ఎంపిక కోసం పదివేల మందికి పైగా ఉన్న ఆస్కార్ ఓటర్స్ ఈ నెల 2 నుంచి 7వరకు ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేశారు. ఇందులో భాగంగానే సూర్య కూడా ఓటు వేశారు. అకాడమీ 'క్లాస్ ఆఫ్ 2022'లో భాగంగా సూర్య ఆస్కార్ సభ్యునిగా ఎంపికైన సంగతి తెలిసిందే. అలాగే సూర్యతో పాటు నటి కాజోల్, డైరెక్టర్, స్క్రీన్ రైటర్ రీమా ఖగ్తీలు కూడా ఆస్కార్ మెంబర్స్ అయిన సంగతి గుర్తుండే ఉంటుంది.

ఓ పల్లెటూరి కథ



గౌతమ్

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో ఒక పల్లెటూరిలో జరిగిన కథతో రూపొందించిన హిస్టారికల్ మూవీ 'ఆగస్ట్ 16, 1947'. గౌతమ్ కార్తీక్, రేవతి జంటగా ఎన్.ఎస్. పొన్‌కుమార్ దర్శకత్వంలో దర్శకుడు ఏఆర్ మురుగదాస్, ఓం ప్రకాష్ భట్, నర్సీరామ్ చౌదరి నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను తమిళ, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ, ఇంగ్లిష్ భాషల్లో ఏప్రిల్ 7న రిలీజ్ చేయనున్నట్లు బుధవారం చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ''ప్రేక్షకులను ఈ సినిమా స్వాతంత్ర్యం వచ్చిన రోజుల్లోకి తీసుకెళ్తుంది. మంచి అనుభూతినిస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సహనిర్మాత: ఆదిత్య జోషి.

ఫ్రెండ్ మారడు



ఇంద్ర

ఇంద్ర, కోమల్ నాయర్, దీపు, స్వాతీ శర్మ, ఇమ్రాన్, సీతల్ భట్ ముఖ్య పాత్రల్లో లక్ష్మణ్ జెల్ల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు'. యు. మేఘనాథ్, యం. లోకేష్ కుమార్ సమర్పణలో చంద్రాస్ చంద్ర, విజయ రమేష్ రెడ్డి నిర్మించారు. ఈ మూవీ మోషన్ పోస్టర్ లోగోను ఆంధ్రప్రదేశ్ అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్మాచలం, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్, డైరెక్టర్ రాజు యాదవ్, నటి జయలక్ష్మి లాంచ్ చేశారు. ''ప్రతి మనిషీ ప్రేమకు ఎంత ప్రాధాన్యం ఇస్తాడో స్నేహానికి కూడా అంతే ప్రాముఖ్యత ఇవ్వాలని చెప్పే చిత్రమిది'' అన్నారు లక్ష్మణ్ జెల్ల.

స్వచ్ఛమైన హాస్యం



అభిషేక్

అభిషేక్ రెడ్డి పచ్చిపాలా, నాజియా జంటగా 'జబర్దస్త్' ఫణి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'జస్ట్ ఏ మినిట్'. పూర్ణస్ యస్వంత్ దర్శకత్వంలో ఈట ప్రకాష్ ధర్మపురి నిర్మించారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ''స్వచ్ఛమైన హాస్యంతో రూపొందించిన చిత్రం ఇది. విడుదలైన మోషన్ పోస్టర్, యూట్యూబ్ షార్ట్స్ వైరల్ అవుతున్నాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: అమీర్, సంగీతం: ఓ. బాజి, సమర్పణ: కార్తీక్ ధర్మపురి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సూరి శ్రీ ఇనగంటి.

సాక్షి బిజినెస్

గురువారం
9-3-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
124	43
60,224	17,754

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్‌	11,547	▲	17
డోజోన్స్‌	32,708	▼	148
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,930	▲	10
డాక్స్‌	15,632	▲	72
షాంఘై	3,283	▼	2
నికాయ్‌	28,444	▲	135

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారెట్‌)	55,245
బంగారం (22 క్యారెట్‌)	55,024
వెండి (కేజీ)	61,883

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఒకటి	81.50	83.17
£	బ్రిటన్‌ పౌండ్‌	ఒకటి	95.67	98.91
€	యూరో	ఒకటి	85.20	88.26
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఒకటి	58.85	60.74
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఒకటి	53.01	55.36
S$	సింగపూర్‌ డాలర్‌	ఒకటి	59.77	61.71
SAR	సౌదీ రియాల్‌	పాయింట్స్‌	20.89	22.56
UAE D	యూఏఈ దిర్హామ్‌	పాయింట్స్‌	21.44	23.24
¥	చైనా యువాన్‌	పాయింట్స్‌	10.66	12.74

5జీని విస్తరిస్తున్న టెల్కోలు

331 ప్రాంతాల్లో జియో సర్వీసులు • 265 కేంద్రాల్లో ఎయిర్‌టెల్‌ సేవలు

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: దేశవ్యాప్తంగా టెలికం కంపెనీలు 5జీ సేవలను వేగంగా విస్తరిస్తున్నాయి. రిలయన్స్‌ జియో తాజాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోసహా 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 27 నగరాలు, పట్టణాల్లో నూతనంగా 5జీ సర్వీసులను జత చేసింది. దీంతో భారత్‌లో కంపెనీ మొత్తం 331 ప్రాంతాల్లో ఆధునిక టెక్నాలజీని పరిచయం చేసినట్టు అయింది. జియో వెల్కమ్‌ ఆఫర్‌లో భాగంగా ఎటువంటి అదనపు ఖర్చు లేకుండానే కస్టమర్లు ప్రస్తుత చార్జీతో 1 జీబీపీఎస్‌ స్పీడ్‌తో అపరిమిత ఇంటర్నెట్‌ను ఆస్వాదించవచ్చు. 2023 చివరినాటికి దేశవ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాల్లో 5జీ సర్వీసులను అందుబాటులోకి తేవాలన్నది రిలయన్స్‌ లక్ష్యం. సంస్థ అధినేత ముఖేష్‌ అంబానీ ఇప్పటికే ఈ విషయాన్ని స్పష్టం చేశారు.

భారతీ ఎయిర్‌టెల్‌ సైతం..

మరో టెలికం సంస్థ భారతీ ఎయిర్‌టెల్‌ ఏకంగా 125 నగరాలు, పట్టణాల్లో కొత్తగా 5జీ సేవలను జోడించింది. దీంతో సంస్థ అందిస్తున్న 5జీ సర్వీసులు దేశంలో మొత్తం 265 ప్రాంతాలకు విస్తరించాయి. ఉత్తరాదిన జమ్మూ మొదలుకుని దక్షిణాదిన కన్యాకుమారి వరకు ప్రతి ప్రధాన నగరంలో నూతన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చినట్టు ఎయిర్‌టెల్‌ ప్రకటించింది. దేశంలోని అన్ని నగరాలు, పట్టణాలకు 5జీని వేగంగా చేర్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపింది. 2024 మార్చి నాటికి అన్ని పట్టణాలతోపాటు ప్రధాన గ్రామీణ ప్రాంతాల్లో అడుగుపెడతామని భారతీ ఎయిర్‌టెల్‌ సీటీవో రణదీప్‌ సెఖన్‌ తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు లక్ష్యమని తెలిపారు.

నాట్కో షేర్ల బైబ్యాక్‌

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ఔషధ రంగ కంపెనీ నాట్కో ఫార్మా 30 లక్షల షేర్లను బహిరంగ మార్కెట్లో బైబ్యాక్‌ చేయాలని బోర్డు నిర్ణయించింది. రూ.210 కోట్లు వెచ్చించి 1.64 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును గరిష్టంగా రూ.700 చెల్లించి బైబ్యాక్‌ చేయనున్నట్టు స్టాక్‌ ఎక్స్ఛేంజీలకు బుధవారం తెలిపింది. ప్రస్తుత మార్కెట్‌ ధర రూ.568 ఉంది. ఒకానొక దశలో బీఎస్‌ఈలో నాట్కో ఫార్మా షేరు గరిష్ట ధర రూ.580 తాకింది. క్రితం ముగింపుతో పోలిస్తే బుధవారం కంపెనీ షేరు ధర 0.33 శాతం ఎగసి రూ.568 వద్ద స్థిరపడింది.

విజయవాడలో వేగ జ్యువెలర్స్‌ కొత్త షోరూం



విజయవాడ: వజ్రాభరణాల రంగంలో రెండు దశాబ్దాలుగా కస్టమర్ల విశ్వాసాన్ని చూరగొన్న ''వేగ జ్యువెలర్స్‌'' భారీ విస్తరణ బాట పట్టింది. ఈ సందర్భంగా విజయవాడలోని నందమూరి రోడ్డులో ఏర్పాటు చేసిన కొత్త షోరూంను బుధవారం సినీ నటుడు బాలకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కానుకగా రూ.2 లక్షల విలువైన నగల కొనుగోలుపై ఒక గ్రాము బంగారు నాణేన్ని సంస్థ ఉచితంగా అందిస్తోంది. పరిమిత కాలంగా ఉండే ఈ ఆఫర్‌ను కస్టమర్లు వినియోగించుకోవాలని డైరెక్టర్‌ వనమా నవీన్‌ కుమార్‌ కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ మరో డైరెక్టర్‌ వనమా సుధాకర్, సినీ ప్రముఖులు ప్రగ్యా జైస్వాల్, సంజన ఆనంద్‌లు పాల్గొన్నారు.

అదానీ గ్రూప్‌లో మరిన్ని పెట్టుబడులు

- అవకాశాల కోసం ఐదేళ్లుగా ఎదురుచూపు
- జీక్యూజీ పార్ట్‌నర్స్‌ వ్యవస్థాపకుడు రాజీవ్‌ జైన్‌



సిడ్నీ: డైవర్సిఫైడ్‌ దిగ్గజం అదానీ గ్రూప్‌ కంపెనీలలో మరిన్ని పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు జీక్యూజీ పార్ట్‌నర్స్‌ వ్యవస్థాపకుడు రాజీవ్‌ జైన్‌ తాజాగా స్పష్టం చేశారు. భారత్‌లో 25 శాతం ఎయిర్‌ ట్రాఫిక్‌ అదానీ నిర్వహిస్తున్న ఎయిర్‌పోర్టుల ద్వారానే నమోదవుతున్నట్లు జైన్‌ పేర్కొన్నారు. అంతేకాకుండా దేశీ సరుకు రవాణా(కార్గో)లో అదానీ గ్రూప్‌ పోర్టులు 25 నుంచి 40 శాతం పరిమాణాన్ని సాధిస్తున్నట్లు తెలియజేశారు. వెరసి ఐదేళ్లగా అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు చేపట్టేందుకు వేచిచూస్తున్నట్లు విలేకర్ల సమావేశంలో జైన్‌ తెలియజేశారు. స్థానిక ఇన్వెస్టర్లతో జైన్‌ సమావేశమవుతున్నారు. అయితే షేర్ల ధరలు అందుబాటులో లేకపోవడంతో దీర్ఘకాలం వేచి చూసినట్లు వెల్లడించారు. కాగా.. ఇటీవల అదానీ గ్రూప్‌లోని 4 కంపెనీలలో అమెరికా ఈక్విటీ పెట్టుబడుల కంపెనీ జీక్యూజీ పార్ట్‌నర్స్‌ 1.87 బిలియన్‌ డాలర్లు(రూ. 15,446 కోట్లు) ఇన్వెస్ట్‌ చేసిన సంగతి తెలిసిందే. ఈ బాటలో ఇకపైన కూడా అదానీ గ్రూప్‌లో పెట్టుబడులను మరింత విస్తరించనున్నట్లు జైన్‌ స్పష్టం చేశారు. ఇటీవల సెకండరీ మార్కెట్లో బ్లాక్‌ డీల్స్‌ ద్వారా అదానీ ఎంటర్‌ప్రైజెస్‌(ఏఈఎల్‌), అదానీ పోర్ట్స్‌ అండ్‌ సెజ్‌(ఏపీసెజ్‌), అదానీ గ్రీన్‌ ఎనర్జీ(ఏజీఈఎల్‌), అదానీ ట్రాన్స్‌మిషన్‌ లిమిటెడ్‌(ఏటీఏల్‌)లకు చెందిన మైనారిటీ వాటాలను జీక్యూజీ పార్ట్‌నర్స్‌ కొనుగోలు చేసిన విషయం విదితమే.

అదానీ పవర్‌ అనుబంధ సంస్థల విలీనం

పూర్తిస్థాయి అనుబంధ సంస్థలు ఆరింటిని విలీనం చేసుకున్నట్లు అదానీ పవర్‌ లిమిటెడ్‌ తాజాగా వెల్లడించింది. వీటిలో అదానీ పవర్‌ మహారాష్ట్ర, అదానీ పవర్‌ రాజస్తాన్, ఉడుపి పవర్‌ కార్పొరేషన్, రాయ్‌పూర్‌ ఎనర్జెన్, రాయ్‌గఢ్‌ ఎనర్జీ జనరేషన్, అదానీ పవర్‌ ముంద్రా లిమిటెడ్‌ ఉన్నట్లు పేర్కొంది. గత నెల(ఫిబ్రవరి) 8న జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్‌(ఎన్‌సీఎల్‌టీ) అహ్మదాబాద్‌ బెంచ్‌ ఇందుకు అనుమతించినట్లు తెలియజేసింది.

ఇన్వెస్టర్లకు అవగాహన పెంచాలి

నియంత్రణ సంస్థలకు అసోచామ్‌ వినతి



న్యూఢిల్లీ: మార్కెట్ల నియంత్రణ సంస్థలు రిటైల్‌ ఇన్వెస్టర్లకు ఎప్పటికప్పుడు తగిన సమాచారాన్ని అందించడంతోపాటు అవగాహనను పెంచే చర్యలు చేపట్టవలసి ఉన్నట్లు అసోచామ్‌- కేర్‌ఎడ్జ్‌ రేటింగ్స్‌ నివేదికలో అసోచామ్‌ పేర్కొంది. రిటైలర్లు సెంటిమెంటుపై అధికంగా ఆధారపడతారని, దీంతో మార్కెట్ల ఆటుపోట్లపై తగిన అవగాహన పెంచవలసిన అవసరం ఉన్నదని పేర్కొంది. రిటైల్‌ లావాదేవీలతో మార్కెట్లలో లిక్విడిటీ పెరగడంతోపాటు, ఆర్డర్‌బుక్‌ బలపడుతుందని అభిప్రాయపడింది.

సీఐఐ తెలంగాణ చైర్మన్‌గా శేఖర్‌రెడ్డి



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: కాన్ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియన్‌ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ చైర్మన్‌గా 2023-24 సంవత్సరానికిగాను సీఎస్‌ఆర్‌ ఎస్టేట్స్‌ సీఎండీ సి.శేఖర్‌ రెడ్డి నియమితులయ్యారు. రియల్టీ రంగంలో మూడు దశాబ్దాలకుపైగా అనుభవంతో విధాన రూపకల్పనలో రాష్ట్ర, కేంద్ర స్థాయిలో కీలకంగా ఉన్నారు. అలాగే సీఐఐ తెలంగాణ వైస్‌ చైర్మన్‌గా భారత్‌ బయోటెక్‌ ఇంటర్నేషనల్‌ ఈడీ సాయి డి ప్రసాద్‌ ఎన్నికయ్యారు.

'ఫోర్స్‌' వైస్‌ ప్రెసిడెంట్‌గా వినయేంద్ర



హైదరాబాద్: ఫ్రైట్‌ ఆర్గనైజేషన్‌ ఆఫ్‌ రిలేటెడ్‌ కార్గో ఎక్స్‌పర్ట్స్‌ (ఫోర్స్‌) వైస్‌ ప్రెసిడెంట్‌గా సీవేస్‌ షిప్పింగ్‌ అండ్‌ లాజిస్టిక్స్‌ డైరెక్టర్‌ వినయేంద్ర పర్వతనేని (వినయ్‌) ఎంపికయ్యారు. ఈ హోదాకు ఎంపికైన అత్యంత పిన్న వయస్కుల్లో వినయ్‌ కూడా ఒకరు. అంతర్జాతీయంగా స్వతంత్ర రవాణా సేవల సంస్థలు అసోసియేషన్‌గా ఏర్పాటు చేసుకున్న ఫోర్స్‌లో ప్రతి దేశం నుంచి కేవలం ఒక్క సంస్థకే ప్రాతినిధ్యం లభిస్తుంది. గతంలో సీవేస్‌ గ్రూప్‌ ఎండీ కెప్టెన్‌ వీకే మోహన్‌ దీనికి ప్రెసిడెంట్‌గా విధులు నిర్వర్తించారు.

కనిష్టాల వద్ద కొనుగోళ్లు

- మూడోరోజూ ముందుకే
- స్వల్పలాభాలతో గట్టెక్కిన సూచీలు
- రాణించిన బ్యాంకింగ్, ఇంధన షేర్లు



ముంబై: కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతుతో ఇంట్రాడే నష్టాలను భర్తీ చేసుకున్న స్టాక్‌ సూచీలు బుధవారం వరుసగా మూడవ రోజూ లాభాల బాటనే నడిచాయి. స్వల్ప లాభాలు ఆర్జించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో ప్రతికూలతలు ఉన్నప్పటికీ.., అధిక వెయిటేజీ బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇంధన రంగాల షేర్లు రాణించడం కలిసొచ్చింది. ద్రవ్యోల్బణం పెరిగితే ముందస్తు వడ్డీరేట్ల పెంపు తప్పదనే ఫెడ్‌ చైర్మన్‌ వ్యాఖ్యల నేపథ్యంలో సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్‌ 308 పాయింట్లు పతనమై 59,916 వద్ద, నిఫ్టీ 45 పాయింట్లు నష్టపోయి 17,666 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 379 పాయింట్లు క్షీణించి 59,845 వద్ద, నిఫ్టీ 109 పాయింట్లు పతనమై 17,602 ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చాయి. అయితే బేర్స్‌ షార్ట్‌ పొజిషన్లను కవర్‌ చేయడంతో పలు షేర్లు కనిష్టస్థాయి నుంచి కోలుకున్నాయి. చివర్లో కొనుగోళ్లు మరింత పెరగడంతో సెన్సెక్స్‌ 124 పాయింట్లు లాభపడి 60348 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 43 పాయింట్లు పెరిగి 17,754 వద్ద నిలిచింది. రియల్టీ, మెటల్, కన్జూమర్‌ డ్యూరబుల్, ఐటీ, ఫార్మా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. రుణ భారం తగ్గింపు చర్యలతో అదానీ గ్రూప్‌ షేర్లు లాభాల బాటన నడిచాయి.

క్రిప్టోలకు మనీలాండరింగ్‌ నిబంధనల వర్తింపు



న్యూఢిల్లీ: క్రిప్టోకరెన్సీల్లాంటి వర్చువల్‌ అసెట్స్‌ నియంత్రణపై కేంద్రం మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా క్రిప్టోల ట్రేడింగ్, సంబంధిత ఆర్థిక సర్వీసులకు మనీలాండరింగ్‌ నిరోధక చట్టాలను వర్తింపచేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రి గెజిట్‌ నోటిఫికేషన్‌ విడుదల చేసింది. దీనితో దేశీ క్రిప్టో ఎక్స్ఛేంజీలు ఇకపై అనుమానాస్పద లావాదేవీలేవైనా గుర్తిస్తే ఫైనాన్షియల్‌ ఇంటెలిజెన్స్‌ యూనిట్‌ ఇండియా (ఎఫ్‌ఐయూ-ఐఎన్‌డీ)కి తెలియజేయాల్సి ఉంటుంది. ఎంతో కొంత విలువ కలిగి, క్రిప్టో పద్ధతుల్లో జనరేట్‌ చేసిన కోడ్‌ లేదా నంబరు లేదా టోకెన్‌లను వర్చువల్‌ డిజిటల్‌ అసెట్లుగా పరిగణిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

9-3-2023	
విశాఖ	425-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	420-00
విజయవాడ	420-00
రిటైల్‌ ధర (డజను)	66.00
8-3-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	405-00
వరంగల్‌	407-00
రిటైల్‌ ధర	4.65

భవిత

ఆంధ్రప్రదేశ్‌ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, మోడల్‌పేపర్స్, ప్రీవియస్‌ పేపర్స్, టెక్ట్స్‌బుక్స్, గైడెన్స్‌ మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

పోటీ పరీక్షల ప్రత్యేకం రసాయన శాస్త్రం కోసం ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

కెరీర్‌ కౌన్సెలింగ్‌
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్‌ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్‌ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్‌

భారత వాయుసేన అగ్నిపథ్‌ స్కీమ్‌లో భాగంగా.. అగ్నివీర్‌ వాయు నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్‌ విడుదలచేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్‌ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్‌(10+2)/ఇంటర్మీడియట్‌ (సైన్స్‌ కాని ఇతర సబ్జెక్టులు) లేదా మూడేళ్ల ఇంజనీరింగ్‌ డిప్లొమా (మెకానికల్‌/ఎలక్ట్రికల్‌/ఎలక్ట్రానిక్స్‌/ఆటో మొబైల్‌/కంప్యూటర్‌ సైన్స్‌/ఇన్‌స్ట్రుమెంటేషన్‌ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ)/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి.నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి. **వయసు:**26.12.2002 నుంచి 26.06.2006 మధ్య జన్మించి ఉండాలి.

» **ఎంపిక విధానం:** ఫేజ్‌-1(ఆన్‌లైన్‌ రాతపరీక్ష), ఫేజ్‌-2(ఫిజికల్‌ ఫిట్‌నెస్‌ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్‌-1, అడాప్టబిలిటీ టెస్ట్‌-2), ఫేజ్‌-3(మెడికల్‌ ఫిట్‌నెస్‌ టెస్ట్‌), ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.

» **ఆన్‌లైన్‌ రిజిస్ట్రేషన్‌ ప్రారంభతేది:** 17.03.2023.

» **ఆన్‌లైన్‌ రిజిస్ట్రేషన్‌ చివరితేది:** 31.03.2023.

» **ఆన్‌లైన్‌ పరీక్షలు ప్రారంభతేది:** 20.05.2023.

» **వెబ్‌సైట్:** www.agnipathvayu.cdac.in

నిమ్‌సెట్‌-2023

నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్స్‌ ఆఫ్‌ టెక్నాలజీ(నిట్‌) లు.. ఎంసీఏ కామన్‌ ఎంట్రన్స్‌ టెస్ట్‌(నిమ్‌సెట్‌)ను ఏటా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది నిమ్‌సెట్‌ను నిట్, జంషెడ్‌పూర్‌ నిర్వహిస్తోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 813.

» **నిట్‌లలో సీట్ల వివరాలు:** అగర్తల-30, అలహాబాద్‌-116, భోపాల్‌-115, జంషెడ్‌పూర్‌-115, కురుక్షేత్ర-96(వీటిలో 32 సెల్ఫ్‌ ఫైనాన్స్‌), రాయ్‌పూర్‌-110, సూరత్కల్‌-58, తిరుచురాపల్లి-115, వరంగల్‌-58.

» **అర్హత:** మ్యాథ్స్‌ లేదా స్టాటిస్టిక్స్‌ ఒక సబ్జెక్టుగా బీఎస్సీ, బీసీఏ, బీటెక్, బీ వొక్‌ (కంప్యూటర్‌ సైన్స్‌/కంప్యూటర్‌ అప్లికేషన్స్‌)ల్లో ఏదైనా కోర్సు చదివుండాలి లేదా ఏ బ్రాంచిలోనైనా బీటెక్‌/బీఈ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏ కోర్సు చదివినప్పటికీ కనీసం 60 శాతం మార్కులు (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 55 శాతం) తప్పనిసరి. చివరి సంవత్సరం కోర్సుల్లో ఉన్నవారు అర్హులే.

» **తెలంగాణలో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్.

» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 10.04.2023.

» **పరీక్ష తేది:** 11.05.2023.

» **ఫలితాల ప్రకటన తేది:** 16.06.2023.

» **వెబ్‌సైట్:** www.nimcet.in

ఉమ్మడి వ్యూహం.. విజయం ఖాయం!

టీఎస్‌పీఎస్సీ గ్రూప్‌-2, గ్రూప్‌-3.. తీవ్ర పోటీ నెలకొంది! వందల్లో ఉన్న ఈ పోస్టులకు.. లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి!! దాదాపు 80 శాతం మంది రెండు పరీక్షలకూ దరఖాస్తు చేసుకున్నట్లు అంచనా. ఇప్పటికే గ్రూప్‌-2 పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. మరి కొద్ది రోజుల్లో గ్రూప్‌-3 తేదీలపైనా స్పష్టత రానుంది. మరోవైపు ఈ రెండు పరీక్షలకు ఏకకాలంలో ప్రిపరేషన్‌ సాగించడం ఎలా.. అనే సందేహం అభ్యర్థులకు ఎదురవుతోంది! ఈ నేపథ్యంలో.. టీఎస్‌పీఎస్సీ గ్రూప్‌-2, గ్రూప్‌-3 పరీక్షలకు ఉమ్మడి సన్నద్ధతపై ప్రత్యేక కథనం..

» గ్రూప్‌-2, 3లకు ముగిసిన దరఖాస్తు ప్రక్రియ
» ఒక్కో సర్వీసుకు అయిదు లక్షలకు పైగా దరఖాస్తులు
» దాదాపు 80 శాతం మంది రెండు సర్వీసులకు పోటీ
» ఆగస్ట్‌ 28, 29 తేదీల్లో గ్రూప్‌-2 పరీక్షలు
» గ్రూప్‌-3పై మరికొద్ది రోజుల్లో స్పష్టత
» ఉమ్మడి వ్యూహంతోనే సక్సెస్‌ అంటున్న నిపుణులు

- **గ్రూప్‌-2 సర్వీసులు:** మొత్తం పోస్టులు 783; దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 5,51,943. అంటే.. ఒక్కో పోస్టుకు 705 మంది పోటీ!
- **గ్రూప్‌-3 సర్వీసులు:** మొత్తం పోస్టులు 1,375; దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 5,36,447. అంటే.. ఒక్కో పోస్టుకు 390 మంది పోటీ!!
- ఈ రెండు గణాంకాలను చూస్తే.. గ్రూప్‌-2, గ్రూప్‌-3 పోస్టులకు పోటీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎక్కువ మంది అభ్యర్థులు గ్రూప్‌-2తోపాటు గ్రూప్‌3కి కూడా దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు 80 శాతం మేరకు అభ్యర్థులు రెండు పరీక్షలకు దరఖాస్తు చేసుకుని ఉంటారని అంచనా వేస్తున్నారు. అయితే ఒకే సమయంలో రెండు పరీక్షలకు ప్రిపరేషన్‌ సాగించడంపైనే కొంత ఆందోళన నెలకొంది. రెండు పరీక్షల ప్యాట్రన్‌పై అవగాహన పెంచుకొని.. ఉమ్మడిగా ప్రిపరేషన్‌ సాగిస్తే.. విజయం సాధించొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

కామన్‌ సిలబస్‌.. కలిసొచ్చేలా

గ్రూప్‌-2, 3 అభ్యర్థులకు ప్రధానంగా కలిసొచ్చే అంశం.. ఈ రెండు సర్వీసుల పరీక్షలకు సంబంధించి సిలబస్‌ ఒకే రీతిలో ఉండడం. గ్రూప్‌-2 నాలుగు పేపర్లుగా, గ్రూప్‌-3 మూడు పేపర్లుగా నిర్వహించనున్నారు. రెండు పరీక్షల మధ్య తేడా ఏంటి? అంటే.. గ్రూప్‌-2లో 4 పేపర్లు ఉంటే.. గ్రూప్‌-3లో మూడు పేపర్లే ఉండడమే. గ్రూప్‌-2లో ప్రత్యేకంగా నాలుగో పేపర్‌గా తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం అనే అంశాలతో పరీక్ష ఉంటుంది. ఈ అంశాలను గ్రూప్‌-3లోని పేపర్‌-2, పేపర్‌-3 అంశాలతో సమ్మిళితం చేసుకునే అవకాశం ఉంది.

సరి పోల్చుకుంటూ

గ్రూప్‌-2, 3లకు ఉమ్మడి ప్రిపరేషన్‌ సాగించాలనుకునే అభ్యర్థులు రెండు సర్వీసులకు సంబంధించిన సిలబస్‌ను పరిశీలించాలి. ఆ తర్వాత రెండు పరీక్షల సిలబస్‌లోని అంశాలను సరిపోల్చుకుంటూ..ఒకే తరహాలో ఉన్న టాపిక్స్‌పై స్పష్టత తెచ్చుకోవాలి. కామన్‌ అంశాలను ఒకే సమయంలో చదివేలా.. వేర్వేరుగా ఉన్న అంశాలకు నిర్దిష్టంగా ప్రత్యేక సమయం కేటాయించేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. రెండింటిలోనూ ఒకే సిలబస్‌ అంశాలు ఉన్నాయి. కాబట్టి ప్రిపరేషన్‌ విషయంలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదనేది నిపుణుల అభిప్రాయం.

సిలబస్‌కు సరితూగే పుస్తకాలు

ఉమ్మడి ప్రిపరేషన్‌లో భాగంగా అభ్యర్థులు సిలబస్‌కు సరితూగే ప్రామాణిక పుస్తకాలను ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సిలబస్‌కు సంబంధించిన అంశాలన్నీ ఉన్న పుస్తకాలను అన్వేషించి..వాటి ద్వారా ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి. ప్రధానంగా తెలంగాణ ఉద్యమ దశలకు సంబంధించి ప్రత్యేక దృష్టితో వ్యవహరించాలి. మార్కెట్లో ఈ అంశానికి సంబంధించి పదుల సంఖ్యలో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సిలబస్‌కు అనుగుణంగా తెలంగాణ ఉద్యమానికి సంబంధించి అన్ని ముఖ్యమైన ఘట్టాలున్న ఒకట్రెండు పుస్తకాలను ఎంచుకోవడం మేలు చేస్తుంది. అదే విధంగా అకాడమీ పుస్తకాలను చదవడం కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

విశ్లేషణాత్మక అధ్యయనం

సిలబస్‌పై స్పష్టతతోపాటు, పుస్తకాలను ఎంపిక చేసుకున్న అభ్యర్థులు..విశ్లేషణాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవానికి గ్రూప్‌-2, 3 రెండు పరీక్షలు పూర్తిగా ఆబ్జెక్టివ్‌ విధానంలో, బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటాయి. కాని అభ్యర్థులు ప్రిపరేషన్‌ సమయంలో డిస్క్రిప్టివ్‌ విధానంలో చదువుతూ.. ఆయా అంశాలపై పూర్తి స్థాయి పట్టు సాధించాలి. అంతేకాకుండా ప్రతిరోజు ప్రతి సబ్జెక్ట్‌ చదివేలా సమయ పాలన పాటించాలి.

పూర్తిగా అర్థమయ్యేలా

అభ్యర్థులు ప్రిపరేషన్‌లో భాగంగా సమగ్ర అధ్యయనం కొనసాగించాలి. ఒక టాపిక్‌కు సంబంధించి నిర్వచనం మొదలు తాజా పరిణామాలకు వరకూ.. సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలి. అదే విధంగా నిర్దిష్టంగా ఒక టాపిక్‌ను వాస్తవ పరిస్థితుల్లో అన్వయించే విధంగా చదవాలి. పరీక్షలో విజయం కోసం నిర్ణయాత్మక సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యం పెంచుకోవాలి.

అనుసంధాన దృక్పథం

ప్రిపరేషన్‌ విషయంలో అభ్యర్థులు అనుసరించాల్సిన మరో వ్యూహం.. అనుసంధాన దృక్పథం. రెండు పరీక్షల్లోని ఉమ్మడి అంశాలను గుర్తించి.. వాటిని అనుసంధానం చేసుకుంటూ చదవాలి. జనరల్‌ స్టడీస్, కరెంట్‌ అఫైర్స్, ఇంటర్నేషనల్‌ రిలేషన్స్, భారత రాజ్యాంగం విధానం, పరిపాలన, ఎకానమీ అండ్‌ డెవలప్‌మెంట్‌.. ఇలా అన్ని అంశాలను అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది. అభ్యర్థులు ప్రతి రోజు సగటున 8 నుంచి 10 గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించేలా టైమ్‌ టేబుల్‌ రూపొందించుకోవాలి.

ఏదీ వదలకుండా

జాతీయం నుంచి స్థానికం వరకూ.. పరీక్ష కోణంలో ఏ అంశాన్ని వదలకుండా చదవాలి. ముఖ్యంగా తెలంగాణ ప్రాంత ప్రాధాన్యమున్న అంశాలను ఔపోసన పట్టాలి. తెలంగాణ ఉద్యమ దశలు, తెలంగాణ ఆవిర్భావ దశ, మలిదశ ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా తెలంగాణ చరిత్రలో తెలంగాణ సామాజిక ముఖ చిత్రాన్ని తెలియజేసే అన్ని అంశాలను చదవాలి. సాహిత్యం, కళలు, కవులు, సంస్థానాలు, భౌగోళిక స్వరూపం,వనరులు, ప్రభుత్వ పథకాలు, తెలంగాణ ఏర్పాటైన తర్వాత అమలు చేస్తున్న కొత్త పథకాలు.. ఇలా అన్ని అంశాలపై దృష్టి పెట్టాలి.

సొంత నోట్స్‌

అభ్యర్థులు ఆయా విభాగాలను చదువుతున్నప్పుడే.. ముఖ్యమైన అంశాలను పాయింట్ల వారీగా నోట్స్‌ తయారు చేసుకోవాలి. అదే విధంగా అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆయా వర్గాల నిర్వచనానికే పరిమితం కాకుండా.. వాటి ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు.. ఇలా అన్నింటి గురించి తెలుసుకోవాలి. అప్పుడే సదరు టాపిక్‌పై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది. మతాలు, సామాజిక వర్గాలు, గిరిజన సమస్యలు, ప్రాంతీయ సమస్యలు వంటి స్థానిక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

ప్రభుత్వ విధానాలు

జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో సామాజిక సమస్యలు, వాటిపై ప్రభుత్వాలు చేసిన విధానాలపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ విధానాలపై ప్రభుత్వ డాక్యుమెంట్లు ఉన్నాయి. వీటిపై తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలి. ఇందులో మహిళా సాధికారత వంటివి ముఖ్యమైనవి. మహిళల సాధికారత కోసం జాతీయస్థాయిలో రకరకాల పథకాలు తెచ్చారు. మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమం కోసం విధానాలు రూపొందించారు. అదే విధంగా పలు నూతన పాలసీలు రూపొందుతున్నాయి. వాటి గురించి కూలంకషంగా అధ్యయనం చేయాలి.



తెలంగాణపై ప్రత్యేక దృష్టి

తెలంగాణ ప్రత్యేక ప్రాధాన్యం ఉన్న అంశాలపై పరీక్షలో కొన్ని ఎక్కువ ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కాబట్టి ముందుగా తెలంగాణ పాలసీలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా తెలంగాణ ఏర్పాటు,దానికి సంబంధించి ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్న నీళ్లు..నిధులు..నియామకాలు.. వంటి అంశాలపై ఎలాంటి విధానాలు తెచ్చారన్నది తెలుసుకోవాలి. రాష్ట్రంలో ఆయా వర్గాల కోసం అమలు చేస్తున్న నూతన విధానాలపై అవగాహన పెంచుకోవాలి. వెనుకబడిన తరగతులు, మైనారిటీలు,గిరిజనులకు సంబంధించి రూపొందించిన పథకాల గురించి తెలుసుకోవాలి. పర్యావరణంపై తెలంగాణకు హరితహారం పాలసీ తెచ్చారు.

గ్రూప్‌-2.. పేపర్‌-4 ప్రత్యేకంగా

అభ్యర్థులు ప్రత్యేకంగా సమయం కేటాయించి నైపుణ్యం సాధించాల్సిన పేపర్.. గ్రూప్‌-2లోని నాలుగో పేపర్. 'తెలంగాణ ఆలోచన(1948-1970),ఉద్యమ దశ (1971-1990), తెలంగాణ ఏర్పాటు దశ, ఆవిర్భావం(1991-2014)) అంశాలకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ముఖ్యంగా సిలబస్‌లో నిర్దేశించిన ప్రకారం-1948 నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకు.. జరిగిన ముఖ్య ఉద్యమాలు, ఒప్పందాలు, ముల్కీ నిబంధనలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీలు-వాటి సిఫార్సులు వంటి వాటిని అధ్యయనం చేయాలి. దీంతోపాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా రూపొందించిన పునర్‌ వ్యవస్థీకరణ బిల్లులో తెలంగాణకు సంబంధించి ప్రత్యేకంగా పొందుపరచిన అంశాలు; తెలంగాణ రాష్ట్రానికి కల్పించిన హక్కులపై దృష్టి సారించాలి.

తెలంగాణపై ఫోకస్‌

తెలంగాణ హిస్టరీ, తెలంగాణ జాగ్రఫీ, తెలంగాణ ఎకానమీ పేరుతో ప్రత్యేకంగా ఉన్న అంశాలపై మరింత లోతైన అవగాహన ఏర్పరచుకుంటే మార్కులు పెంచుకునే అవకాశం ఉంది. చరిత్రలో తెలంగాణలో రాజులు, ముఖ్య యుద్ధాలు, ఒప్పందాలు, తెలంగాణలోని కవులు-రచనలు; కళలు; ముఖ్య కట్టడాలు-వాటిని నిర్మించిన రాజులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అదే విధంగా స్వాతంత్ర్యోద్యమ సమయంలో తెలంగాణ ప్రాంత ప్రమేయం ఉన్న సంఘటనలపై అవగాహన ఏర్పరచుకోవాలి. తెలంగాణలోని ముఖ్యమైన నదులు-పరీవాహక ప్రాంతాలు; ముఖ్యమైన పంటలు; భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. దీంతోపాటు తెలంగాణ భౌగోళిక స్వరూపం, విస్తీర్ణం,జనాభా వంటి అంశాలపై అవగాహన అవసరం. ఎకానమీలో తెలంగాణ స్థూల రాష్ట్రీయోత్పత్తి, ముఖ్యమైన పథకాలు, 2011 జనాభా గణాంకాలు; ముఖ్యమైన పరిశ్రమలు -ఉత్పత్తిదాయకత, రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరులపై అవగాహన పెంచుకోవాలి. తాజా బడ్జెట్‌ గణాంకాలు, ఆయా శాఖలు, పథకాలకు కేటాయింపులపై పట్టు సాధించాలి.

ప్రాక్టీస్‌ టెస్టులకు హాజరవడం

గ్రూప్‌-2, గ్రూప్‌-3 అభ్యర్థులు ప్రిపరేషన్‌ సమయంలో ప్రాక్టీస్‌ టెస్టులు, మోడల్‌ టెస్టులకు హాజరవడం మేలు చేస్తుంది. దీనివల్ల ఆయా సబ్జెక్టులలో తమకు అప్పటి వరకు లభించిన పరిజ్ఞాన స్థాయిపై అవగాహన లభిస్తుంది. ఇంకా చదవాల్సిన అంశాల విషయంలో స్పష్టత వస్తుంది. అదే విధంగా తాము చేస్తున్న పొరపాట్లను విశ్లేషించుకుని.. వాటిని సరిదిద్దుకునే అవకాశం లభిస్తుంది.

నెల ముందు నుంచి రివిజన్‌

గ్రూప్‌-2, 3 సర్వీసుల ఉమ్మడి అభ్యర్థులు.. కేవలం ప్రిపరేషన్‌కే కాకుండా..పునశ్చరణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. ఆయా పరీక్ష తేదీలకు నెల రోజుల ముందు నుంచి పూర్తిగా రివిజన్‌కు సమయం కేటాయించుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఇలా.. ఉమ్మడి అంశాలను, ప్రత్యేక అంశాలను పరిశీలించుకుని.. పేపర్‌ వారీగా నిర్దిష్ట ప్రణాళికతో అడుగులు వేస్తే ఒకే సమయంలో గ్రూప్‌-2, 3లకు సన్నద్ధత పొందే ఆస్కారం లభిస్తుంది.

గ్రూప్‌-2, గ్రూప్‌-3 ఉమ్మడి ప్రిపరేషన్‌ ముఖ్యాంశాలు

- దాదాపు ఒకే రీతిలో గ్రూప్‌-2, గ్రూప్‌-3 సిలబస్.
- గ్రూప్‌-2లో ప్రత్యేకంగా నాలుగో పేపర్.
- రెండు పరీక్షలకు ఒకే సమయంలో సన్నద్ధమయ్యే వీలు.
- సిలబస్‌ బేరీజు వేసుకుంటూ.. ప్రత్యేక అంశాలకు నిర్దిష్టం సమయంలో ప్రిపరేషన్.
- పరీక్షకు నెల రోజుల ముందు నుంచి రివిజన్‌కు ప్రత్యేక ప్రాధాన్యం.
- షార్ట్‌ నోట్స్, రెడీ రెకనర్స్‌తో రివిజన్‌ వేగంగా పూర్తి చేసుకునే అవకాశం

క్లుప్తంగా...

'గగన్‌యాన్'లో మహిళా వ్యోమగామికి అవకాశం

షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ వెల్లడి



మాట్లాడుతున్న రాజరాజన్

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2024లో నిర్వహించబోయే గగన్‌యాన్ ప్రయోగంలో అంతరిక్షంలోకి పంపించడానికి ఒక మహిళకు అవకాశం కల్పించనున్నామని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించబోయే చంద్రయాన్–2 మిషన్‌కు ఒక మహిళే డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. షార్‌లోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో రాజరాజన్ మాట్లాడారు. చంద్రయాన్–2 ప్రయోగంలో కూడా ఎక్కువగా మహిళలే పాల్గొనడం విశేషమన్నారు. స్వయంకృషి, పట్టుదల ఉంటే జీవితంలో మహిళలు కూడా పురుషులకు ఏమీ తీసిపోరని కోయంబత్తూరు పీఎస్‌జీ కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ జయంతశ్రీ బాలకృష్ణన్ అన్నారు. అనంతరం షార్ కేంద్రంలోని మహిళలకు, విద్యార్థినులకు పలు రకాల ఆటల పోటీలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ ఆర్ వెంకట్రామన్, షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ ఇంకా షార్‌లో మహిళా ఇంజినీర్లు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

విమానంలో ధూమపానం.. యువతి అరెస్టు

దొడ్డబళ్లాపురం: విమానంలో ధూమపానం చేసిన యువతిని బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం భద్రతా సిబ్బంది అరెస్టు చేశారు. పశ్చిమబెంగాల్‌లోని సీల్దా జిల్లాకు చెందిన ప్రియాంక చక్రవర్తి (24) అనే యువతి ఆదివారం అర్ధరాత్రి కోల్‌కతా నుంచి బెంగళూరు వస్తున్న ఇండిగో విమానంలో ప్రయాణించింది. ఆమె విమానం టాయ్‌లెట్లోకి వెళ్లి ధూమపానం చేయసాగింది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో సిబ్బంది తలుపులు తెరవాలని కోరగా, ఆమె సిగరెట్‌ను డస్ట్‌బిన్‌లో పారవేసి తలుపులు తీసింది. పొగ వాసన రావడంతో సిబ్బంది తనిఖీ చేయగా డస్ట్‌బిన్‌లో సిగరెట్ దొరికింది. విమానం బెంగళూరులో దిగగానే ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బంది ఆమెను అదుపులోకి తీసుకున్నారు. విమానంలో పొగ తాగడం నేరం కాబట్టి కేసు నమోదు చేసి ప్రియాంకను అరెస్టు చేశారు.

ఇంధన సామర్థ్యంలో అగ్రగామి ఏపీ

- కేంద్ర సమాచార కమిషనర్ ప్రశంస




ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి

సాక్షి, అమరావతి: ఇంధన సామర్థ్యం, పొదుపులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా అవతరిస్తోందని కేంద్ర సమాచార కమిషనర్ హీరాలాల్ సమారియా ప్రశంసించారు. విద్యుత్ సరఫరా, పంపిణీ, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, తక్కువ ఖర్చుతో విద్యుత్ కొనుగోళ్లు, సమర్థవంతమైన మీటరింగ్ వ్యవస్థలో ఏపీ అవలంబిస్తున్న ఉత్తమ విధానాలను ఆయన అభినందించారు. ఇంధన సామర్థ్యం, వాతావరణ మార్పులను పరిష్కరించడంలో సూచనల కోసం ఏపీతో సహా అన్ని రాష్ట్రాలతో బుధవారం ఆయన ఢిల్లీలో సమావేశం నిర్వహించారు. భారత రాష్ట్రపతి నుండి జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు–2022 అందుకున్న ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా తీసుకుని ఇంధన సామర్థ్య చర్యలను వేగవంతం చేయాలని అన్ని రాష్ట్రాలను ఆయన కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డికి కమిషనర్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ఏపీకి జాతీయ స్థాయిలో గుర్తింపు

2030 నాటికి ఒక బిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించడంతో పాటు 2070 నాటికి పూర్తిగా నిర్మూలించాలనే జాతీయ వాతావరణ మార్పు లక్ష్యాల (పంచామృతం)కు దోహదపడే ప్రపంచ ఇంధన సామర్థ్య పద్ధతులు, అధునాతన సాంకేతికతలను అనుసరించాలని హీరాలాల్ సమారియా సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) అమలులో భాగంగా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ ఏపీలో రూ.400 కోట్ల విలువైన సుమారు 30 ఇంధన సామర్థ్య ప్రాజెక్టులను గుర్తించిందని కమిషనర్ తెలిపారు. ఏపీలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)ల్లో ప్రవేశపెట్టిన ఇంధనాన్ని ఆదా చేసే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) ఆధారిత సాంకేతికతకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వెల్లడించారు. ఇంధన సామర్థ్య కార్యక్రమాలు, విధానాలు గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను తగ్గించడానికి, వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి సహాయపడతాయని కమిషనర్ అన్నారు.

'సూపర్' సిక్స్టీస్




- 70 ఏళ్లకు పూర్తి స్థాయికి మేధో కార్యకలాపాలు
- 80– 90 వయసులో తక్కువ శక్తి వినియోగం.. గరిష్ట స్థాయిలో ఆలోచన
- జార్జి వాషింగ్టన్ మెడికల్ స్కూల్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: వృద్ధాప్యంలో వెంటాడే ఆరోగ్య సమస్యలతో పాటు మెదడు పనితీరు మందగించి జ్ఞాపక శక్తి క్షీణిస్తుందన్న వాదనల్లో నిజం లేదని అమెరికాలోని జార్జి వాషింగ్టన్ మెడికల్ స్కూల్ పరిశోధకులు చెబుతున్నారు. నిజానికి పెద్దల మెదడు ఎంతో ఆచరణాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటుందని, 60 ఏళ్లు దాటిన తర్వాత తీసుకునే నిర్ణయాలు చాలా సృజనాత్మకంగా ఉంటాయంటున్నారు. వీరి మెదడులో కుడి, ఎడమ హెమిస్ఫియర్స్ చాలా చురుగ్గా ఉండటంతో సృజనాత్మక ఆలోచనలు విస్తరిస్తున్నట్టు గుర్తించారు. చక్కటి జీవనశైలి, మానసికంగా చురుగ్గా ఉంటే మేధో సామర్థ్యాలు వయసుతో పాటు పెరుగుతాయే కానీ తగ్గవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 60 ఏళ్లు పైబడిన తర్వాత సృజనాత్మక కార్యకలాపాలను ప్రారంభించిన అనేక మందిపై ప్రయోగాలు నిర్వహించి ఈ ఫలితాలను రూపొందించారు.

నియంత్రణలో భావోద్వేగాలు..

చిన్నతనంలో ఏదైనా వస్తువు పాడు చేసినప్పుడు మెదడు విపరీతమైన ఒత్తిడికి లోనవుతుంది. యవ్వనంలో అదే పని చేసినప్పుడు కొంత కంగారు పడినా తక్కువ సమయంలోనే స్థిమితపడతారు. 60 ఏళ్లు దాటాక ఎలాంటి భావోద్వేగాలకైనా ఒకేలా స్థిరంగా స్పందిస్తారు. ఇక 70 ఏళ్ల వయసులో మేధో కార్యకలాపాలు గరిష్ట స్థాయికి చేరినట్లు నిర్ధారించారు. ముదిమి వయసులో మెదడులోని మైలిన్ (న్యూరాన్ల మధ్య సంకేతాలను వేగంగా పంపుతుంది) పరిమాణం పెరుగుతుంది. దీంతో సగటు యువకులతో పోలిస్తే 60 ఏళ్లు దాటిన వారిలో మేధో సామర్థ్యాలు 300 శాతం పెరుగుతాయని పరిశోధకులు చెబుతున్నారు.

వృద్ధాప్యం వయసుకే.. మెదడుకు కాదు



తొట్రుపాటు లేకుండా..

60 ఏళ్ల వయసు నుంచి వృద్ధులు నిర్ణయాలు తీసుకునేందుకు మెదడులోని రెండు హెమిస్ఫియర్స్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. '80–90 ఏళ్ల వయసులో ఒక వ్యక్తి మెదడు తక్కువ శక్తిని వినియోగించుకుని గరిష్ట స్థాయిలో ఆలోచిస్తుంది. అనవసరమైన విషయాలను వదిలేసి అవసరమైన వాటికే స్పందిస్తుంది' అని మాంట్రియల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ మోంచి తెలిపారు. అధ్యయనంలో భాగంగా నిర్వహించిన వివిధ రకాల పరీక్షల్లో విజయం సాధించేందుకు యువకులు చాలా గందరగోళానికి గురవగా 60 ఏళ్లు పైబడినవారు ఎలాంటి తొట్రుపాటు లేకుండా సరైన నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. చికాగో నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీలోని ఫీన్‌బర్గ్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ శాస్త్రవేత్తలు వీరిని 'సూపర్ ఏజెర్స్‌గా' అభివర్ణిస్తున్నారు. 80ల్లో ఉన్నవారు మేధోపరంగా చురుగ్గా ఉండేందుకు పెయింటింగ్, డ్యాన్స్, సంగీతం నేర్చుకోవడంతో పాటు స్నేహితులను కలుస్తూ భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించు కోవడంలో ముందున్నారని, వారు అద్భుతాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మే 15 నుంచి ఏపీఈఏపీసెట్

- మే 5న ఈసెట్, మే 24, 25 తేదీల్లో ఐసెట్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2023–24 విద్యా సంవత్సరంలో కీలకమైన ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఎంట్రన్స్ టెస్టుల షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఖరారు చేసింది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఈఏపీసెట్ (ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్), లేటరల్ ఎంట్రీ (డిప్లొమా విద్యార్థులు ఇంజనీరింగ్ రెండో ఏడాదిలో ప్రవేశం)కి సంబంధించిన ఈసెట్, ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఐసెట్ నోటిఫికేషన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు, పరీక్షల నిర్వహణ తేదీలను నిర్ణయించింది. ఈ మేరకు షెడ్యూల్ వివరాలను ఉన్నత విద్యా మండలి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈఏపీసెట్ పరీక్షలను మే 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈసెట్ మే 5న, ఐసెట్ మే 24, 25 తేదీల్లో నిర్వహిస్తారు.

ప్రవేశ పరీక్షల షెడ్యూల్ ఇలా...



అంశం	ఏపీఈఏపీసెట్	ఈసెట్	ఐసెట్
నోటిఫికేషన్	మార్చి 10	మార్చి 8	మార్చి 17
ఆన్‌లైన్ దరఖాస్తు గడువు	మార్చి 11-ఏప్రిల్15	మార్చి 10-ఏప్రిల్ 10	మార్చి 20-ఏప్రిల్ 19
రూ.550 ఆలస్య రుసుముతో	ఏప్రిల్ 16-ఏప్రిల్ 30	ఏప్రిల్ 11-ఏప్రిల్ 15	--
రూ.1,000 ఆలస్యరుసుముతో	మే 1-మే 5	--	ఏప్రిల్ 20-ఏప్రిల్ 26
రూ.2,000 ఆలస్య రుసుముతో	--	ఏప్రిల్ 16-ఏప్రిల్ 19	ఏప్రిల్ 27-మే
రూ.3,000 ఆలస్య రుసుముతో	--	--	మే 4- మే 10
రూ.5,000 ఆలస్య రుసుముతో	మే 6-మే 12	ఏప్రిల్ 20-ఏప్రిల్ 24	మే 11-మే 15
రూ, 10,000 ఆలస్య రుసుముతో	మే 13, 14	--	--
దరఖాస్తు వివరాల సవరణ	మే 4-6	--	మే 16, 17
హాల్ టికెట్‌ల డౌన్‌లోడ్	మే 7	ఏప్రిల్ 28	మే 20
ఆన్‌లైన్ పరీక్ష	మే 15-18 (ఎంపీసీ), 22, 23 (బైపీసీ)	మే 5	మే 24, 25

నాలుగో రోజైనా జాడ దొరికేనా?

- తల్లి పులి కోసం 300 మందితో అన్వేషణ
- నిలకడగా పులి పిల్లల ఆరోగ్యం



కోడి కాలేయం తింటున్న పులి కూనలు

ఆత్మకూరు రూరల్/కొత్తపల్లి: శ్రీశైలం–నాగార్జున సాగర్ పులుల అభయారణ్యంలో 4 ఆడ పిల్లలను ఈనిన 'టీ108' అనే పెద్దపులి వాటికి దూరమై 3 రోజులు గడిచిపోయింది. మరో వైపు తల్లీ బిడ్డల పునరేకీకరణ (రీయూనియన్)కు అటవీ అధికారులు పూర్తిగా శ్రమిస్తున్నారు. 300 మంది ఎన్ఎస్‌టీఆర్ (నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్) సిబ్బంది, అధికారులు విడతల వారీగా పాద పరిశీలన (ఫుట్ పేట్రోలింగ్) చేస్తున్నారు. పులుల ప్రవర్తనాంశాలను పరిశీలిస్తే తల్లి పులి తన పిల్లల కోసం గరిష్టంగా 4 రోజుల వరకు వెతికే యత్నం చేస్తుందని పులి జీవన విధానంపై పరిశోధనలు చేసిన వారు చెబుతున్నారు. అయితే ఇంకో 24 గంటలు గడిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక తల్లి పులి తన బిడ్డలను గుర్తించి అక్కున చేర్చుకోవడమన్నది అసాధ్యమంటున్నారు. తల్లి పులి జాడ దొరకని పక్షంలో పులి కూనలను జంతు ప్రదర్శన శాలకు తరలించే అవకాశం ఉంది. కాగా, పులి కూనల ఆరోగ్యం నిలకడగా ఉందని ఎన్ఎస్‌టీఆర్ (నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్) డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అపావ్ చెప్పారు. నంద్యాల జిల్లా ఆత్మకూరులోని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పులి కూనలు చక్కగా ఆహారం తీసుకుంటున్నాయని, కోడి కాలేయం ముక్కలను ఇష్టంగా భుజించాయని తెలిపారు. 300 మంది ఎన్ఎస్‌టీఆర్ సిబ్బంది, అధికారులు విడతల వారీగా పాద పరిశీలన (ఫుట్ పేట్రోలింగ్)లో ఉన్నట్లు వివరించారు. తల్లిని విడిచిన కూనలు కొంత షాక్‌లో ఉంటాయి కాబట్టి ఎక్కువ దూరం ప్రయాణించడం వాటికి ఇబ్బంది అయిన కారణంగా మొదట తల్లిని అన్వేషించి ఆ తరువాత పిల్లలను ఆ పులి వద్దకు చేర్చే వ్యూహాన్ని పాటిస్తున్నామన్నారు. స్నిఫ్పర్ డాగ్స్‌తో (శునక శోధన), డ్రోన్ కెమెరాలతో పులిని గుర్తించే యత్నం చేయడం లేదని, అది ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదముందని చెప్పారు.

ఆ పాదముద్ర తల్లి పులిదేనా?

నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని ముసలిమడుగు, చిన్నగుమ్మడాపురం గ్రామాల మధ్యన ప్రధాన రహదారికి కొద్ది దూరంలో ఆటోడ్రైవర్‌కు పెద్దపులి బుధవారం కనిపించింది. ఈ విషయాన్ని అక్కడే ఉన్న గొర్రెల కాపరి చిన్న వెంకటేశ్వర్లుకు అతడు తెలపగా..అతను చూసేలోపు పులి అడవిలోకి వెళ్లిపోయింది. అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకొని పులి కాలిముద్రలను పరిశీలించారు. అచ్చిరెడ్డికుంట వరకు పెద్దపులి కాలిముద్రలు ఉన్నట్లు గుర్తించారు. అక్కడినుంచి పులి ఎటువైపుగా వెళ్లిందనే కోణంలో గాలింపునకు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, ఈ పులి పాదముద్రలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అచ్చు తీసి టీ108 తో సరిపోల్చి నిర్ధారించగలిగితే తల్లిని అన్వేషించే పనిలో కొంత పురోభివృద్ధి సాధించినట్లేనని శ్రీశైలం అటవీ శాఖ ఫీల్డ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆత్మకూరు డీఎఫ్‌వో అలెన్‌చాంగ్‌టెరాన్ తెలిపారు.

'పోలవరం' అగాధాలు పూడ్చే పనులు ప్రారంభం



అగాధాలను పూడ్చే పనులు ప్రారంభించిన దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్‌వాల్‌కు ఇరువైపులా పడిన అగాధాలను పూడ్చే పనులను ప్రారంభించారు. గ్యాప్–1, గ్యాప్–2లో వరదల ప్రభావంతో ఏర్పడిన ఈ అగాధాలను పూడ్చే పనుల్ని డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్ (డీడీఆర్‌పీ) ఆమోదించిన డిజైన్ ప్రకారం చేపడుతున్నట్లు ఎస్ఈ నరసింహమూర్తి చెప్పారు. ఇసుకను డంపింగ్‌చేసి డోజర్ల ద్వారా గోతులు నింపుతున్నామని, ఇసుక నింపిన తరువాత వైబ్రో కాంపాక్షన్ విధానం ద్వారా ఆ ప్రాంతాన్ని గట్టిపరుస్తామని తెలిపారు. ఈ పనులు పూర్తయిన తరువాత నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) డయాఫ్రమ్‌వాల్ పటిష్టతపై ఇచ్చిన నివేదిక ఆధారంగా, డీడీఆర్‌పీ ఆమోదం పొందిన తరువాత మిగిలిన పనులు చేపడతామన్నారు. డయాఫ్రమ్‌వాల్ పనులు పూర్తయిన తర్వాత ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. ఈఈలు మల్లికార్జునరావు, పాండురంగయ్య, మేఘ ఇంజనీరింగ్ సంస్థ సీజీఎం ముద్దుకృష్ణ, జనరల్ మేనేజర్ గంగాధర్, మురళి పనులను పర్యవేక్షిస్తున్నారు.

గ్రేడ్–2 వీఆర్‌వోల సమస్యల పరిష్కారానికి కృషి

ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న ఏపీజీఈఎఫ్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి

కృష్ణలంక (విజయవాడతూర్పు): రాష్ట్రంలోని గ్రేడ్–2 వీఆర్‌వోల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రేడ్–2 వీఆర్‌వోస్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ జీవో నంబర్ 13ను అమెండ్‌మెంట్ చేసి వీఆర్ఏ నుంచి ప్రమోషన్ పొందిన 3,795 మంది గ్రేడ్–2 వీఆర్‌వోలందరికీ ప్రొబేషన్ డిక్లరేషన్ చేయటం, బదిలీలు తదితర సమస్యల పరిష్కార దిశగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలో ప్రమోషన్ కచ్చితంగా పే స్కేల్‌తోనే ఇవ్వాలన్నారు. కానీ జీవో నంబర్ 13 ప్రకారం వీఆర్ఏలకు గ్రేడ్–2 వీఆర్‌వోలుగా ప్రమోషన్ కల్పిస్తూ కేవలం రూ.15వేలు గౌరవ వేతనం, ఒక సంవత్సరం తర్వాత సీపీటీ పరీక్ష, సర్వే పరీక్ష పాసై ఉండాలని, రెండు సంవత్సరాల ప్రొబేషన్ కాలం పూర్తయిన తర్వాత మాత్రమే పే స్కేల్ ఇచ్చి రెగ్యులర్ చేస్తామని నిబంధనలు పెట్టారని తెలిపారు. ఒక సంవత్సరం లోపు నిర్వహించాల్సిన సర్వే పరీక్షను రెండున్నరేళ్ల తర్వాత నిర్వహించారని, దీంతో గ్రేడ్–2 వీఆర్‌వోలకు ప్రొబేషన్ పీరియడ్ డిక్లరేషన్ కాకుండా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.సురేష్, సంయుక్త కార్యదర్శి పి.నాగరాజు, కోశాధికారి ఎం.హరినాథ్, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, 26 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, గ్రేడ్2 వీఆర్‌వోలు పాల్గొన్నారు.

షీర్ వాల్ టెక్నాలజీతో పేదల ఇళ్లు

- ముందుకొచ్చిన పలువురు నిర్మాణదారులు
- అమలాపురంలో పైలెట్‌గా మోడల్ ఇళ్ల నిర్మాణం



షీర్ వాల్ పద్ధతిలో నిర్మిస్తున్న ఇల్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణంలో షీర్ వాల్ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చే అవకాశాలను పరిశీలిస్తున్నారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద 30 లక్షలకు పైగా గృహాల నిర్మాణాన్ని తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే రెండు దశల్లో 18.63 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులివ్వగా ఇప్పటికే 17.22 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోంది. ఆప్షన్–3(ప్రభుత్వమే నిర్మించి ఇచ్చే ఇళ్లు) గృహాల నిర్మాణానికి షీర్ వాల్ పరిజ్ఞానాన్ని వినియోగించటాన్ని గృహ నిర్మాణ శాఖ పరిశీలిస్తోంది.

అమలాపురం మున్సిపాలిటీలో

లాభాపేక్ష లేకుండా ప్రభుత్వం లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి ఇస్తున్న రూ.1.80 లక్షలు, అదనపు సాయం కింద బ్యాంక్ రుణం రూపంలో అందచేసే రూ.35 వేలతోనే షీర్ వాల్ పద్ధతిలో ఇళ్ల నిర్మాణానికి కొందరు నిర్మాణదారులు ముందుకొచ్చారు. వేగంగా ఇళ్ల నిర్మాణంతో పాటు భూకంపాలు, తుపాన్లను సైతం తట్టుకునేలా ఇంటి నిర్మాణం పూర్తవుతుండటంతో ఈ పరిజ్ఞానం వైపు మొగ్గు చూపుతున్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించిన బోడసకుర్రు వద్ద వైఎస్సార్ జగనన్న కాలనీలో కొఫియ గ్రూప్‌నకు చెందిన అజయ్‌హోమ్స్ అనే సంస్థ పైలట్‌గా షీర్ వాల్ పద్ధతిలో ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతోంది. నాణ్యతను పరీక్షించిన అనంతరం ఈ పద్ధతిని రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన లేఅవుట్లకు విస్తరించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులు నిర్ణయించారు. షీర్ వాల్ పద్ధతిలో ఇటుకలు అవసరం లేకుండా సిమెంట్, కాంక్రీట్, ఇనుముతో కాంక్రీట్ గోడలు నిర్మిస్తారు.

ఉగాదికి ఐదు లక్షల ఇళ్లు...

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం రెండు దశల్లో 17.22 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం కొనసాగుతుండగా ఇప్పటికే 3,00,986 గృహాల నిర్మాణం పూర్తయ్యింది. అత్యధికంగా విజయనగరం జిల్లాలో 25,573, చిత్తూరులో 25,072, పశ్చిమ గోదావరిలో 19,205 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఉగాది నాటికి 5 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. గడువులోగా లక్ష్యాన్ని చేరుకునేలా నిర్మాణ పనులను వేగవంతం చేశారు.

నాణ్యత పరీక్షల అనంతరం..

షీర్ వాల్ పద్ధతిలో ఇళ్ల నిర్మాణానికి నిర్మాణదారులు ముందుకొస్తున్నారు. అమలాపురం మున్సిపాలిటీ పరిధిలో పైలెట్‌గా ఈ పద్ధతిలో ఒకటి రెండు ఇళ్లను నిర్మిస్తాం. వీటి నాణ్యతను పరీక్షించిన అనంతరం ఈ పద్ధతిని కొనసాగిస్తాం.

– లక్ష్మీ షా, గృహ నిర్మాణ సంస్థ ఎండీ

చదువుల తల్లులు

ఉన్నత విద్యలో ఏటా పెరుగుతున్న అమ్మాయిల చేరికలు

2019-20లో ఉన్నత విద్యలో 1.88 కోట్ల మంది మహిళలు

- 2020–21లో ఆ సంఖ్య 2.01 కోట్లకు చేరిక
- ప్రస్తుతం మొత్తం చేరికల్లో 49 శాతం వీరే
- స్టెమ్ కోర్సుల్లోనే అత్యధికం
- ఐఐటీల్లో 20 శాతం, ఎన్ఐటీల్లో 23 శాతానికి పైగా మహిళలు



సాక్షి, అమరావతి: దేశంలో ఉన్నత చదువుల్లో మహిళల చేరికలు ఏటా గణనీయంగా పెరుగుతున్నాయి. పదేళ్ల క్రితం అంతంతమాత్రంగా ఉన్న చేరికలు ప్రస్తుతం భారీగా వృద్ధి చెందాయని గణాంకాలు చెబుతున్నాయి. ఒకప్పుడు బీఏ, బీకాం, ఎంఏ, ఎంకాం వంటి కోర్సులకే పరిమితమైన అమ్మాయిలు ఇప్పుడు స్టెమ్ (సైన్సు, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సులకు పెద్దపీట వేస్తున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో 2016లో 8 శాతంగా ఉన్న మహిళల చేరికలు 2021లో 20 శాతానికి పెరగడం విశేషం. అలాగే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)ల్లో కూడా వీరి చేరికలు 23 శాతంగా ఉండడం గమనార్హం. ఐఐటీలు, ఎన్ఐటీలు వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో మహిళల చేరికలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం వారికోసం ప్రత్యేకంగా సూపర్ న్యూమరరీ సీట్లు కేటాయించడం ఇందుకు దోహదపడింది. 2017లో ఐఐటీల్లో చేరిన మహిళలు 995 మంది ఉండగా 2021 నాటికి ఈ సంఖ్య 3 వేలకు చేరుకుంది. ఐఐటీ, ఎన్ఐటీల్లోనే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ స్టెమ్ కోర్సులకే అమ్మాయిలు ప్రాధాన్యమిస్తున్నారు. జాతీయ ఉన్నత విద్యా సర్వే నివేదిక ప్రకారం.. 2016–17లో స్టెమ్ కోర్సుల్లో చేరిన మహిళలు 41 లక్షలుగా ఉండగా 2020–21లో అది 44 లక్షలకు చేరింది. అమెరికా, బ్రిటన్, కెనడా వంటి దేశాల్లో కన్నా మనదేశంలో స్టెమ్ కోర్సులు అభ్యసిస్తున్న మహిళలు ఎక్కువ కావడం విశేషం. మనదేశంలో స్టెమ్ కోర్సులు చేస్తున్న మహిళలు 43 శాతం కాగా అమెరికాలో 34 శాతం, బ్రిటన్‌లో 38 శాతం, కెనడాలో 31 శాతం మాత్రమే.

2 కోట్లకు పైగా ఉన్నత విద్యార్థినులు

కాగా కొద్దికాలం క్రితం విడుదలైన ఆలిండియా సర్వే ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఐష్) నివేదిక ప్రకారం.. 2020–21లో ఉన్నత విద్యలో పురుషులు, మహిళల మొత్తం చేరికలు 4.14 కోట్లుగా ఉన్నాయి. 2019–20లో ఈ మొత్తం చేరికలు 3.85 కోట్లు కాగా ఏడాదిలో 30 లక్షల మంది అదనంగా చేరారు. వీరిలో 2019–20లో ఉన్నత విద్యలో చేరిన మహిళలు 1.88 కోట్లు ఉన్నారు. 2020–21లో ఈ సంఖ్య 2.01 కోట్లకు పెరిగింది. 2014–15 నాటి మహిళల చేరికల సంఖ్యతో పోలిస్తే దాదాపు 44 లక్షల మంది అదనంగా చేరారని ఐష్ నివేదిక పేర్కొంది. 2014లో పురుషులు, మహిళల మొత్తం చేరికల సంఖ్యలో మహిళలు 45 శాతం మాత్రమే ఉండగా.. ఇప్పుడు మొత్తం చేరికల్లో మహిళలు 49 శాతంగా ఉండడం విశేషం.

పాఠశాల విద్యలోనూ బాలికల సంఖ్య జంప్..

పాఠశాల విద్యలోనూ బాలికల చేరికలు గణనీయంగా పెరుగుతున్నాయి. 2021–22 యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడైస్) గణాంకాల ప్రకారం.. దేశంలో పాఠశాల విద్యలో (ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు) బాలికలు 12,73,35,252 మంది ఉన్నారు. కరోనా సమయంలో మొత్తం చేరికలు తగ్గిన నేపథ్యంలో బాలికల సంఖ్య కూడా కొంత తగ్గింది. ఆ తర్వాత మళ్లీ వారి చేరికలు పెరుగుతూ వస్తున్నాయి.

దేశంలో పాఠశాలల్లో బాలికల సంఖ్య ఇలా..

2016-17	12,53,81,531
2017-18	12,54,86,768
2018-19	12,49,43,851
2019-20	12,71,28,112
2020-21	12,70,14,948
2021-22	12,73,35,252

దేశంలో ఉన్నత విద్యలో మహిళల చేరికలు ఇలా..

2016-17	1,67,25,310
2017-18	1,74,37,703
2018-19	1,81,89,500
2019-20	1,88,92,612
2020-21	2,01,42,803

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943